ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
కడప
బుధవారం 23 ఆగస్టు 2017

మూతపడిన బ్యాంకులు



కడపలో ఆందోళన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

14 లో

స్తంభించిన రూ.180 కోట్ల లావాదేవీలు

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు మంగళవారం నిర్వహించిన బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది ఒకరోజు సమ్మెతో జిల్లాలో 275 బ్యాంకు శాఖలు మూతబడ్డాయి. దాదాపు రూ.180 కోట్ల మేర లావాదేవీలు స్తంభించాయి. అన్ని శాఖలు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో నిర్వహిస్తున్న ఏటీఎంలు మాత్రమే పనిచేశాయి. దాదాపు 60 శాతం ఏటీఎంలు పనిచేయలేదు.

వంట గ్యాస్ మరింత భారం

- కేంద్రం సబ్సిడీ కట్..!
- ఎత్తివేతకు కేంద్రం నిర్ణయం
- వినియోగదారులకు చేదు అనుభవం
- జిల్లాలో 5 లక్షల పైచిలుకు కుటుంబాలపై భారం




కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న ప్రజానీకానికి నిరాశ నిస్పృహలు ఎదురు కానున్నాయి. ఇందులో ప్రధానంగా ప్రజల నిత్యావసరాల్లో భాగమైన వంట గ్యాస్ సబ్సిడీని క్రమంగా ఎత్తివేయాలనే నిర్ణయాన్ని తీసుకుంది. ఈ అంశం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతుందనే వాదన వినిపిస్తోంది. ప్రతి నెల సిలిండర్‌పై రూ.4 పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి తర్వాత సబ్సిడీ పూర్తిగా రద్దయి మొత్తం చెల్లించాల్సిన పరిస్థితి ఎదురు కానుంది. ఫలితంగా జిల్లాలో 5,14,978 మంది వినియోగదారులపై ఆర్థికంగా భారం పడనుందనేది ప్రాథమిక అంచనా.

6 లో

మిగిలింది.. మూడు వారాలే..

నీరులేక ఎండుతున్న పంటలు ● కర్షకుడికి కాడి కష్టం.. కూలీ నష్టం ● అప్పుల ఊబిలో అన్నదాత

ముందే వచ్చిన తొలకరి పుడమిపుత్రులను పులకరింపజేసింది. కష్టాల్లేకుండా ఖరీఫ్ సాగుకు వూతమిచ్చిందని పొంగిపోయారు. పదును చూసి పంట విత్తనాలు నాటామనుకున్నారు. ఇక్కడి నుంచి వరుణుడి జూదం మొదలైంది. ఆశల మబ్బుల నుంచి చినుకు జాడ కరువైంది. ఒకవైపు ఈదురుగాలులతో తేమశాతం ఆవిరైంది. మొలక దశలో ఎండిపోతున్న పంట చూసి కృషీవలుడు కుంగిపోతున్నాడు. కొన్ని పొలాల్లో విత్తనాలు మొలకెత్తిన వూసేలేదు. దీంతో పెట్టుబడితో పాటు కాడికష్టం.. కూలి నష్టం మిగిల్చింది. ఖరీఫ్ ఆశల సాగు సెప్టెంబరు 15తో ముగియనుండటంతో మిగిలింది మూడు వారాల కాలమే కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



6 లో

క్లైమాక్స్‌లో గండికోట విచారణ

6 లో



- అఫిడవిట్లలోనూ అక్రమాలు
- వందమందికి పైగా విద్యార్థులకు పరిహారం
- వెలుగు చూడనున్న రూ. కోట్ల అవినీతి
- రుజువైతే రికవరీలు, క్రిమినల్ కేసులు
- వ్యవహారంపై కలెక్టర్ సీరియస్
- త్వరలో విచారణ నివేదిక సిద్ధం

గండికోట రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం పంపిణీ విషయంలో సాగుతున్న విచారణ తుది దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. మరో రెండు, మూడురోజుల్లో విచారణ నివేదికను అధికారులు సిద్ధం చేయనున్నారు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు ప్రభుత్వం వందల కోట్ల రూపాయలను పరిహారంగా మంజూరు చేసింది. అర్హులను గుర్తించడంలో అధికారులు చేసిన తప్పిదాలు ఇప్పుడు వారి మెడకు చుట్టుకోనున్నాయి. వివాహమైన ఆడపిల్లలకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు కూడా వక్రమార్గం పట్టినట్టు విచారణలో వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి సమర్పించిన అఫిడవిట్లలోనూ అక్రమాలు జరిగినట్టుగా గుర్తించారు. జాయింట్ కలెక్టర్ -2 ఆధ్వర్యంలో సాగుతున్న ఈ విచారణ నివేదికను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు సమాచారం.



16 లో

25 నుంచి తాళ్ళపాకలో పవిత్రోత్సవాలు

పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు జన్మించిన తాళ్ళపాకలోని చెన్నకేశవస్వామి వారి పవిత్రోత్సవాలు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరగనున్నాయి.

ఈ-పాస్ విధానంలో నిత్యావసర వస్తువుల సరఫరా

- జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు శ్రీకారం
- సిద్దవటం, ఎర్రగుంట్ల నుంచి ప్రారంభం
- త్వరలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి వెల్లడి

కడప, కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని ప్రభుత్వ చౌక దుకాణాలకు ఈ-పాస్ విధానంలో ఆయా మండల స్టాక్ పాయింట్ల నుంచి నిత్యావసర సరుకుల సరఫరాకు చర్యలు తీసుకున్నామని, ముందుగా సిద్దవటం, ఎర్రగుంట్ల మండలాల నుంచి ప్రయోగాత్మకంగా అమలుకు శ్రీకారం చుట్టామని దీనివల్ల స్టాక్ పాయింట్లలో జమాలెక్కల వివరాలు సక్రమంగా తెలిసే అవకాశం ఉందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇదివరకు మండల స్టాక్ పాయింట్ల నుంచి నిత్యావసర వస్తువులు చౌకదుకాణాలకు చేరడంలో వ్యత్యాసాలు రావడం వంటి విషయాలపై ఫిర్యాదులు ఉండేవన్నారు. అయితే ఈ-పాస్ విధానం వల్ల అలాంటి విషయాలకు తావుండదన్నారు. జిల్లాలో 7,61,577 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. కాగా కొత్తగా జన్మభూమి సభల్లో అందించిన రేషన్‌కార్డులు పొందిన 2300 మందికి రేషన్ అందలేదనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. అయితే వీటికి సంబంధించి సాంకేతిక సమస్య ఏర్పడటంతోనే ఆ పరిస్థితి నెలకొందన్నారు. కాగా సాంకేతిక సమస్య వల్ల ఏర్పడిన లోపాలను సవరించి వారందరికీ సెప్టెంబరు నుంచి ఆయా చౌక దుకాణాల ద్వారా రేషన్ అందించనున్నట్లు తెలిపారు. ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కోసం దీపం పథకం కింద జిల్లాలో 2,09,134 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 1-1-2015 నుంచి ఇప్పటి వరకు 1,15,717 మందికి అందించారన్నారు. మిగిలిన వారికి అందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మరోవైపు పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే వారికి, అంగన్‌వాడీ కేంద్రాలకు కలిపి 3400 గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి

త్వరలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు : త్వరలో జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని లింగారెడ్డి తెలిపారు. కడపతో పాటు ముఖ్య పట్టణాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి క్యాంటీన్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి విజయరాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్యంలో జిల్లా ఫస్ట్

శంకర్‌బాలాజీ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్



ఇంటర్వ్యూ

కడప, సెవెన్‌రోడ్స్

ధూపదీప నైవేద్యం కింద ఒక్కొక్క దేవాలయానికి రూ.5 వేలు చొప్పున ఖర్చుల నిమిత్తం అందజేస్తున్నాం. జిల్లాలో 186 దేవాలయాలకు చెల్లిస్తున్నాం. ఈ స్థాయిలో చెల్లించడంలో కడప రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూ ఇలా...

ప్రశ్న : ధూపదీప నైవేద్యం ఎలా కొనసాగుతుంది ?

జవాబు : రాష్ట్రంలో 1350 దేవాలయాలకు ధూపదీప ఖర్చులు అందిస్తుంటే అందులో ఒక్క కడప జిల్లాలోనే 186 దేవాలయాలకు అందిస్తున్నాము.

ప్రశ్న : అర్చకుల వేతనాలు పెరిగాయా ?

జవాబు : గతంలో అర్చకులకు రూ.2500 జీతం ఇచ్చేవారు ఆ జీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలకు పెంచింది. రూ. 5 వేల లోపు జీతం తీసుకునే అర్చకులందరికీ ఇదే మొత్తాన్ని అందించడం గమనించదగ్గ విషయం. అలాగే పది వేల లోపు తీసుకునే వారికి పది వేలు అందిస్తున్నాం.

ప్రశ్న : దివ్యదర్శనం ఎలా కొనసాగుతోంది ?

జవాబు : భేషుగ్గా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన భక్తులకు దైవదర్శనం చేయించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో ఇప్పటికి జిల్లాలో 24 మండలాల్లో పూర్తి చేశాం. ప్రజల నుంచి విశేష స్పందన ఉంది.

ప్రశ్న : ఎప్పటి వరకు కొనసాగిస్తారు?

జవాబు : జిల్లాలో ఇంకా 21 మండలాల్లో దివ్యదర్శనం కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. వచ్చే సంవత్సరం మార్చిలోగా లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

ప్రశ్న : లీజు విధానానికి స్పందన ఎలా ఉంది ?

జవాబు : చాలా మంది తెలియక దేవాదాయ భూములను వినియోగించుకుంటున్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోకుండా లీజు విధానంతో వారికి అప్పగిస్తున్నాము. ఇప్పటికి 850 ఎకరాలు లీజు విధానం కింద అప్పగించాం.

పలు మండలాల్లో వర్షం

- 21 మండలాల్లో చినుకు జాడలేదు
- రాయచోటిలో అత్యధికంగా 40 మి.మీ.
- జిల్లా సరాసరి వర్షపాతం 6.2 మి.మీ.

కడప, ఐటీఐ సర్కిల్ : జిల్లాలో గత వారం రోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. పగటి పూట వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు కాస్తున్నప్పటికీ సాయంత్ర సమయంలో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుంటే మరో వైపు కొన్ని మండలాల్లో చినుకు జాడే లేదు. సోమవారం రాత్రి 30 మండలాల్లో వర్షం కురవలేదు. కడప డివిజన్ పరిధిలోని రాయచోటి మండలంలో అత్యధికంగా 40.6 మి.మీ. వర్షం కురవడంతో జిల్లాలో సరాసరి 6.2 మిల్లీమీటర్లు నమోదైంది.

జిల్లాలో వర్షం ఇలా

కడప డివిజన్ పరిధిలోని వల్లూరు 1.4 మి.మీ., పెండ్లిమర్రి 2.4 మి.మీ., సీకే దిన్నె 4.4, చెన్నూరు 4.8, ఖాజీపేట 1.2 మి.మీ., రాయచోటి 40.6 మి.మీ., చిన్నమండెం 25.0 మి.మీ., సంబేపల్లె 14.6 మి.మీ., వీరబల్లి 38.4 మి.మీ., టి.సుండుపల్లె 18.4 మి.మీ., ఎల్‌ఆర్‌పల్లె 2.2 మి.మీ., రామాపురం 5.0 మి.మీ., గాలివీడు 25.0 మి.మీ., రాజంపేట డివిజన్ పరిధిలో రాజంపేట 24.2 మి.మీ., నందలూరు 3.6 మి.మీ., పెనగలూరు 9.6 మి.మీ., ఓబులవారిపల్లె 4.8 మి.మీ., పుల్లంపేట 10.2 మి.మీ., బద్వేల్ 22.2 మి.మీ., పోరుమామిళ్ల 2.2 మి.మీ., బి.కోడూరు 2.4 మి.మీ., కలసపాడు 5.4 మి.మీ., ఎస్‌ఏ కాశినాయన 2.0 మి.మీ., బి.మఠం 4.8 మి.మీ., సిద్దవటం 2.0 మి.మీ., జమ్మలమడుగు డివిజన్ పరిధిలో మైదుకూరు 2.4 మి.మీ., పులివెందుల 4.0 మి.మీ., లింగాల 10.2 మిల్లీమీటర్లు.

చినుకు పడని మండలాలు

కడప, కమలాపురం, ఎర్రగుంట్ల, వీఎన్ పల్లె, చక్రాయపేట, బద్వేల్, గోపవరం, అట్లూరు, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురం, ప్రొద్దుటూరు, చాపాడు, దువ్వూరు, రాజుపాళెం, వేంపల్లి, వేముల, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో చినుకు జాడే లేదు.

పాపం పోలమ్మ..!



మూగ, మతిస్థిమితంలేని మహిళ దుర్భరజీవనం గడుపుతున్న వైనం

అన్యాయాన్ని బయటికి చెప్పలేదు. అసలు అన్యాయం అంటే ఎలాఉంటుందో తెలియని స్థితి. ఆమె దుర్భర జీవితంలో ఆశపెట్టి కాటేశారు. ఎవరనే విషయం తెలుసుకున్నా ఆ పాపాన్ని రూ. 50 వేలతో కడికేసుకున్నారు. కడుపు తీయించాలనుకున్నా డాక్టర్లు చేతులెత్తేయడంతో చివరకు పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఏడాది బిడ్డతో కనీసంకడుపు నింపలేని స్థితిలో పోలమ్మ దుర్భర జీవితం వివరాల్లోకెళితే....

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు మండలంలోని వెంకటరెడ్డిపల్లె పంచాయితీ దళితవాడ వాసి మూగయవతి తల్లితో కలసి ఆరు నెలల కిందట నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం దాచేరువుకు వెళ్లింది. ఆమెకు పూలు, గాజులు అమితమైన ఇష్టం. ఈ బలహీనతను గ్రహించిన కామాంధు డు ఆమెపై కన్నేశాడు. చెప్పినట్టు వింటే పూ లు, గాజులు ఇస్తానని ఎరేశాడు. కుట్రను గ్రహించలేని మూగయువతి కామాంధుని మాట లు వినడంతో ఆమె గర్భవతి అయింది. విషయం తెలుకున్న కుటుంబీకులు ఆమెను దాచెరువుకు తీసుకెళ్లి పంచాయితీ చేశారు. గ్రామంలోని 30మంది యువకుల్లో వరుసగా నిలబెట్టగా ఒకరిని చూపించింది. దీంతో అక్క డ కామాంధుడిని గ్రామస్తులు పంచాయితీలో నిలిపి బేరాలు చేశారు. చివరకు రూ.50 వేలకు గర్భం తీయించుకోమని పెద్దలు తేల్చినట్లు మూగయువతి బంధువులు వివరించారు. అబార్షన్‌చేస్తే పెద్దప్రాణానికి ముప్పుఉంటుందని వైద్యులు చేతులెత్తేశారు. చివరకు పోలమ్మకు ఆడపిల్లపుట్టింది. మతిస్థిమితంలేని పోలమ్మకు బిడ్డ ఉందనే జ్ఞానం కూడా లేదు. ఏడాది పాపతో పోలమ్మ అన్నసురేంద్ర, వదిన వద్ద ఉంటోంది. పోలమ్మ అన్నదమ్ములు సుబ్రహ్మణ్యం, సురేంద్ర కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం పాపపాలకు కూడా జరిగే పరిస్థితిలో లేదని సురేంద్ర, సుబ్రహ్మణ్యంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు న్యాయస్థానంలో రేప్‌కేసు జరుగుతోందని వారు వివరించారు. కేసు కూడా ఏమైందోకూడా తెలియనిపరిస్థితి ఏర్పడిందని మూగమహిళ అన్నదమ్ములు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, నెల్లూరుజిల్లా కలెక్టర్, వెంకటగిరి పోలీసులకు విన్నవించామని, వెంక టగిరిలోని దాచేరువు పెద్దమనుషులకు కూడా చెప్పామని వివరించారు. ప్రభుత్వం, మహిళా కమిషన్, ఎస్టీ కమిషన్, మానవహక్కుల చైర్మన్లు స్పందించి తనచెల్లెలకు న్యాయం చేయాలని మూగయువతి అన్న సుబ్రహ్మణ్యం, సురేంద్ర వేడుకుంటున్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

16 మంది స్మగ్లర్ల అరెస్టు ● 16 దుంగలు, వాహనాలు స్వాధీనం

పోరుమామిళ్ల: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని మైదుకూరు డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. పోరుమామిళ్ల సీఐ పద్మనాభన్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పోరుమామిళ్ల మండలం వెంకటాపురం వద్ద, కలసపాడు మండలం నీలాపురం వద్ద, కాశినాయన మండలం ఇటుకుల్లపాడు తోకరస్తా వద్ద ఏకకాలంలో జరిపిన దాడుల్లో 16మంది స్మగ్లర్లు, టాటా ఏసీ వాహనం, మోటారుబైకు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైదుకూరు డీఎస్పీ విలేఖరులతో మాట్లాడుతూ ప్రముఖ మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ బెంగుళూరు వాసి శశికుమార్, నెల్లూరుజిల్లా ఇంజిమూరు వాసి రామనాథ్‌రెడ్డి అనుచరులు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంపై దాడులు నిర్వహించామన్నారు. ఇందులో రామేశ్వరం వాసి శ్రీనివాసులు, గిద్దలూరుకు చెందిన షేక్ నాయబ్‌రసూల్, బసనపల్లెకు చెందిన రత్తయ్య, ఎగువరామాపురం వాసి ఆవుల పోలిరెడ్డి, అహోబిలంకు చెందిన సవరం వీరయ్య, రామేశ్వరానికి చెందిన సవరం క్రిష్ణయ్యను అరెస్ట్ చేసి వారి నుంచి టాటా ఏసీ వాహనం, ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కలసపాడు పరిధిలో కర్నూలు జిల్లా పాణ్యం వాసి నల్లు కిట్టయ్య, దిగువమెట్ట తాండ వాసి ఎం. రామక్రిష్ణనాయక్, కోటకొండ గ్రామానికి చెందిన మల్లేశ్వరుడు, ఎగువరామాపురానికి చెందిన రసూల్‌బాష, రామేశ్వరానికి చెందిన సవరం రామయ్య అనేవారిని అరెస్ట్‌చేసి వారి నుంచి 141 కిలోల ఐదు ఎర్రచందనం దుంగలు, ఏపీ27ఏపి4918నెంబరు ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బి.కోడూరు పరిధిలో చాపాడు మండలం ఖాదరపల్లెకు చెందిన షేక్ పక్కూర్‌వల్లీ, షేక్ మహబూబ్‌బాష, కడప భాగ్యనగరం వాసి సురభి మహేష్, రామేశ్వరానికి చెందిన సవరం శ్రీనివాసులు, ఖాదర్‌పల్లెకు చెందిన షేక్ ఆలిని అరెస్ట్‌చేసి వారి నుంచి 160 కిలోల ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు మోస్ట్‌వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్లు శశికుమార్, రాంనాథ్‌రెడ్డికి ఎర్రచందనం దుంగలను విక్రయించేవారని విచారణలో తేలిందన్నారు. ఈ 16మందిని అరెస్ట్ చేయడంలో పోరుమామిళ్ల ఎస్ఐ పెద్ద ఓబన్న, కలసపాడు ఎస్ఐ వెంకటరమణ, బి.కోడూరు ఎస్ఐలు సీఐ పద్మనాభన్ ఆధ్వర్యంలో కృషి చేశారన్నారు. అరెస్ట్‌చేసిన స్మగ్లర్లను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచంలోకెల్లా విలువైన ఎర్రచందనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోరుమామిళ్ల సీఐ పద్మనాభన్, ఎస్ఐ పెద్ద ఓబన్న, కలసపాడు ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐలు రమణయ్య, పుల్లన్న, హెడ్‌కానిస్టేబుల్ జార్జిని డీఎస్పీ అభినందించారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

● రూ.3.25లక్షలు విలువైన బంగారు ఆభరణాలు రికవరీ



నిందితురాలితో సీఐ సదాశివయ్య, ఎస్ఐ మధుమల్లేశ్వరరెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: మోడంపల్లి వాసి మల్లెల ఓబులమ్మ ఇంట్లో ఇటీవల జరిగిన చోరీకి సంబంధించి, అదే ప్రాంతీయుడు షేక్ అప్సర్ అలియాస్ అప్సరను అరెస్టు చేసి, ఆమె నుంచి రూ.3.25లక్షలు విలువైన బంగారు ఆభరణాలను రెండో పట్టణ పోలీసులు రికవరీ చేశారు. విలేకరుల సమావేశంలో అర్బన్ సీఐ సదాశివయ్య నిందితురాలి అరెస్టు, సొత్తు రికవరీ వివరాలను వెల్లడించారు.

మల్లెల ఓబులమ్మ పశువులు మేపుతూ, పాలవ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె కూతురు బీటెక్ పూర్తి చేసి నంద్యాలలో పనిచేస్తోంది. ఒంటరిగా ఉంటున్న ఓబులమ్మ ఇంటికి తాళం వేసి, తాళంచెవి అక్కడే గూట్లో ఉంచి, పశువులను తోలుకొని వెళ్లేది. దినచర్యలో భాగంగా 19న పశువుల మేతకు వెళ్లినపుడు, గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి జొరబడి బీరువాలో ఉంచిన 13 తులాలు బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లారు. విషయం తెలుసుకున్న ఈమె పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కేసు విచారణలో భాగంగా మోడంపల్లి వాసి షేక్ అప్సర మూడు రోజులుగా పాల కోసం వస్తూ, ఓబులమ్మ తాళం చెవి ఉంచే ప్రదేశాన్ని చూసి ఓబులమ్మ లేని సమయంలో చోరీకి పాల్పడినట్లు సీఐ చెప్పారు. ఎస్ఐ మధుమల్లేశ్వరరెడ్డి సిబ్బందితో కలిసి మోడంపల్లిలోని విక్టరీ స్కూల్ వద్ద అప్సర ఉండగా పెద్దమనుషుల సమక్షంలో అరెస్టు చేశామని, నేరం అంగీకరించిన అప్సర ఇచ్చిన సమాచారంతో జిన్నారోడ్డులోని ఆమె ఇంట్లో దాచి ఉంచిన గాజులు, కంకణాలు, బంగారు చైన్లు, చెంపసరాలు, చెవి దుద్దులు, వంకీ ఉంగరం తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.3లక్షల 25వేలు ఉంటాయని చెప్పారు. పట్టుబడిన నిందితురాలికి కోర్టు రిమాండుకు అదేశించినట్లు సీఐ తెలిపారు.

రేపటి పాఠశాలల బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్నఎంవి రామచంద్రారెడ్డి, ఎస్.ఎలియాస్‌రెడ్డి, బి.గంగయ్య

కడప ఎర్రముక్కపల్లె: 24న ప్రైవేట్ విద్యాసంస్థలు చేపడుతున్న బంద్‌ను జయప్రదం చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థల ఐక్యవేదిక నేతలు ఎంవి రామచంద్రారెడ్డి, ఎస్.ఎలియాస్‌రెడ్డి, బి.గంగయ్య పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రైవేట్ విద్యాసంస్థలు న్యాయమైన విద్యను అందిస్తూ, తల్లిదండ్రుల అభిమానంతో నిర్వహించబడుతున్నాయన్నారు. ఇందులో యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు అనేక చేదు సంఘటనలు ఎదురవుతున్నాయన్నారు. ఇంట్లో పరిస్థితులతో సతమతమయ్యే మనం విద్యాసంస్థల్లో వందల మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు, చిన్నచిన్న దుర్ఘటనలు జరిగినప్పుడు సమాజంలోని కొన్ని సంఘాలు స్వప్రయోజనాల కోసం విద్యాసంస్థల మనుగడకు ఆటంకం కలిగిస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల కర్నూలులోని పాఠశాలలో జరిగిన ఉదంతం విద్యార్థి సంఘాల పరాకాష్టకు చేరుకుందని, తల్లిదండ్రులను పరామర్శించేందుకు వెళ్లిన ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లపై విచక్షణా రహితంగా దుర్భాషలాడుతూ దాడి చేసి హత్యాయత్నం చేయడం, కార్లను ధ్వంసం చేశారన్నారు. విద్యాసంస్థలను దౌర్జన్యంగా బంద్ చేయించడం, చందాల రూపంలో బలవంతపు వసూళ్లు, ఇవ్వనివారిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం వంటి చర్యలు వివిధ సంఘాల ముసుగులో అసాంఘిక శక్తులు విద్యాసంస్థలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. అలాంటి అసాంఘిక శక్తులను ఎదుర్కొనేందుకు విద్యాసంస్థలకు ప్రత్యేక రక్షణాచట్టం కావాలని కోరుతూ ప్రైవేటు విద్యాసంస్థలు చేపట్టిన రాష్ట్రబంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నేతలు ఎంవి రామచంద్రారెడ్డి, ఎస్.ఎలియాస్‌రెడ్డి, బి.గంగయ్య, పి.వి.రమణారెడ్డి, పి.రమేష్‌రెడ్డి, ఎ.మేషక్‌బాబు, జూనియర్ కాలేజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, సురేష్, వివిధ పాఠశాల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక లారీల పట్టివేత : సీఐ



నిందితులతో సీఐ వెంకటశివారెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: అక్రమంగా లారీల్లో ఇసుక తరలిస్తూ ప్రొద్దుటూరు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. ఆరు లారీలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు, క్లీనర్లను అరెస్టు చేశారు. లారీల ఓనర్లపై కేసు నమోదు చేశారు.

స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో రూరల్ ఇన్‌చార్జీ సీఐ, వన్‌టౌన్ సీఐ వెంకటశివారెడ్డి వివరాలను వెల్లడిస్తూ ఎస్పీ అట్టాడ బాబూజీ అదేశాల మేరకు జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేటు సమీప పెట్రోలు బంకు వద్ద ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న ఆరు లారీలను స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్లను, క్లీనర్లను అదుపులోకి తీసుకుని, లారీలను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వీటి యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

బి.మఠం మండలం వెంకటాపురం వాసి బొడిగుంట్ల శంకర్‌రెడ్డి, గిద్దలూరు మండలం గడికోటకు చెందిన గంధం నాగేంద్ర పేర్లతో రెండు లారీలు, రాజుపాలెం మండలం వెలవలి వాసి పద్మనాభరెడ్డి, పోరుమామిళ్లకు చెందిన షేక్ అమీనా పేర్లతో ఒక్కొక్క లారీ ఉన్నట్లు సీఐ తెలిపారు. డ్రైవర్లు, క్లీనర్లల్లో సుధాకర్, శ్రీనివాసులు, రామాంజినేయులు, షేక్ మహబూబ్ షరీఫ్, ఆనందరావు, ఉదయరాజు, సుబ్బయ్య, వెంకటేశులు, మున్వర్ బాష, రవీంద్రారెడ్డి ఉన్నారన్నారు. సుగుమంచిపల్లె పెద్దదండ్లూరు మధ్యలో పెన్నానది నుంచి అక్రమంగా జేసీబీలతో లారీలో ఇసుకను నింపి, గిద్దలూరు, నంద్యాల ప్రాంతాలకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్ల డించారన్నారు. పట్టుబడిన లారీ డ్రైవర్లు, క్లీనర్లను కోర్టులో హాజరు పరచామన్నారు. కాగా జేసీబీ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నది ఎవరన్న విషయంపై విచారణ చేస్తున్నామని, అతన్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులున్నారు.

రేపు మట్టి గణపతి ప్రతిమల ఉచిత పంపిణీ

రాజంపేట టౌన్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద గురువారం ఉదయం 10గంటలకు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. మట్టి గణపతినే వాడుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో సాయినగర్‌కు చెందిన సుంకర సుబ్బరాయుడు, తెలుగు పండిట్ గంగనపల్లె వెంకటరమణ వారి కుటుంబ సభ్యులు మట్టి బొమ్మలను ఉచితంగా పంపిణీ చేయడానికి పూనుకున్నారన్నారు. సుమారు 1000మట్టి వినాయక బొమ్మలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

కదలని ఖరీఫ్..

- బోరుబావుల కింద అరకొర వ్యవసాయం
- పండ్లతోటలకు ఉపకరిస్తున్న ప్రస్తుత వర్షాలు
- రాజంపేట డివిజన్‌లో ముందుకు సాగని వ్యవసాయం
- తగ్గుతున్న స్వల్పకాలిక పంటలు
- ఉద్యాన, వరి పంటల సాగుపైన అన్నదాతల ఆసక్తి


అక్కడక్కడ బోరుబావుల కింద వరిసాగు కోసం దుక్కులు దున్నుతున్న రైతులు


వ్యవసాయం ముందుకు సాగకపోవడంతో బీళ్ళుగా మాగాణి భూములు


వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో వస్తున్న నీరు

రాజంపేట

రాజంపేట డివిజన్‌లో 15రోజులుగా వర్షాలు బాగా కురుస్తున్నప్పటికీ ఖరీఫ్ సాగు ముందుకు సాగే అవకాశాలు కానరావడం లేదు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ పంటల సాగులో రైతులు సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. మామూలుగా తొలకరి వర్షాలు కురిసినప్పుడు నక్కలకారు కింద ఈ ప్రాంత రైతులు నూగు, సజ్జ, రాగి లాంటి స్వల్పకాలిక పంటలను విరివిగా సాగు చేసేవారు. తదనంతరం నవంబర్ నుంచి బాగా వర్షాలు కురిసినప్పుడు చెరువుల కింద సుమారు లక్ష ఎకరాల్లో వరిపంటను సాగు చేసేవారు. స్వల్పకాలిక పంటలు దిగుబడి నిలిచి కాస్తోకూస్తో రైతులకు లాభాలను ఇచ్చేది. దీని ద్వారా నీలి ఆకు, జీలగలు లాంటి ముందస్తు సేంద్రీయ ఎరువులను పొలాల్లోకి వెళ్లి వర్షాలు బాగా పడిన తరువాత నవంబర్‌లో నెలలో వాటిని బాగా పండించేవారు. అయితే రైతుల్లో వచ్చిన మార్పుల వల్ల డ్రిప్ పథకం వచ్చిన తరువాత ఎక్కడ చూసినా డ్రిప్ ఇరిగేషన్ సాగుతో పండ్లతోటలను విరివిగా సాగు చేయడం మొదలు పెట్టారు. అందువల్ల రాజంపేట డివిజన్‌లోని 17మండలాల్లో ఎక్కడా స్వల్పకాలిక పంటలపై రైతులు మొగ్గు చూపడం లేదు. అయితే రెండు నెలల కిందట అక్కడక్కడ రైతులు సజ్జ పంటను సాగు చేయడంతో ప్రస్తుతం వెన్ను దశలో ఉంది. ప్రస్తుత వర్షాలు పండ్లతోటలకు బాగా కలిసివచ్చింది. ఎందుకంటే వరుస కరువులతో అల్లాడిపోతున్న పరిస్థితుల్లో అక్కడక్కడ వందలాది ఎకరాల్లో సాగు చేసిన అరటి, బొప్పాయికి భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల సాగునీరు బాగా తక్కువ వచ్చి పండ్లతోటలు ఎండిపోవడంతో రైతులు భారీ నష్టాల పాలయ్యారు. భూగర్భజలాలు 1000అడుగుల లోతుకు పడిపోవడంతో తాగడానికికూడా నీరు దొరికని పరిస్థితి ఏర్పడింది. ఈ స్థితిలో వారం రోజులుగా ప్రతి రోజూ వర్షాలు కురుస్తుండటంతో భూగర్భజలాలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. అరటి, బొప్పాయి, మామిడి పంటలకు ఈ వర్షాలు బాగా ఉపయోగపడుతున్నాయి. ఇక పోతే ఈ ప్రాంతంలో సుమారు 20వేల ఆవులు, గొర్రెలు, మేకలు, గేదెలు ఉన్నాయి. ఈ వర్షాల వల్ల మాగాణి భూములన్నీ పచ్చగా మారిపోయి ఎక్కడ చూసినా పచ్చ గడ్డి బాగా దొరుకుతుండటంతో పశువులకు కావాల్సినంత మేపు దొరుకుతోంది. మామూలుగా ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయం అంతలాభసాటి కాకపోవడంతో రైతులు వర్షాలు బాగా పడాలని కోరుకుంటున్నారు. బాగా వర్షాలు కురిస్తే నవంబర్ నెల నుంచి చెరువుల కింద భారీగా వరిపంటలు సాగు చేయాలని ఉన్నారు. కోడూరు, రాజంపేట, బద్వేలు ప్రాంతాల్లోని పోరుమామిళ్ళ, బి.కోడూరు, అట్లూరు, బద్వేలు, కాశినాయన, సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు ప్రాంతాలలో ఉన్న వంద చెరువులకు పైబడి మాగాణి కింద సుమారు లక్ష ఎకరాల్లో వరిపంటను సాగు చేయనున్నారు. ప్రస్తుతం భూగర్భజలాలు బోరుబావుల్లో పెరగడంతో అక్కడక్కడ రైతులు వరిపంటను సాగుచేసుకుంటున్నారు. దుక్కులు దున్నుతూ వరినాట్లు నాటడానికి సంసిద్ధమయ్యారు. ఏదేమైనా గతంలో ఈ ప్రాంతంలో నక్కలకారు కింద సజ్జ, రాగి, నూగుపంటలను సుమారు 50వేల ఎకరాల్లో సాగు చేసేవారు. ఇప్పుడు కేవలం 5వేల ఎకరాల్లో కూడా ఈ స్వల్పకాలిక పంటలను సాగు చేయడం లేదు. కారణం అంత లాభాలు స్వల్పకాలిక పంటలు రావనే ఉద్దేశంతో రైతులు ఆ పంటలకు స్వస్తి చెబుతూ బాగా వర్షాలు పడిన తరువాత వరినాట్లు వేయాలని భావిస్తున్నారు.


బోరుబావుల కింద అక్కడక్కడ వరినాటుతున్న మహిళలు

రేపు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

సుండుపల్లె: మండలంలోని దండివాండ్లపల్లెలో ఈ నెల 24న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేస్తున్నట్లు కార్యనిర్వాహకులు, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు పల్లం నాగేంద్ర, యల్లయ్యలు తెలిపారు. ఆదర్శ మూర్తి అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు రీజెన్సీ నలందా విద్యార్థులు


విద్యార్థులతో సీఏవో ప్రవీణ్

రాజంపేట టౌన్ : జమ్మలమడుగులో జరిగిన సబ్‌జూనియర్స్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో రాజంపేట రీజెన్సీ నలందా విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల సీఏవో సబ్బినేని ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఏవో మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీలోల ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో 8వ తరగతి చదువుతున్న వి.తరుణ్, పి.కృష్ణతేజలు, 9వ తరగతి చదువుతున్న జి.రేవతిలు ఉన్నారన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎంపికైన బాలుర జట్టుకు రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 28నుంచి 31వ తేదీ వరకు క్రీడాకారులకు సాఫ్ట్‌బాల్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేష్‌నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు కళ్యాణ్‌సాయి పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు
పోలీసుల అనుమతి తప్పనిసరి-సీఐ


మాట్లాడుతున్న సీఐ రవికుమార్

సిద్దవటం : మండలంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఒంటిమిట్ట సీఐ రవికుమార్ సూచించారు. సిద్దవటం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించే ప్రదేశాలలో వినాయక విగ్రహం ఏర్పాటు చేయకూడదన్నారు. వినాయక విగ్రహాలకు ఎలాంటి బలవంతపు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవ న్నారు. నిమజ్జనం రోజు డ్యాన్సులు, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. నిమజ్జనం సమయంలో ఒకరిపై ఒకరు రంగులు చల్లడం, టపాసులు పేల్చరాదన్నారు. విగ్రహాల వద్ద బాక్స్ టైపు సౌండ్ బాక్సులు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. మైకు ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తప్పకుండా ఉండాలన్నారు. వినాయక విగ్రహాల వద్ద నిమజ్జనం వెళ్ళే సమయంలో మద్యం మత్తు పానీయాలు ఉంచరాదన్నారు. విగ్రహ ఏర్పాటు చేసిన వాహన డ్రైవర్ ఎట్టి పరిస్థితిలో మద్యం తాగరాదన్నారు. తప్పని సరిగా డ్రైవర్ లైసెన్సు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఏఎస్ఐ చెన్నయ్య పాల్గొన్నారు.

సినిమాగ్రాఫ్

రాజంపేట

సమద్ :లై
సుదర్శన్ :నేనే రాజు నేనే మంత్రి
పీవై : ఫిదా
బీఎస్: ఆనందోబ్రహ్మ
ఎన్ఎస్ఆర్: జయజానకి నాయక

పశుకేంద్రాలకు మందులు పంపిణీ



రాజంపేట టౌన్ : రాజంపేట పశుసంవర్ధక శాఖ డివిజన్ కార్యాలయంలో ఉపసంచాలకులు డాక్టర్ కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పశుకేంద్రాలకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గల 10మండలాల పశువైద్యశాలలకు మందులను అందించామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి రేపు నెల 25 వరకు గాలికుంటు నివారణ కార్యక్రమం ఉంటుందని వివరించారు.

బోధనా నైపుణ్యం పెంపొందించుకోవాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న హెచ్‌ఎంలు

నందలూరు : విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నందలూరు, నాగిరెడ్డిపల్లె హైస్కూల్ హెడ్‌మాస్టర్లు బి.రమాదేవి, ఎం.శ్రీరాములు సూచించారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీలో జరిగిన ఉపాధ్యాయుల టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొని ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. దాతల సహాయంతో పాఠశాలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంఆర్‌పీఎస్ రౌఫ్‌బాషా, అల్లం అశోక్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం నేతలు సంజీవప్రసాద్, ప్రేమ్‌కుమార్, రమణయ్య, ఉపాధ్యాయ సంఘనేతలు, సంజీవప్రసాద్, ప్రేమ్‌కుమార్, రమణయ్య, సీఆర్‌పిలు సునీత, అరుణ, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఎంఆర్‌సి సిబ్బంది శివ, రమణ, హరి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం తరలింపు వద్దు



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్య, ఎంఆర్‌పీఎస్, వైసీపీ నాయకులు

రాజంపేట టౌన్ : రాజంపేట పాత పోలీస్ లైన్ వీధి, నాగుల మాను వీధి, అమ్మవారి శాల, శివాలయం వీధి మధ్యలో 2002లో ఏర్పాటు చేసి ఉన్న గాంధీ విగ్రహం తరలింపును తక్షణం విరమించుకోవాలని ఆర్యవైశ్య సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు మంగళవారం గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘ నాయకులు, వైసీపీ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2002లో ఆర్యవైశ్య సంఘం నాయకులు గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారని విగ్రహం దగ్గర ఉన్న ప్రహరీనికూల్చి అక్కడ గ్రిల్స్, టైల్స్, నూతన హంగులతో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేస్తూ ఉండగా మున్సిపల్ అధికారులు అడ్డుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. భేషరత్‌గా ఇచ్చిన ఫిర్యాదు వెనక్కు తీసుకుని గాంధీ విగ్రహం తొలగింపును విరమించు కోవాలని వారు కోరారు. నిరసన తెలిపిన వారిలో కర్ణాటం సుబ్రమణ్యం, విజయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మెంటా విజయ్‌శేఖర్, ఆంజనేయులు, సునీల్, వైసీపీ నాయకులు గోవిందబాలకృష్ణ, ఎంఆర్‌పీఎస్ శివయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట : వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు అచ్చన్న సూచించారు. మండలంలోని ఇబ్రహీంపేటలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరంలో డాక్టర్‌లు వెంకటరమణ, శిరీష, స్వాతిల ఆధ్వర్యంలో 80దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. అలాగే 45పశువులకు ఉచిత గర్భాధారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో విఎల్‌వో లక్ష్మీనరసయ్య, ఎల్‌ఎస్‌ఎలు రాణి, కేశవ, గోపాలమిత్ర సూపర్‌వైజర్, అయ్యవారయ్య, గోపాలమిత్ర సుజాత, పశుమిత్రలు మణి, శేఖర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి జిల్లా కో-ఆర్డినేటర్‌గా అన్నమాచార్య అధ్యాపకుడు



సుబ్రమణ్యం

రాజంపేట : ప్రతి ఏడాది సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకుంటున్నామని ఈ ఏడాది నిర్వహించే వేడుకలకు జిల్లా కో-ఆర్డినేటర్‌గా అన్నమాచార్య కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రమణ్యం ఎంపికయ్యారు. సెప్టెంబర్ 27న ఉత్సవాలు విజయవాడలో నిర్వహిస్తారని ఎస్కే యూనివర్సిటీ ప్రపంచ పర్యాటక దినోత్సవ ప్రొఫెసర్ కె.వేణుగోపాల్‌రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు కడప జిల్లా నుంచి అన్నమాచార్య కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రమణ్యంను ఎంపిక చేశారని ఆయన తెలిపారు. జిల్లాలోని విహార ప్రదేశాల గురించి పోస్టర్ పెయింటింగ్, క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, టూరిజం ఫోటోగ్రఫీ అంశాలపై పోటీలు నిర్వహించి ఒక్కొక్క కళాశాల నుంచి ప్రతి విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఒక విద్యార్థిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారు యోగివేమన యూనివర్సిటీ కడపలో సెప్టెంబర్ 8వ తేదీన పోటీలలో పాల్గొంటారన్నారు. అక్కడ ప్రతిభ కనబరిచిన వారు అనంతపురం ఎస్‌కేయూనివర్సిటీలో 12వ తేదీన పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 27వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.సుబ్రమణ్యం, సెల్ : 7093769885అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

లారీ,బైకు ఢీ -నలుగురికి తీవ్రగాయాలు





రాజంపేటలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు, తీవ్రంగా గాయపడ్డ చలపతి

రాజంపేట టౌన్ : రాజంపేట భువనగిరి పల్లె ఆర్చీ వద్ద టిఎన్24డబ్ల్యూ6368 అనే నెంబరు గల లారీ రెడ్డిపల్లె నుంచి రాజంపేట వైపు వస్తున్న కొత్త బైకును మంగళవారం ఉదయం ఢీకొంది. ఈఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు తెలిపిన వివరాల మేరకు రెడ్డిపల్లె నుంచి రాజంపేటకు కొత్తగా కొన్న బైకులో జి.చలపతితో పాటు ఎం.మౌనిక, ఎం.అనూష, జి.రేష్మలు వస్తుండగా భువనగిరిపల్లె ఆర్చీ వద్దకు రాగానే లారీ, బైకు ఢీకొన్నాయి. దీంతో బైకుపై వస్తున్న చలపతి తలకి, కాలికి బలమైన గాయమైంది. మౌనిక, అనూషలకు తలకు, కాళ్ళకు, చేతులకు గాయాలయ్యాయి. రేష్మకు తలకు గాయమైంది. గాయపడిన వారిని స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి హుటాహుటిన వారి ని రాజంపేట ఏరియా ఆసుపత్రికి తరలిం చి ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. అయితే అ మ్మాయిలు రాజంపేట ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్నారు. ఉద యం చలపతి తమ కుమార్తెతోపాటు స్నేహితుడి పిల్లలను తన బైకుపై ఎక్కించుకొని వస్తుండగా ఈ సంఘటన జరిగింది. దీనిపై పట్టణ పోలీసులను అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయితే ప్రమాదం జరిగిన స్థలాన్ని ఎస్ఐలు, పోలీసులు పరిశీలించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఐ నరసింహారెడ్డి

సుండుపల్లె: మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాల, కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులు 23 మందికి పరివర్తన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మట్కాకు అలవాటు పడితే జరిగే పరిణామాలు అలాగే మట్కాను నిర్మూలించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై ఈ పోటీలు నిర్వహించామని ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

మానవసేవే మాధవసేవ



రోగులకు పండ్లు అందజేస్తున్న ఆనందరెడ్డి

సుండుపల్లె: మానవసేవే మాధవసేవ అని మంగళవారం మానవత సంస్థ చైర్మన్ యర్రపురెడ్డి ఆనందరెడ్డి అన్నారు. సుండుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆనందరెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పేదల కు సహాయ సహకారాలు అందించాలన్న దృఢ సంకల్పంతో మానవత సంస్థ ద్వారా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ ఇస్మాయిల్, ప్రెసిడెంట్ క్రిష్ణంరాజు, ఎంకేఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ సిరాజుద్దీన్, సింగిల్‌విండో అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగరాజు, డాక్టర్ సమీరా, సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ

రాజంపేట : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజంపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ సభ్యులు టి.వి.రమణారెడ్డి, పి.వి.రమణ, బి.రామచంద్రయ్యనాయుడు, లయన్ షేక్ అబ్దుల్లా, చెంగయ్య, శరత్‌బాబు, సిద్దిలింగారెడ్డి, ఎన్.వి.సుబ్బయ్య, శ్రీనివాసులనాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంటపాలకు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి

ఒంటిమిట్ట : మండలంలోని వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మంటపాలకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరని విద్యుత్ శాఖ ఏఈ సి.సురేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంటపాల వద్ద విద్యుత్ అలంకరణ కోసం విద్యుత్ సరఫరా కోసం మైక్ సెట్టింగ్ నిమిత్తం విద్యుత్ శాఖ కార్యాలయంలో డబ్బు చెల్లించి విద్యుత్ కనెక్షన్ అధికారికంగా వినియోగించుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో ముందుగా తమకు సమాచారం అందిస్తే విద్యుత్‌తీగలు అడ్డు తొలగిస్తామని ఆయన తెలిపారు.

క్లైమాక్స్‌లో గండికోట విచారణ

కడప, ఆంధ్రజ్యోతి : తోడేకొద్దీ అవినీతి వెలుగు చూస్తున్న గండికోట ముంపు పునరావాస పరిహారంపై జరుగుతున్న విచారణ క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లోనే విచారణ నివేదికను అధికారులు సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే గండికోట అక్రమాలపై నివేదిక కోరిన మేరకు వీలైనంత త్వరగా ప్రభుత్వానికి పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గండికోటలో సుమారు నెల రోజులుగా విచారణ సాగుతోంది. ఇష్టారాజ్యంగా పరిహారం చెక్కులు పంపిణీ చేయడం, నిబంధనలు పాటించకుండా చేతివాటాలు ప్రదర్శించడం, ముంపు పరిహారానికి సంబంధం లేని వారికి కూడా చెక్కులు ఇవ్వడం, కటాఫ్ డేట్‌ను అడ్డుపెట్టుకొని నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి రుణాలు పొందడం లాంటి పలు అక్రమాలు చోటుచే సుకోవడంతో జిల్లా కలెక్టర్ ఈ తంతుపై సీరియస్ అయ్యారు. వెంటనే విచారణకు ఆదేశించారు. జేసీ-2 నేతృత్వంలో పలు బృందాలు సుమారు నెల రోజులుగా విచారణ చేపడుతున్నాయి. విచారణ కూడా ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. గండికోట పరిహారం పంపిణీలో అఫిడవిట్‌లకు సంబంధించి అక్రమాలు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. పెళ్లయిన ఆడపిల్లలకు పరిహారం వర్తించేందుకు ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. దీంతో అలాంటి వారి ఇంటిపేర్లు మార్చుకోవాల్సిన అవసరం వుంటుంది. వీరితో పాటు మృతి చెందిన వారికి సంబంధించి, పుట్టిన తేదీల్లో తేడాలు వుంటే ఇలాంటి వాటికి అఫిడవిట్‌లు సమర్పించాల్సి వుంటుంది. ఈ అఫిడవిట్లకు తప్పనిసరిగా నోటరీ సంతకం వుండాల్సి వుంటుంది. అయితే అఫిడవిట్లు సమర్పించడంలో కూడా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు సంబంధించి సుమారు వందమందికి పైగా పరిహారం పంపిణీ చేసినట్లు అధికారుల దృష్టికి రావడంతో దీనిపై కూడా విచారణ చేస్తున్నారు. అమెరికాలో వున్న ఒకరికి సంబంధించిన పరిహారంలో కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిపేరుతో మంజూరు చేసిన చెక్కును మరొకరికి ఇచ్చినట్లు సమాచారం. ఇలాంటి ఫిర్యాదులు కూడా జిల్లా అధికారులకు అందుతున్నాయి. అంతేకాదు... ఒకరిపేరుతో చెక్కు వస్తే మరొకరు సంతకం పెట్టి తీసుకెళ్లినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గండికోట పునరావాస పరిహారానికి సంబంధించి సుమారు 900 కేసులు వుంటే ఇందులో సుమారు 180 వరకు ప్రొజెక్టెడ్ జాబితా కింద వున్నట్లు సమాచారం. వీటిలో కూడా ఎక్కువ శాతం అక్రమాలకు పాల్పడి వుండవచ్చని భావిస్తున్నారు. ఇలాంటి అక్రమాలపై కొద్దిరోజుల్లోనే విచారణ పూర్తి చేయనున్నారు. ఈ విచారణ పూర్తయితే ఎంతమంది అక్రమాలకు పాల్పడ్డారు, వారికి సహకరించిన అధికారులు ఎవరైనా వున్నారా, ఎన్ని కోట్ల మేరకు అక్రమాలు చోటుచేసుకున్నాయనేది తేలనుంది. మొత్తం మీద పునరావాస పరిహారం పంపిణీలో కోట్ల రూపాయల మేరకు అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. విచారణలో అక్రమాలు రుజువైతే అందుకు కారణమైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు రికవరీ కూడా చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించనున్నట్లు సమాచారం. విద్యార్థుల పేరుతో పరిహారం పొందడం, అక్రమాలకు పాల్పడడం అనేవి వారి పెద్దల పనే అయి వుంటుంది కాబట్టి అలాంటి వారిపై చర్యలు చేపట్టే అవకాశాలు కనిపిస్తాయి.

వంటగ్యాస్ మరింత భారం

కడప, కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వంటగ్యాస్ సబ్సిడీ ఎత్తివేత నిర్ణయం ముఖ్యంగా దీపం లబ్ధిదారులకు మరింత కష్టాల్లోకి నెట్టేసినట్లయింది. గ్యాస్ కనెక్షన్ కోసం వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్న దశలో సబ్సిడీ ఎత్తివేస్తున్నారనే అంశం వారిని కుదిపేస్తోంది. దీనికన్నా కట్టెల పొయ్యితోనే వంట చేసుకోవడం మేలనే భావన వారిలో వ్యక్తమవుతోంది.

జిల్లాలో 28,82,500 జనాభా కాగా దాదాపు 6,54,560 కుటుంబాలు ఉన్నాయి. అలాగే జిల్లాలో 5,14,978 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో దీపం పథకం కింద పేదలకు 1,11,902 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు అందించినట్లు అధికారిక అంచనా. జిల్లాలోని హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓఎల్ కంపెనీలకు చెందిన 47 వంటగ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా జిల్లాలోని వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ఆయా నియోజవర్గాల్లో గృహ వినియోగ గ్యాస్ కనెక్షన్లు కలిగిన కుటుంబం నెలకు ఒక్కటి చొప్పున ఏడాది మొత్తానికి 12 సిలిండర్లు వరకు ప్రభుత్వ సబ్సిడీ పొందుతోంది. గృహ వినియోగదారుల్లో 45 రోజుల నుంచి రెండు నెలల వరకు ఒక్క సిలిండర్‌ను వినియోగిస్తున్నట్లుగా గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకుల అంచనా. ఏడాది మొత్తంలో 8 నుంచి 10 సిలిండర్లను వినియోగిస్తున్నట్లుగా వారి లెక్కల ద్వారా తెలుస్తోంది.

సబ్సిడీ రద్దయితే... పరిస్థితి

వచ్చే ఏడాది మార్చి తరువాత నెల నుంచి రాయితీ మొత్తం రద్దవుతుందనే తెలుస్తోంది. అయితే తాజా నిర్ణయం మేరకు ప్రతినెల ఒక్కొక్క సిలిండర్‌పై రూ.4 పెరుగుతూ వస్తుంది. సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చేస్తోంది. కాగా మిగిలిన 7 నెలల్లో నాలుగు సిలిండర్లు వినియోగించినా ఒక్కొక్క కుటుంబంపై అదనంగా రూ.16 భారం పడనుంది. ప్రస్తుతం 14.2 కిలోల సిలిండరును గృహ వినియోగానికి అందిస్తున్నారు. ధర రూ.572 ఉంది. మార్చి తరువాత ఏప్రిల్ నుంచి ప్రస్తుతం ఉన్న రూ.88 లు సబ్సిడీ పరిగణలోకి తీసుకుంటే ఏడాదికి సగటున ఒక్కొక్క కుటుంబం 8 సిలిండర్లు వినియోగిస్తే ఆ ఏడాదిలో ఆ కుటుంబంపై రూ.704 అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదే భారాన్ని జిల్లా మొత్తంగా లెక్కిస్తే 5,14,978 కుటుంబాలకు ఏడాది పొడవునా ఒక్కొక్క కుటుంబానికి 8 సిలిండర్లను వినియోగిస్తే ఆ కుటుంబాలపై రమారమీ రూ.36.25 కోట్ల పై చిలుకు అదనపు భారం పడుతుందనే అంచనా.

వినియోగదారులకు ఇబ్బందే..!

కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సబ్సిడీ ఎత్తివేస్తామని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా దీని వల్ల చాలమంది వినియోగదారులకు ఇబ్బంది కలుగుతోంది. అదనంగా భారం పడుతోంది. ఈ నష్టాన్ని ఏ విధంగా పూడ్చాలనే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారు. వినియోగదారులకు ఎలాంటి భారం పడకూడదనే విధంగా ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టనున్నాం

- ఎం.లింగారెడ్డి,
చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరా సంస్థ

మిగిలింది.. మూడు వారాలే..

- జిల్లాలో సాధారణ పంట విస్తీర్ణం 1.36 లక్షలు హెక్టార్లు
- సాగైనపంటల విస్తీర్ణం 60.207 హెక్టార్లు
- ఆగస్టు చిరినాటికి నమోదు కావాల్సిన వర్షపాతం 280.2 మిల్లీమీటర్లు
- ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం 216.17 మిల్లీమీటర్లు
- లోటు వర్షపాతం - 32 మిల్లీమీటర్లు

కడప, ఐటిఐసర్కిల్: జిల్లాలో 2017 ఖరీఫ్‌లో సీజన్‌లో 1,36,673 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి పంటలు సాగు కావాల్సి వుంది. వరుణుడు ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు కేవలం 60 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ ఏడాది లక్ష్యం పూర్తి చేసే అయ్యేదని అధికారులు చెబుతున్నారు. కానీ వర్షాలు లేక పరిస్థితి భిన్నంగా మారింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 69.2 మిల్లీమీటర్లు కాగా 87.9 మిల్లీమీటర్లు పడింది. జూలైలో 96.7 సాధారణ వర్షపాతం కాగా 46.21 మిల్లీమీటర్లు నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 114 మిల్లీమీటర్లు కాగా కేవలం 80.6 మిల్లీమీటర్లు నమోదైంది. దీంతో పంటల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో ఇప్పటి వరకు 60,822 హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. ప్రధాన పంటలు వరి, వేరుశనగ, పత్తి, పసుపు విషయానికి వస్తే ముందుగా కురిసిన వర్షాలకు విత్తనాలు మొలకెత్తాయి. తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాలు లేక మొక్కలు వాడిపోతున్నాయి. ఆలస్యంగా వేసిన విత్తనాలు మొలకెత్తడం లేదు. నల్లరేగడి భూముల్లో పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉన్నా ఎర్ర భూముల్లో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. చాలా వాడిపోయి కనిపిస్తున్నాయి. పెట్టుబడుల రూపేణా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్లు వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా... పత్తి పంట విత్తనానికి జూలై 15తో, వేరుశనగ విత్తడానికి జులై 31తో గడువు తీరింది. నల్లరేగడి భూముల్లో జులై నెలాఖరు వరకు మొక్కజొన్న పంట వేసుకునే అవకాశం వుండేది. ఆగస్టు మొదటి వారం కూడా వర్షాలు రాకపోవడంతో కంది, పొద్దుతిరుగుడు, ఆముదం, కూరగాయలు వంటి పంటల సాగు ఉత్తమమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాతావరణ ప్రతి కూల పరిస్థితులపై రైతులు ఆందోళన చెందవద్దని, వర్షాలు కురుస్తాయనే ఆశాభావం ఉన్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జిల్లాలో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

పంట	సాధారణ విస్తీర్ణం	ప్రస్తుత సాగు
వరి	40,000	6010
కందులు	9286	6350
వేరుశనగ	36,575	21650
పత్తి	29721	16428
పసుపు	4058	2480
సజ్జ	2434	4699

ఎస్సీ, ఎస్టీ కేసులో యువకుడి అరెస్టు

కడప, క్రైం : కడప నగరం మారుతీనగర్‌కు చెందిన ఆవుల నాగార్జునరెడ్డిని ఎస్సీ, ఎస్టీ కేసులో అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ షేక్ మాసూమ్‌బాష తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన చింతకుంట వెంకటేశ్ పటేల్ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే స్కూల్‌లో పని చేస్తున్న నాగార్జునరెడ్డి వెంకటేశ్‌ను కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వృద్ధురాలిని పట్టించుకోని వారిపై

సుమోటో కింద కేసు నమోదు

కడప లీగల్: రైల్వేకోడూరు మండలంలోని చియ్యవరం కమ్మపల్లె గ్రామానికి చెందిన మందిన వెంకట సుబ్బమ్మకు అన్యాయం చేసిన వారిపై జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీనివాస్ సుమోటో కింద కేసును నమోదు చేశారు.

మినీ లోకం



వంకకు కంచె

- ఆక్రమణలో కోట్ల విలువ గల వంకలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కడప, ప్రకాష్‌నగర్ : అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంలా మారింది. పట్టించుకోవాల్సిన సిబ్బంది ప్రేక్షకపాత్రకు పరిమితం కావడం, కాపాడాల్సిన వారే కుటిలనీతిని ప్రదర్శించడం వెరసి కోట్ల రూపాయల విలువ గల వంక గుట్ట పొరంబోకు భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కోట్ల విలువ చేసే వంకలు సైతం ఆక్రమణలోకి వెళుతున్నాయి. ప్రశ్నించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వంకలు చదును చేస్తూ ఏకంగా కంచె వేసిన సంఘటనలు లేకపోలేదు. కడప నగర శివారులోని చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ చిన్నకాంబల్లె చెరువుకు సంబంధించిన వంక ఆక్రమణకు గురైంది. సుగాలి బిడికీ సమీపం నుంచి చిన్నకాంబల్లె చెరువుకు వెళ్లే వంకను దర్జాగా కబ్జా చేశారు. కొంత మంది బడాబాబులు ఏకంగా వంకకు కంచె వేసి ఆక్రమించేశారు. ఇది ఈ వంక పరిధిలో దాదాపు 54 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీనిని ప్రశ్నించాలంటే ఒకింత తర్జన భర్జన పడుతున్నారు. బడా నేతలు సుగాలిబిడికీ ప్రాంతంలో వందల ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూమి పక్కనే వంక వెళ్లడంతో ఆ వంకను కాస్త కాజేశారు. విశాలంగా ఉండాల్సిన వంక రోజురోజుకు కుంచించుకుపోయింది. గుట్ట, వంక, కొండ పొరంబోకు భూములు ఆక్రమణలో ఉండడంతో ఇటీవల సుగాలిబిడికీ ప్రాంతంలో ఇరువర్గాలు భూమి కోసం ఘర్షణ పడినట్లు తెలిసింది. ఆక్రమణ భూమి కావడంతో ఇరువర్గాల వారు తహసీల్దార్ వద్దకు వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో ఒక్కొక్క ఎకరా రూ.5 లక్షల మేరకు విలువ చేస్తుంది. వంకకు సంబంధించిన ప్రభుత్వ స్థలం దాదాపు 54 ఎకరాలు భూమి సరాసరి రూ.25 కోట్లు పైబడి విలువ చేస్తుంది. సుగాలిబిడికి నుంచి చిన్నకాంపల్లె చెరువుకు వెళ్లే వరకు ఈ మధ్యలో వేల ఎకరాలకు ఈ వంక సాగు నీరు అందించనుంది. ఈ వంక పూర్తిగా కనుమరుగు అయితే రైతులు అన్నివిధాలా నష్టపోయే అవకాశముంది. అంతేకాదు బుగ్గవంక నుంచి వచ్చే వంకలు పిల్ల కాలువలు సైతం కనుమరుగయ్యాయి. ఈ విషయమై స్థానికులు అనేకమార్లు బుగ్గవంక, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఆక్రమణకు గురైన వంకలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


వంకకు కంచె వేసిన దృశ్యం

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

కడప, క్రైం : కడప నుంచి విజయవాడకు బయలుదేరిన ఆర్టీసీ బస్సును అడ్డగించి బస్సును వెంబడిస్తూ చివరకు బస్సు డ్రైవర్‌పై దాడి చేయడంతో పాటు ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేసిన ఏడుమంది యువకులను టూటౌన్ పోలీసులు దేవునికడప రోడ్డులోని మత్స్య కేంద్రం వద్ద అరెస్టు చేశారు. కడప టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కడప డీఎస్పీ షేక్ మాసుమ్‌బాష, అర్బన్ సీఐ భాస్కర్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ రుషేంద్రబాబుతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. బెల్లం మండివీధికి చెందిన షేక్ యూనస్, బీవీ రావు వీధికి చెందిన వంశీ, అనంతభట్ మద్యం తాగి రాయల్ ఎన్‌ఫీల్డు మోటారు బైక్‌పై ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండు వద్ద చక్కర్లు కొడుతున్నారు. అదే సమయంలో కడప నుంచి విజయవాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సును చేజ్ చేస్తూ బండిని అడ్డదిడ్డంగా నడుపుతూ బస్సు డ్రైవర్ మాటలను లెక్కచేయకుండా కోటిరెడ్డిసర్కిల్, సంధ్య సర్కిల్, ఐటీఐ జంక్షన్‌లలో ఆ బస్సును అడ్డగిస్తూ డ్రైవర్‌ను అసభ్యకరంగా మాట్లాడినట్లు తెలిపారు. ఆ యువకుల ప్రవర్తనను బస్సు డ్రైవర్ పట్టించుకోకుండా బస్సును నడుపుతుండటంతో బస్సును వెంబడించిన యువకులు మరియాపురం వద్దకు రాగానే రాళ్లతో బస్సు వెనుక వైపు అద్దాలపై విసిరివేయడంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో బస్సు డ్రైవర్ బస్సును బిల్టప్ సర్కిల్ వినాయకనగర్ మీదుగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వస్తుండగా షేక్‌యూనస్, వంశీలు తన స్నేహితులైన మరో ఐదుగురిని మట్టిపెద్దపులి వద్దకు పిలిపించుకుని అక్కడ ఆ బస్సును ఆ యువకులు అడ్డగించడంతో పాటు ఆ డ్రైవర్‌పై దాడి చేసినట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ కొండయ్య ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బెల్లంమండివీధికి చెందిన షేక్ యూనస్, బీవీ రావు వీధికి చెందిన వంశీ, అనంతభట్, బెల్లంమండివీధికి చెందిన నానుగాల చంద్రశేఖర్, సయ్యద్ తార్బేజ్‌అలి, కుమ్మరికుంటకు చెందిన కయ్యాల వినయ్‌కుమార్‌రెడ్డి, బెల్లంమండివీధికి చెందిన కె.సత్యరామసాయి అలియాస్ సత్య, రాజారెడ్డివీధికి చెందిన ధర్మపురి సతీష్‌బాబులను అరెస్టు చేసి ఈ మేరకు వారి వద్ద నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకును స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. కాగా బస్సు అద్దాలు ధ్వంసం చేసిన యువకులంతా డిగ్రీ, బీటెక్ చదువుతున్న విద్యార్థులు కావడం గమనార్హం.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మాసూమ్‌బాషా

ఆకతాయి చేష్టలకు పాల్పడితే తాట తీస్తా : డీఎస్పీ

ఎవరైనా ఆకతాయి చేష్టలకు పాల్పడితే వారి తాట తీస్తామని డీఎస్పీ మాసూమ్‌బాషా హెచ్చరించారు. ఇటీవల జరుగుతున్న రోడ్ల ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువత మరణిస్తున్నారన్నారు. పిల్లలు అడిగిన వెంటనే వారికి పెద్ద పెద్ద ద్విచక్రవాహనాలు కొనుగోలు చేయడంతో పాటు వారిపై పర్యవేక్షణ చేయకపోవడంతోనే వారు విచ్చలవిడిగా తయారవుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పట్ల గమనిస్తూ ఉండాలన్నారు. హద్దుమీరి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. చదువుల్లో ముందుకు పోవాలే తప్ప ఇలాంటి చిల్లర చేష్టల వల్ల మీతో పాటు మీ కుటుంబం గౌరవమర్యాదలు తగ్గిపోతాయన్నారు. వక్రమార్గంలోకి వెళుతున్న యువతపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎవరైనా ఆకతాయి చేష్టలకు పాల్పడితే వారి తాట తీస్తామని ఆయన స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయం

ట్రిపుల్ తలాక్‌పై ముస్లిం మత గురువుల అభిప్రాయం

కడప, అర్బన్ : భారత ఉన్నత న్యాయస్థానం ధర్మాసనం మంగళవారం ట్రిపుల్ తలాక్‌పై జోక్యం చేసుకుందని ఇది మతపరమైన వ్యవహారమని ఆ మత నిబంధనల మేరకు వారే నిర్ణయించుకోవాలని తీర్పునివ్వడం హర్షదాయకమని నగరంలోని పలువురు ముస్లిం మత గురువులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తన తీర్పులో ట్రిపుల్ తలాక్‌పై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లోనే అమెండ్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపింది. భారతదేశం లౌకిక దేశమని ఇక్కడున్న ప్రతి మతం వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలున్నాయని, అలాగే మత పర విషయంలో కోర్టు జోక్యం చేసుకోదని తెలిపింది.

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాము



భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ కల్పించిందని, ఇక్కడ అన్ని మతాలు సమానమే. మతపర ధర్మాలలో ప్రభుత్వం జోక్యం చేసుకూడదు. బీజేపీ ప్రభుత్వం కేవలం తన అనుబంధ సంస్థలైన రాష్ట్రీయ సేవా సంఘ జనసంఘ్, వీహెచ్‌పీలకు తలొగ్గి ముస్లిం మత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటోంది. ధర్మపరంగా భార్యాభర్తలు విడిపోవడానికి తలాక్ అంటారు. ఇది ధర్మబద్ధంగానే జరగాలి. షరీయల్ ప్రకారం ధర్మబద్ధమైంది. ప్రపంచంలో ఎక్కడకెళ్ళినా ధర్మబద్ధంగానే ఉంటుంది. అందుకు సుప్రీంకోర్టుకు ఈ విషయంపై ఎటువంటి వ్యతిరేకత కాన రాలేదు కానరాదు కూడా. అందుకే మతపరమైన విషయాల్లో జోక్యం చేసుకోవడంతో ముస్లింలను కోర్టులపై ఇంకా అపారమైన నమ్మకం పెరిగింది.

- సయ్యద్ అహ్మద్, ధర్మ పరిచయ కమిటీ బోధకులు

ఇస్లాం మతంలో ట్రిపుల్ తలాక్ ధర్మబద్ధమే



ట్రిపుల్ తలాక్ అంటే చాలామందికి తలాక్, తలాక్, తలాక్ అని మూడుసార్లు ఒకే సమయంలో అంటారని దురభిప్రాయం ఉంది. ఇటువంటి దానిని ఇస్లాంలోనే కాదు ఏ మతం వారు కూడా అంగీకరించరు. మూడుసార్లు షరీయత్ నియమ నిబంధనల ప్రకారం కేటాయించిన వేర్వేరు సమయాల్లో తెలిసిన విధంగా చెబితే తలాక్ అవుతుంది. తలాక్ ధర్మబద్ధమైనది. అయినా అల్లాహ్‌కు, విశ్వ ప్రవక్తకు అయిష్టమైన పని. ఏది ఏమైనా సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మానుకోవాలి.

-ముఫ్తిగౌస్ అహ్మద్, మతగురువు

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - మేనేజర్

వర్షాకాలం..
తస్మాత్... జాగ్రత్త !

● గొంతువాపు, గాలికుంటు వ్యాధులతో పాడిరైతులు జాగ్రత్త
● ముందు జాగ్రత్తతో పశుసంపదను రక్షించుకోవచ్చు



గేదెను పరీక్ష చేస్తున్న డాక్టర్ లక్ష్మినారాయణరెడ్డి



మేకకు నీలినాలుక వ్యాధిని పరిశీలిస్తున్న దృశ్యం



కాళ్ల గిట్టల గాయాలకు చికిత్సలు చేస్తున్న దృశ్యం

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. రోజూ ఇలాంటి పశువులు వైద్యశాలకు అధికంగా వస్తున్నట్లు వారు తెలుపుతున్నారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై సలహాలు, సూచనలు పోట్లదుర్తి పశువైద్యాధికారి లక్ష్మీనారాయణరెడ్డి వివరించారు. ఆయన మాటల్లోనే...

ఎర్రగుంట్ల:

గొంతువాపు వ్యాధి

వర్షాకాలంలో ప్రధానంగా వచ్చేది గొంతువాపు వ్యాధి. ఇది అంటువ్యాధి. ఇతర పశువులకు నీరు, మేత ద్వారా సోకుతుంది. కంటినుంచి నీరుకారడం, నోటినుంచి చొంగకారడం, గురకరావడం, శ్వాసపీల్చడం కష్టమవుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీలు వరకు ఉంటుంది. గొంతు కిందవాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన పశువులు 24 గంటల్లో చనిపోతాయి. వర్షాకాలం ముందు జూన్, జూలైలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన వెంటనే సమీప పశువైద్యాధికారిని సంప్రదించాలి. వ్యాధిసోకిన పశువును మందనుంచి వేరు చేయాలి.

గాలికుంటు వ్యాధి

ఈ వ్యాధి వైరస్ సోకడం ద్వారా, కలుషితమైన గాలిద్వారా వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువుల మేత తినలేని, నడవలేని స్థితిలో ఉంటాయి. పాడిగేదెల పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఎద్దుల్లో రోగ నిరోధకశక్తి తగ్గిపోయి తొందరగా అలసటకు గుర్రై నీరసించి పోతాయి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేయాలి. నోటిలో పుండ్లకు బోరిక్, గ్లిసరిన్ కలిపి పూయాలి, వెంటనే పశువైద్యుని సంప్రదించాలి.

గొర్రెల్లో వచ్చే వ్యాధులు ముఖ్యంగా..

నీలి నాలుక వ్యాధి

దోమకాటు, వైరస్ వల్ల గొర్రెలకు, మేకలకు ఈ వ్యాధి వర్షాకాలంలో వస్తుంది. 105 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిపుండ్లు వచ్చి చొంగ కారుస్తుంది. నాలుక చివరలో నీలిరంగు వస్తుంది. కాళ్ల, గిట్టలు చుట్టూ వాచి పుండ్లు అవుతాయి. ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. వ్యాధిసోకిన గొర్రెలను సకాలంలో గుర్తించి వైద్యునిచే చికిత్స చేయించాలి. నోటిపుండ్లను రెండుశాతం బ్లోరో గ్లిజరిన్ పూయాలి. మేత తీసుకోదు కాబట్టి రాగిజావ, అంబలిజావను ద్రవ రూపంలో తాగించాలి. ఎండిన వేపాకులను తగలబెడితే కొంతమేరకు దోమల నుంచి రక్షించవచ్చన్నారు. పశువుల శరీరాలను, పరిసరాలను శుభ్రతగా ఉంచుకోవాలి.

కాలిపుండు వ్యాధి

ఇది ఒక రకమైన బ్యాక్టీరియా. దీని వల్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. బురదలో తిరిగినప్పుడు గిట్ట మెత్తబడి చిట్లి చీము పుట్టి నొప్పితో ముందుకాళ్లపై కుంటు తూ ఉంటాయి. వ్యాధి మరింత జఠిలమైతే గిట్టలు ఊడిపోతాయి. ఈ వ్యాధి సోకిన వెంటనే పశువులకు 10 శాతం జింక్ సల్ఫేట్, 5 శాతం ఫార్మలిన్, ఏదైనా ఆయింట్‌మెంట్ పూయాలి. 3 నుంచి 5 రోజులు యాంటిబయోటిక్ ఇంజక్షన్ వరుసగా వేయాలి. గట్టి నేలలో మేపే విధంగా చర్యలు తీసుకోవాలి.

చిటుక వ్యాధి

ఈ వ్యాధి క్లాస్టీడియం అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. మందలో బలిష్టంగా ఉన్న గొర్రెలు, మేకలకు ఎటువంటి వ్యాధి లక్షణాలు లేకుండా అకస్మాత్తుగా మరణిస్తాయి. ఈ వ్యాధి సోకిన గొర్రెలకు చికిత్స చేయించినా పెద్దగా లాభం ఉండదు. చికిత్స కన్నా వ్యాధి నివారణ అతిముఖ్యం. ముందస్తు టీకాలు వేయించాలి. వర్షాకాలంలో అన్ని జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, ముందస్తు చర్యలతో పశువులను రక్షించుకోవచ్చని పశువైద్యాధికారి తెలిపారు.

పారిశ్రామిక వాడలో...
సరస్వతీ నిలయం

● 500 మంది పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య ● సామాజిక సేవకు ఏపీఎండీసీ ప్రాధాన్యం



పాఠశాల గదిలో విద్యార్థులు

ఒబులవారిపల్లె: బెరైటీస్ ఖనిజ నిక్షేపాలతో ప్రపంచ చిత్రపటంలో గుర్తింపు పొందిన మంగంపేట పారిశ్రామిక వాడలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ యాజమాన్యం శ్రామికుల పిల్లలతో పాటు పరిసర గ్రామాల పిల్లలకు సరస్వతి నిలయం ద్వారా 500 మందికి కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తోంది. ఏపీఎండీసీ కేవలం బెరైటీస్ ఖనిజం ద్వారా వచ్చే లాభాలతో సరిపెట్టుకోకుండా సామాజిక బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో ప్రధానంగా సంస్థలో పనిచేసే కార్మికుల పిల్లలతలో పాటు ఇతర గ్రామాల చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. దీంతో నిర్వాసితులకు ఏర్పాటు చేసిన పునరావాస గ్రామాల నడిబొడ్డున సువిశాలమైన స్థలం కేటాయించింది. వంద సంవత్సరాల భావితరాల వారు చెప్పుకునే రీతిలో అత్యంత ఆధునిక భవన నిర్మాణాలు ఏర్పాటుకు ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి నమూనా వేయించారు. దేశవిదేశాలు తిరిగి ఏ ప్రైవేటు పాఠశాలకు తీసిపోని విధంగా ఉండాలని ఎండీ చౌదరి ఊహించారు. తాను ఊహించిన విధంగానే ఆధునికత ఉట్టిపడేలా పాఠశాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎందరో ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్లుగా పని చేశారని, కాకుండా ఫలానా సమయంలో చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఏపీఎండీసీ డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు సామాజిక సేవా ఆనవాళ్లుగా చెప్పుకునే రీతిలో పాఠశాల భవన సముదాయం నిర్మితమైంది. జూన్ మాసంలో అడ్మిషన్లు మొదలై జూలై నుంచి తరగతులు మొదలయ్యాయి. దక్షిణ భారతదేశంలో విద్యాసంస్థల నిర్వహణ మేటిగా ఉన్న ఓ క్రిడ్జి విద్యా సంస్థకు ఏపీఎండీసీ పాఠశాల నిర్వహణ బాధ్యతలు యాజమాన్యం అప్పగించింది. పాఠశాల భవన నిర్మాణ పనులు పునరులు మొదలు అప్పగింత వరకు దశల వారీగా ఎండీ చౌదరి స్వయంగా పరిశీలిస్తూ వచ్చారు. చాలీచాలని జీతాలతో సంసారాలు నడపుకుంటూ పిల్లలను చదివించలేక పోతున్నారని, ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటిలో వెంకయ్యచౌదరి గమనించారు. మనిషికి చక్కటి ఉన్నత చదువు కలిగి ఉంటే సమాజంలో ఎలాగైనా బతకగలడని, కార్మికుని పిల్లలు కార్మికులుగా కాకుండా ఉన్నత చదువులు కల్పిస్తే మంచి భవిష్యత్తు ఇచ్చిన వారమవుతామని సంకల్పించారు. ఈ సంకల్ప ఫలితమే ప్రైవేటు పాఠశాలలను తీసిపోని విధంగా ఏపీఎండీసీ పాఠశాల ఏర్పాటైంది. పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే మామూలు ప్రభుత్వ పాఠశాలల మాదిరి నడుస్తాయని ఎండీ భావించారు. ఇందుకు కొంత వ్యయం అయినా ఫర్వాలేదని నిర్ణయించి ప్రభుత్వ అనుమతితో పాలక మండలి ఆమోదంతో ఓ క్రిడ్జి అనే విద్యా సంస్థకు కొన్ని నిబంధనలతో పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. కార్మికుని స్తోమతకు తగ్గట్టు కారు చౌక ఫీజులతో ముందుగా సంస్థలో పనిచేసే కార్మికులకు ప్రాధాన్యత ఇచ్చారు. అటు తరువాత నిర్వాసితులకు పరిసర గ్రామాల్లోని పిల్లలకు పాఠశాల ప్రవేశానికి అవకాశాలిచ్చారు. పూర్తి ఆంగ్లమాధ్యమంలో తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల నిర్వహణ క్రమశిక్షణను చూసి స్థానికులు ఏపీఎండీసీ పాఠశాలను సరస్వతి నిలయంగా పిలుచుకుంటున్నారు. పాఠశాల ఆవరణ మొత్తం పచ్చదనంతో అలరారుతోంది.

పాఠశాల గదులు, వాతావరణానికి తగ్గట్టు గదుల లోపుల విద్యార్థుల డెస్కులు, ఫర్నీచరు ఏర్పాటు చేశారు. ఇంతటి ఖరీదైన పాఠశాల మంగంపేట పునరావాస గ్రామంలో ఏర్పడిందంటే బెరైటీస్ గనుల ఏర్పాటుతో తను అదృష్టంగా స్థానికులు భావిస్తున్నారు. నూతన భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఏపీఎండీసీ పాఠశాలను ప్రారంభించాలని యాజమాన్యం ఎదురు చూస్తూ ఉంది.



ఏపీఎండీసీ మాదిరి పాఠశాల



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహం




పాఠశాలనుద్దేశించి ప్రసంగిస్తున్న ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకయ్యచౌదరి

ఎండుతున్న పైర్లు

● కోతకొస్తాయనుకుంటే పశువుల మేతకు వదిలేయాల్సిన పరిస్థితి
● ఇదీ బద్వేలు వ్యవసాయ డివిజన్‌లో రైతుల దుస్థితి

బద్వేలు : ఏటా రైతు ఖరీఫ్ సీజన్‌లో సొద్ద, వరి ప్రధాన పంటలు సాగు చేయడం అనవాయితీగా వస్తోంది. ఈ పంటలు సాగుచేసినా, ప్రకృతి కన్నెర్ర చేయడంతో తీరా పంటచేతికి అందుతుందన్న గంపెడు ఆశతో ఉన్న అన్నదాతకు వరుణుడు కరుణించకపోవడంతో కంటకన్నీరు తప్పలేదు. ఈ సారి సజ్జరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవికాలాన్ని తలపింప చేస్తూ, వర్షాకాలాన్ని సైతం వరుణుడు కరుణించకపోవడంతో వరి, సజ్జవంటి పంటలు ఎండిపోతున్నాయి. వారం రోజుల్లో వర్షాలు పడకపోతే బద్వేలు వ్యవసాయ డివిజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోతారు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లో దాదాపు 5,400 ఎకరాల్లో సజ్జపంట, 1000 ఎకరాల్లో కంది పంట దెబ్బతినే పరిస్థితులు కానవస్తున్నాయి. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, బి.మఠం మండలాల్లో ఖరీఫ్‌లో 22,560 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుకావాల్సి ఉండగా, ప్రస్తుతం 12385 ఎకరాల్లో మాత్రమే వరిసాగైంది. ఈ ఐదు మండలాల్లో 14 వేల వ్యవసాయబోర్లు ఉన్నా, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో 4వేల బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఏప్రిల్‌లో 74.8 మిల్లీమీటర్లు వర్షం కురవాల్సి ఉండగా, 189.4 మిల్లీ మీటర్లు కురిసింది. మే నెలలో 191.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, 151.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 622 మిల్లీమీటర్లకు గాను 63.8 మిల్లీమీటర్లు నమోదైంది. పోరుమామిళ్ల మండలంలో ఖరీఫ్‌లో 5,350 ఎకరాల్లో సాగు కావాల్సి ఉంది, కానీ వరి 1695 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, ప్రస్తుతం తోకలపల్లె, గుర్రప్పగారిపల్లె, వాసుదేవాపురం, రామేశ్వరం ప్రాంతాల్లో 80 ఎకరాల్లో సాగు అయింది, వర్షాలు వస్తే వరిపైరు వేసుకోవడానికి రైతులు ఆశతో ఉన్నారు. సజ్జ 865 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, వర్షాధార పంటలుగా రైతులు 2875 ఎకరాల్లో సాగుచేశారు. మొక్కజొన్న 225 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 30 ఎకరాల్లో సాగైంది. కంది 198 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 80 ఎకరాల్లో, పత్తి 1490 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 112 ఎకరాల్లో సాగైంది. పసుపు 650 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 180 ఎకరాల్లో మాత్రమే విత్తనాలు వేశారు. బి.మఠం మండలంలో వరి 2,165 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా, 3225 వరినాట్లు పూర్తయ్యాయి. వర్షాలు కురిస్తే మరో 700 ఎకరాల్లో వరిపైరు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. సజ్జ 95 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 355 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న 155 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 30 ఎకరాల్లో సాగైంది. పత్తి 843 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 750 ఎకరాల్లో సాగైంది. కలసపాడు మండలంలో 4,893 ఎకరాల్లో సగటు సాగు చేయాల్సి ఉంది. వరి 1488 ఎకరాలకు 25 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 75 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 30 ఎకరాల్లో సాగైంది. కంది 285 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 375 ఎకరాల్లో సాగైంది. చెరకు 285 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 40 ఎకరాల్లో, పత్తి 1455 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 688 ఎకరాల్లో సాగైంది. బి.కోడూరు మండలంలో సగటు సాగువిస్తీర్ణం 1960 ఎకరాలు, వరి 1047 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 25 ఎకరాల్లో, సజ్జ 78 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 920 ఎకరాల్లో సాగు అయింది. కంది 90 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 20 ఎకరాల్లో సాగు అయింది. పత్తి 560 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 280 ఎకరాల్లో సాగైంది. కాశినాయన మండలంలో సగటు సాగు విస్తీర్ణం 6345 ఎకరాలు, వరి 1818 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 50 ఎకరాల్లో, సజ్జ 215 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 725 ఎకరాల్లో, మొక్కజొన్న 85 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 105 ఎకరాల్లో సాగైంది. కంది 1175 ఎకరాల్లో సాగుకావాల్సి ఉండగా, 2815సాగు అయింది, పత్తి 1923 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 1225 ఎకరాల్లో సాగు అయింది. బద్వేలు డివిజన్ వ్యాప్తంగా సుమారు 438 హెక్టార్లలో సజ్జపంట ఎండిపోయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు కురవకపోతే 562 హెక్టార్లలోని సజ్జపంటపై తీవ్రప్రభావం పడే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.



ఎండిపోతున్న సజ్జ పైరు



కొర్రపాటిపల్లె సమీపంలో గేదెలకు సజ్జపైరును వదిలేసిన రైతులు

కౌమార బాలికలకు వరం...
కిశోరి వికాస్ పథకం

కడప, అర్బన్: భారతదేశంలో రానురాను లింగ వివక్షతతో అమ్మాయిల సంఖ్య గణనీయంగా పడిపోతుండడంతో కౌమార బాలిక దశ నుంచే వారికి అవగాహన కల్పించి చైతన్యవంతులుగా తీర్చిదిద్ది బాలికల పరిరక్షణకు నాంది పలికే విధంగా కేంద్ర ప్రభుత్వం కిశోరి వికాస్ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం దేశంలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 918 మంది అమ్మాయిలే వున్నారు. రాను రానూ ఇంకా తగ్గే ప్రమాదం వుందని ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలను ఈ పథకం ద్వారా చేపట్టింది. దేశంలోని 110 జిల్లాల్లో లింగనిష్పత్తి లెక్కల ప్రకారం అబ్బాయిల కంటే అమ్మాయిలు తక్కువ వున్నారు. కడప జిల్లా కూడా ఇందులో వుంది. జిల్లా స్థాయి కమిటీలో ఛైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా జిల్లా విద్యాశాఖాధికారి, ఎస్ఎస్ఏ పథకాధికారి, ఇంటర్ విద్య ఆర్ఐవో, ప్రాంతీయ కళాశాల విద్య ఆర్‌డీ, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డీడీ, జిల్లా బీసీ సంక్షేమాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, జిల్లా మైనార్టీల అధికారి, కన్వీనర్‌గా ఐసీడీస్ పీడీ వుంటారు. జిల్లాలో ఎంపిక చేయబడిన కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు తమ కళాశాలల నుంచి చురుగ్గా వున్న బాలికలను ఎంపిక చేసి వారిని పీర్ గ్రూప్ ట్రైనర్‌లుగా తయారు చేయాలి. జిల్లా మొత్తం వెయ్యి మందిని పీజీటీలుగా తీసుకోవాలి. జిల్లా స్థాయిలో 18 మంది వివిధ రంగాలలో నిష్ణాతులైన శిక్షకులను ఎంపిక చేసి పీజీటీలకు శిక్షణ ఇవ్వాలి. తరువాత వెయ్యి మంది పీజీటీలను 200 టీములుగా తయారు చేసి ఒక్కో టీమ్‌లో 5 మంది పీజీటీలను నియమిస్తారు.



కిశోర కౌమార బాలికలు

పీజీటీలు నిర్వహించాల్సిన అవగాహన సదస్సులు

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్, కేజీబీవీలలో వున్న కిశోర బాలికలు అంటే 11 సంవత్సరాల నుంచి 18 ఏళ్ల లోపు బాలికల సంఖ్య ఆధారంగా పీజీటీ టీములను పంపి నాలుగు రోజుల పాటు ఎంపిక చేసి 15 అంశాలపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల చొప్పున గ్రామాలలో బడిమాని వేసిన కిశోర బాలికలకు అవగాహన కల్పించాలి.

ఎంపిక చేసిన 15 అంశాలివే

పోషకాహారం, రక్తహీనత, బాలికల కోసం రుతుక్రమం, పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సంబంధ బాంధవ్యాలు, విలువలు, బాల్య వివాహాలు, బాల్యవివాహ నిరోధక చట్టం 2006 గురించి ఆంధ్రప్రదేశ్ వివాహాల నమోదు తప్పనిసరి. నమోదు చట్టం 2002 గురించి 9 లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం 2012, పరస్పర రక్షణ (సన్నిహితుల ఒత్తిడి గురించి) జాగ్రత్తలపై అవగాహన, సమానత్వం, బాలికల అక్రమ రవాణా, కౌమార బాలలు సౌందర్యం గురించి శ్రద్ధ, పరస్పర ఆకర్షణకు మధ్య తేడా, కెరియర్ గైడెన్స్. పీజీటీలు నిర్వహించిన అవగాహన సదస్సులో ముగిసిన వెంటనే అందరితో సమావేశం నిర్వహించి వారి అనుభవాలను తెలుసుకొని సర్టిఫికెట్లను అందిస్తారు. తిరిగి ఆరు నెలల తరువాత కిశోర బాలికలను కలిసి వారికి అంశాలను తిరిగి జ్ఞప్తికి తేవడం వారిలో వచ్చిన మార్పులను నమోదు చేయడం జరుగుతుంది.

మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?

మెంటల్ ఎబిలిటీ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

1. ఒక కోడ్ భాషలో PEACEను FEDIUగా రాశారు. అదే కోడ్‌లో FAITH ను ఎలా రాస్తారు?
ఎ) IVLEK బి) KLEVI
సి) EIKLK డి) ఏదీకాదు

2. ఒక కోడ్‌లో GENIUSను TVJOFHగా రాశారు. అదే కోడ్‌లో NATUREను ఎలా రాస్తారు?
ఎ) OBUSVF బి) FSVUBO
సి) UBOVFS డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో GOODను 76గా రాశారు. అదే కోడ్‌లో HEARను ఎలా రాస్తారు?
ఎ) 67 బి) 58 సి) 49 డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో STUDENTను FPWDRRRగా రాశారు. అదే కోడ్‌లో TEACHERను ఎలా రాస్తారు?
ఎ) XCUGISC బి) SCXCUGI
సి) IGUCSCX డి) ఏదీకాదు

(5 - 7) ఒక కోడ్ భాషలో
nic sac tic అంటే all are good
sac mic mec అంటే good luck people
tic mec rac అంటే all people nice
పై కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

5. sac నకు సరైన కోడ్?
ఎ) good బి) luck సి) are డి) ఏదీకాదు

6. rac నకు సరైన కోడ్?
ఎ) luck బి) nice సి) all డి) people

7. mec నకు సరైన కోడ్?
ఎ) all బి)good సి)people డి) luck

8. 10, 5.5, 6.5, 15, 64, ------
ఎ) 520 బి) 256 సి) 128 డి) 156

9. 600, 120, 30, 10, 5, ------
ఎ) 6 బి) 8 సి) 4 డి) 5

10. 68, 14, 85, 13, 93, 12, 89, ----
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18

11. 5, 6, 11, 17, 28, 45, ------
ఎ) 73 బి) 75 సి) 78 డి) 81

(12 - 14) భిన్నమైన దానిని తెలపండి?

12. ఎ) LOP బి) KPO సి) TGW డి) IRM

13. ఎ) 347 బి) 819 సి) 628 డి) 529


14. ఎ) రాగి బి) తగరం సి) తుత్తినాగం డి) జింక్

15. FAME : GOCH :: KING : --------
ఎ) IPKM బి) IKMP సి) PMKI డి) ఏదీకాదు

16. గడియారంలో సమయం గం7.30నిలు అయింది. నిమిషాల ముల్లు ఈశాన్యాన్ని చూపిస్తోంది అనుకొంటే గంటల ముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?
ఎ) పడమర బి) దక్షిణం సి) ఉత్తరం డి) తూర్పు

17. విజయ్ కాలేజీకి వెళ్లాలనుకొన్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు తూర్పున ఉంది. ఆ రోడ్డు కూడలికి వచ్చిన తరవాత ఎడమవైపున ఆడిటోరియం ఉంది. అతని ఇంటికి ఎదురు రోడ్డులో బ్యాంక్ ఉంది. అయితే కాలేజ్ ఏ దిశలో ఉంది?
ఎ) దక్షిణం బి) ఉత్తరం సి) పడమర డి) తూర్పు

18. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?




ఎ) 260 బి) 220 సి) 280 డి) 240

19. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?

L [illegible]	N [illegible]	M [illegible]
M [illegible]	L [illegible]	N [illegible]
N [illegible]	M [illegible]	?

ఎ) L_{100} బి) N_{80} సి) M_{60} డి) L_{120}

20. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్య?



ఎ) 172 బి) 186 సి) 144 డి) 196

21. ఫొటోలో ఉన్న ఒక వ్యక్తిని చూపిస్తూ అజయ్ ఇలా చెబుతున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక కుమారుని ఏకైక సోదరి భర్తకు కుమార్తె కొడుకు'. అయితే ఫొటోలోని వ్యక్తి అజయ్‌కు ఏమవుతాడు?
ఎ) మేనమామ బి) మేల్లుడు
సి) అల్లుడు డి) సోదరుడు

22. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అవినాష్ ఇలా చెబుతున్నారు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కుమారుడి సోదరి భర్త భార్యకు ఏకైక సోదరుడు.' అయితే ఫొటో లోని వ్యక్తికి అవినాష్ ఏమవుతాడు?
ఎ) అల్లుడు బి) సోదరుడు సి) తండ్రి డి) కుమారుడు

23. AA, BE, FI, OO, -------------
ఎ) EU బి) EV సి)FU డి) FV

24. AZ, CX, FT, JN, --------------
ఎ) DE బి) OF సి) FO డి)EP

25. TE, SF, QI, NN, ----------
ఎ) JU బి) KU సి) IV డి) TV

26. a - c - cbc - b - ca - cbab - a -
ఎ) babacac బి) baaabcc
సి) ababacc డి) ఏదీకాదు

27. aab - dab - cdabc - d - bc - d
ఎ) abcdc బి) bcdcd సి) cbcad డి) ఏదీకాదు

28. వికాస్ దక్షిణానికి 7మీ. నడిచిన తరవాత ఎడమ వైపునకు తిరిగి 9 మీటర్లు నడిచాడు. చివరకు మరల కుడివైపునకు తిరిగి 5మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వికాస్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ నైరుతి బి) 15 మీ వాయవ్యం
సి) 15 మీ ఆగ్నేయం డి) 15 మీ ఈశాన్యం

29. ఒక వరసలో అనిల్ కుడివైపునుంచి 24వ స్థానంలోను, ఎడమవైపునుంచి 17వ స్థానంలోను ఉన్నాడు. అదే వరసలో సునీల్ ఎడమవైపు నుంచి 26వ స్థానంలో ఉంటే కుడి వైపు నుంచి సునీల్ స్థానమెంత?
ఎ) 15 బి) 18 సి) 16 డి) 19

30. ఒక వరసలో నిశాంత్ కుడివైపునుంచి 18వ స్థానంలోను, ఎడమవైపు నుంచి 13వ స్థానం లోను ఉన్నాడు. అదే వరసలో నిరంజన్ తన కుడివైపునకు 5 స్థానాలు జరిగాడు ప్రస్తుతం అతను ఎడమవైపు నుంచి 22వ స్థానంలో ఉన్నట్లయితే కుడివైపు నుంచి నిరంజన్ మొదటి స్థానం ఎంత?
ఎ) 16 బి) 14 సి) 18 డి) ఏదీకాదు

31. ఇంటర్వ్యూని నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 10 కంటే 15 నిలు ముందుగా వచ్చారు. ఈ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కంటే 30 నిలు ముందుగా వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 45నిలు ముందు వచ్చారు. అయితే ఆయన ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించదలచారు?
ఎ) గం. 11.00ని. బి) గం. 11.02ని.
సి) గం. 11.15 ని. డి) గం. 11.30ని.

32. అజయ్‌కు అతని తల్లిదండుల పెళ్లి రోజు నవంబరు 11, 15ల మధ్య అని గుర్తు. అతని సోదరి ఆర్తికి నవంబరు 13, 17ల మధ్య అని గుర్తు. అయితే వారి తల్లి దండ్రుల పెళ్లి రోజు ఎప్పుడు?
ఎ) నవంబరు 15 బి) నవంబరు 13
సి) నవంబరు 14 డి) ఏదీకాదు

33. (36 X 1/4) of 4 ÷ 6 x 2 - 8+6ను సూక్ష్మీకరించండి?
ఎ) 36 బి) 10 సి) 42 డి) ఏదీకాదు

34. P అంటే ÷, Q అంటే x, R అంటే -, S అంటే + అయితే 36P4Q5R8S4 విలువ ఎంత?
ఎ) 41 బి) 39 సి) 45 డి) ఏదీకాదు

35. కింది వానిలో సరైన దానిని తెలపండి
ఎ) 18 ÷ 3 X 4 - 5 + 3 = 20
బి) 25 ÷ 5X 3 - 6 + 4 = 15
సి) 35 ÷ 7X 6 - 4 + 7 = 33 డి) ఏదీకాదు

36. SHIPCYS పదంలోని అక్షరాల స్థానాలను మార్చగా ఒక పాఠ్యాంశం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి అక్షరం ఏమిటి?
ఎ) H బి) P సి) I డి) ఏదీకాదు


37. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్య ఏర్పడే పదాన్ని తెలపండి?
1. Mango 2. Music 3. Margin
4. Marble 5. Medium
ఎ) Music బి) Mango సి) Medium డి) Margin

38. ఈ రోజు నవంబరు 29 ఆదివారం. ఇది లీపు సంవత్సరమైతే మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?
ఎ) బుధవారం బి) గురువారం
సి) మంగళవారం డి) ఏదీకాదు

39. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల ఏది?
ఎ) నవంబరు బి) డిసెంబరు
సి) జనవరి డి) ఏదీకాదు

40. గడియారంలో సమయం గం.2.30 నిలు అయితే గంటల ముల్లు, నిముషాల ముల్లు మధ్య కోణమెంత?
ఎ) 100^0 బి) 90^0 సి) 105^0 డి) ఏదీకాదు

(41-46)



పై రేఖాచిత్రంలో దీర్ఘచతురస్రం భారతీయులను, వృత్తం సైనికులను, త్రిభుజం పురుషులను సూచిస్తుంది. పై రేఖాచిత్రం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

41. భారతీయులైన పురుషులను సూచించే అక్షరం?
ఎ) C బి) G సి) F డి) ఏదీకాదు

42. భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) G బి) D సి) E డి) ఏదీకాదు

43. పురుషులైన భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) C బి) F సి) D డి) ఏదీకాదు

44. భారతీయులను సూచించే అక్షరం?
ఎ) F బి) B సి) A డి) ఏదీకాదు

45. కేవలం సైనికులను సూచించే అక్షరం?
ఎ) B బి) D సి) E డి) ఏదీకాదు

46. అద్దంలో చూసినపుడు సమయం గం.4.20 నిలు. అయితే అసలు సమయం?
ఎ) గం.7.30ని బి) గం7.40ని
సి) గం.8.40ని డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ	8) ఎ	15) ఎ	23) ఎ	31) ఎ	39) బి
2) బి	9) డి	16) డి	24) బి	32) సి	40) సి
3) ఎ	10) సి	17) బి	25) ఎ	33) బి	41) సి
4) సి	11) ఎ	18) బి	26) బి	34) ఎ	42) బి
5) ఎ	12) సి	19) ఎ	27) సి	35) సి	43) ఎ
6) బి	13) డి	20) సి	28) సి	36) బి	44) బి
7) సి	14) సి	21) బి	29) ఎ	37) డి	45) సి
		22) డి	30) బి	38) ఎ	46) బి

JOBS ఉద్యోగాలు

బిహెచ్ఇఎల్

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బిహెచ్ఇఎల్)- టెక్నీషియన్ అప్రెంటిస్‌ల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 310

అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ వ్యవధి: ఏడాది

క్యాంపస్: బిహెచ్ఇఎల్, ఇడిఎన్, బెంగళూరు

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్/ సివిల్/ మెకట్రానిక్ ఇంజనీరింగ్

అర్హత: 2015 జనవరి 1 నాటికి సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: ఆగస్టు 1 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.

ఇంటర్వ్యూలు పూర్తయ్యే తేదీ: ఆగస్టు 31

వేదిక: Bharath Heavy Electricals Limited, Electronics Division, Mysuru Road, Bengaluru - 560026

వెబ్‌సైట్: www. bheledn.com
www.bheldn.com

ఐఐటి మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)- జూనియర్ టెక్నీషియన్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 32

పోస్టులు - ఖాళీలు: రిజిస్ట్రార్ 1, సిస్టమ్స్ ఇంజనీర్ 1, సెక్యూరిటీ ఆఫీసర్ 1, జూనియర్ ఇంజనీర్ 3, స్టాఫ్ నర్స్ 4, జూనియర్ టెక్నీషియన్ 12, జూనియర్ అసిస్టెంట్ 10

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఇ/ ఎంటెక్(కంప్యూటర్ సైన్స్) + ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలి లేదా 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్) + పదేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: 27 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.100

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 8

దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15

చిరునామా: The Assistant Registrar, Recruitment Section, Admin. Building(First Floor), IIT Madras, Chennai - 600036

వెబ్‌సైట్: www.recruit.iitm.ac.in

డిఆర్‌డిఒ

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ)- జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 11

అర్హత: ఫస్ట్ క్లాస్ మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఇన్ సైకాలజీ ఉత్తీర్ణత + నెట్ అర్హత పొంది ఉండాలి.

వయసు: 28 ఏళ్లు మించరాదు

స్టయిపెండ్: మొదటి రెండేళ్లు నెలకు రూ.25,000 మూడో ఏడాది నెలకు రూ.28,000 ఇస్తారు. హెచ్ఆర్ఏ + మెడికల్ ఫెసిలిటీస్ తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15000 ఇస్తారు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా

ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు రూ.10ల ఇండియన్ పోస్టల్ ఆర్డర్‌ను జతచేసి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7

చిరునామా: Director DIPR, Lucknow Road, Timarpur, Delhi - 110054

గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?

ఆదేశిక సూత్రాలు

1. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగ నిర్మాతలు ఏ దేశం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) అమెరికా సి) బ్రిటన్ డి) రష్యా
2. ఆదేశిక సూత్రాల ముఖ్య లక్ష్యం?
ఎ) సామ్యవాద వ్యవస్థను ఏర్పాటు చేయడం
బి) సంక్షేమ రాజ్యస్థాపన(లేదా) శ్రేయోరాజ్య స్థాపన
సి) పెట్టుబడిదారీ వ్యవస్థను రూపొందించడం
డి) కమ్యూనిస్ట్ వ్యవస్థను రూపొందించడం
3. ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్ ఏ దేశం నుంచి స్వీకరించింది?
ఎ) రోమ్ బి) అమెరికా సి) స్పెయిన్ డి) రష్యా
4. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?
ఎ) రెండో భాగం 5 నుంచి 11 ఆర్టికల్ వరకు
బి) మూడో భాగం 12 నుంచి 35 ఆర్టికల్ వరకు
సి) నాలుగో భాగం 36 నుంచి 51 ఆర్టికల్ వరకు
డి) 4(ఎ) భాగం, 51(ఎ) ఆర్టికల్
5. ప్రభుత్వ విధానాలను రూపొందించడం, వాటిని అమలులో వేటిని ప్రాథమికాలుగా భావిస్తారు?
ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు డి) ఏదీకాదు
6. ఆదేశిక సూత్రాలకు చట్ట సంరక్షణ లేదు, వీటిని కోర్టుల ద్వారా అమలు పరచడానికి వీలు లేదు అని తెలిపే అధికరణం?
ఎ) 36వ బి) 37వ సి) 38వ డి) 39వ
7. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు వేటి ప్రభావ ఫలితం?
ఎ) సామ్యవాద భావాలు బి) ప్రాథమిక హక్కులు
సి) ప్రాథమిక విధులు డి) పైవన్నీ
8. మన రాజ్యాంగ పీఠికలో 'సామ్యవాద' అనే పదాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
9. సామ్యవాదాన్ని అమలుచేయడానికి రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు?
ఎ) విధివిధానాలు బి) ప్రాథమిక విధులు
సి) ప్రాథమిక హక్కులు డి) ఆదేశిక సూత్రాలు
10. ఆదేశిక సూత్రాలను ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు జవాబుదారిగా నిలవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది?
ఎ) గాంధీ బి) నెహ్రూ సి) పటేల్
డి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
11. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ ప్రవేశికలో ఉదహరించిన ఆశయాలను పోలి ఉంటాయని అన్నది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) బి.ఎన్.రావు
సి) ఎన్.గోపాలస్వామి డి) గాంధీజీ
12. ఆదేశిక సూత్రాలు శాసన వ్యవస్థకు కరదీపం వంటిదని పేర్కొనది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) ఎన్.గోపాలస్వామి
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు
13. ఆదేశిక సూత్రాలను వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండీ అని ఎవరు అన్నారు?
ఎ) ఎం.సి.సెతల్వాడ్ బి) కె.ఎం.మున్షీ
సి) ఎం.సి.చాగ్లా
డి) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
14. భారత ప్రభుత్వం నిర్దేశిక నియమాలను నిజాయతీగా అమలుచేస్తే భారతదేశం ఒక భూతల స్వర్గం అవుతుందని పేర్కొనది?
ఎ) గాంధీ బి) ఎం.సి.చాగ్లా
సి) అంబేద్కర్ డి) ఎం.సి.సెతల్వాడ్
15. బలహీనవర్గాల విద్య, ఆర్థిక స్థితిగతులు మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపే నిబంధన?
ఎ) 44వ బి) 45వ సి) 46వ డి) 47వ
16. ఆదేశిక సూత్రాల్లో ఏ అధికరణం గ్రామపంచా యతీల ఏర్పాటును సూచిస్తుంది?
ఎ) 40 బి) 41 సి) 42 డి) 43
17. స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి అని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 38 బి) 39 సి) 39(డి) డి) 39(ఇ)
18. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఏ రాష్ట్రానికి వర్తించవు?
ఎ)జమ్మూకశ్మీర్ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) సిక్కిం డి) అస్సాం
19. గోవధను నిషేధించిన రాష్ట్రాలు?
ఎ) ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక
సి) తమిళనాడు, జమ్మూకశ్మీర్
డి) మహారాష్ట్ర, తెలంగాణ
20. గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ


కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

21. మత్తుమందులు, మత్తు పానీయాలను నిషేధించి ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి అని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 47వ సి) 48వ డి) 50వ
22. సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తెలంగాణ డి) గుజరాత్
23. ఒకే శిక్షాస్మృతి అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కేరళ సి) గోవా డి) తెలంగాణ
24. కార్మికులకు కనీస వేతనం, కనీస పనిగంటలు కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ
25. మహిళలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 42వ బి) 43వ సి) 44వ డి) 45వ
26. దేశంలోని పౌరులందరికీ ఒకే శిక్షాస్మృతిని అమలు చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 40వ బి) 44వ సి) 50వ డి) ఏదీకాదు
27. ఆరేళ్లలోపు బాలబాలికలకు అందించే బాలబడి విద్యను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా 45వ అధికరణంలో చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1956, 7వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
28. చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను సంరక్షించాలని, జాతీయ వస్తువులను పరిరక్షించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 48వ బి) 49వ సి) 50వ డి) 51వ
29. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆదేశిక సూత్రాల్లో అదనపు సూత్రాలను చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 2001, 85వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
30. యువతీయువకులు, బాలబాలికలు దురలవాట్లకు లోనుకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని తెలిపే నిబంధన?
ఎ) 39(ఎ) బి) 39(ఇ) సి) 39(ఎఫ్) డి) 39వ
31. రాజ్యాంగంలో ఏ అధికరణం నిరుద్యోగ భృతిని కల్పించాలని తెలుపుతుంది?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ
32. వృద్ధాప్య పెన్షన్ ఏ అధికరణం ప్రకారం కల్పించాలి?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ
33. ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధాప్య పెన్షన్‌ను కల్పించిన మొదటి ముఖ్యమంత్రి?
ఎ) కోట్ల విజయభాస్కరరెడ్డి బి) నీలం సంజీవరెడ్డి
సి) వై.ఎస్.రాజశేఖరరెడ్డి డి) ఎన్.టి.రామారావు
34. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేనిది?
ఎ) ఆశ్రయ హక్కు బి) పని హక్కు
సి) విద్య హక్కు
డి) ప్రభుత్వ సహాయ హక్కు
35. ప్రపంచ శాంతికి కృషి చేయడం, అంతర్జాతీయ శాంతిభద్రతలను పెంపొందించుకోవాలని తెలిపే అధికరణం?
ఎ) 50వ బి) 51వ సి) 51(ఎ) డి) ఏదీకాదు
36. పేదలకు ఉచిత న్యాయసహాయం గురించి తెలిపే అధికరణం?
ఎ) 38వ బి) 39వ సి) 39(ఎ) డి) 43(ఎ)
37. యుపిఎ ప్రభుత్వం ఏ అధికరణం ప్రకారం 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని కల్పించింది?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ
38. వెట్టిచాకిరి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1973 బి) 1974 సి) 1975 డి) 1976
39. నిరుద్యోగ భృతిని అందిస్తున్న రాష్ట్రాలు?
ఎ) పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
సి) కర్ణాటక, తమిళనాడు డి) మహారాష్ట్ర, బీహార్
40. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వికలాంగులకు ఎంత పెన్షన్ ఇస్తున్నారు?
ఎ) రూ.500 బి) రూ.1000
సి) రూ.1200 డి) రూ.1500
41. వికలాంగులకు భృతిని కల్పిస్తున్న రాష్ట్రాలు?
ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, సిక్కిం
బి) మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా
సి) గోవా, కేరళ, నాగాలాండ్ డి) పైవన్నీ
42. నిర్దేశిక నియమాలు రాజ్యాంగానికి ప్రాణవాయువు వంటిది అని అన్న దౌత్యవేత్త, న్యాయకోవిదుడు ఎవరు?
ఎ) ఎల్.ఎం.సింఘ్వి బి) కె.టి.షా
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు
43. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కుల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
44. యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 39(ఎ) సి) 43(ఎ) డి) 48(ఎ)
45. ఆదేశిక సూత్రాలను మూడు రకాలుగా వర్గీకరించిన పరిపాలన శాస్త్రవేత్త?
ఎ) ఎం.పి.శర్మ బి) జి.ఎన్.జోషి
సి) ఎ, బి డి) ఎవరూ కాదు
46. అడవులు, అటవీ జంతువుల సంరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తెలిపే అధికరణం?
ఎ) 39(ఎ) బి) 43(ఎ) సి) 48(ఎ) డి) 50
47. వ్యవసాయం, పశుగణాభివృద్ధిని శాస్త్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 48వ బి) 48(ఎ)వ సి) 49వ డి) 50వ
48. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరులకు పౌష్టికాహారం అందించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ

సమాధానాలు

1) ఎ	8) బి	15) సి	22) డి	31) బి	40) డి
2) బి	9) డి	16) ఎ	23) సి	32) బి	41) ఎ
3) సి	10) డి	17) సి	24) సి	33) డి	42) ఎ
4) సి	11) ఎ	18) ఎ	25) ఎ	34) ఎ	43) బి
5) సి	12) సి	19) ఎ	26) బి	35) బి	44) సి
6) బి	13) డి	20) సి	27) డి	36) సి	45) సి
7) ఎ	14) బి	21) బి	28) బి	37) ఎ	46) సి
			29) ఎ	38) సి	47) ఎ
			30) సి	39) ఎ	48) బి

అడ్మిషన్స్

బిఐఆర్ఇడి

హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బిఐఆర్ఇడి)- గ్రామీణ యువకుల కోసం ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
శిక్షణాంశాలు: మొబైల్ సర్వీసింగ్/ యంయస్ ఆఫీస్/ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్ / ఎలక్ట్రీషియన్ & వ్యవసాయ పంపుసెట్ రిపెయిర్
అర్హత: శిక్షణాంశాన్ని అనుసరించి పదోతరగతి/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 19 నుంచి 30ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తారు.
శిక్షణ కార్యక్రమాల తేదీలు: సెప్టెంబరు 13 నుంచి నవంబరు 7 వరకు
ప్రస్తుతం చదువు కొనసాగిస్తున్నవారు, బిఇడి/ ఇంజనీరింగ్/ ఎంబిఏ/ ఎంసిఏ పూర్తిచేసినవారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.
వెబ్‌సైట్: www.bired.org

ఉద్యోగాలు

ఐటిబిపిఎఫ్

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపిఎఫ్)- సబ్ ఇన్‌స్పెక్టర్ (ఓవర్‌సీర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21(పురుషులకు 18, మహిళలకు 3 పోస్టులు కేటాయించారు)
వయసు: సెప్టెంబరు 22 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: మెట్రిక్యులేషన్ + డిప్లొమా(సివిల్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: రిక్రూట్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in

పారదీప్ పోర్ట్ ట్రస్ట్

పారదీప్ పోర్ట్ ట్రస్ట్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 8
పోస్టులు: చీఫ్ మేనేజర్ 4, సీనియర్ మేనేజర్ 2, మేనేజర్ 2
విభాగాలు: ఇన్వర్మేషన్/ కమ్యూనికేషన్ & ట్రేడ్ ఫెసిలిటేట్/ఎన్విరాన్‌మెంట్ & సేఫ్టీ/ బిజినెస్ డెవలప్‌మెంట్ & ట్రేడ్ ప్రమోషన్/ కార్పొరేట్ రిలేషన్ & కమ్యూనికేషన్స్
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 19
చిరునామా: Secretary, Paradip port Trust, Administrative Building, Paradip - 754142, Jagatsinghpur Dt, Odisha
వెబ్‌సైట్: www.paradipport.gov.in

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

కోడూరులో బ్యాంకుల బంద్



రైల్వేకోడూరు: పట్టణంలో ఉన్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు సమ్మెతో మంగళవారం బ్యాంకులు పనిచేయక కార్యకలాపాలు నిలిచిపోయాయి. బ్యాంకు ఉద్యోగుల చేస్తున్న డిమాండ్లను కేంద్రప్రభుత్వం తక్షణం పరిష్కరించడంతోపాటు బ్యాంకుల ప్రైవేటుపరం చేసే యత్నాలను విరమించుకోవాలంటూ సమ్మె చేశారు. దీంతో బ్యాంకులు బంద్‌కావడంతో ఖాతాదారులు ఇబ్బందులుపడ్డారు.

మట్టి గణపతి .. మహా గణపతి

రైల్వేకోడూరు: మట్టి వినాయక విగ్రహాలను విరివిగా వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో రెండు, మూడేళ్లుగా మట్టి గణపతి ప్రతిమలకు ఆదరణ పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయకులు మట్టి విగ్రహాలనే వాడుతున్నారు. వినాయక చవితి విగ్రహాలు మట్టితోచేయకుండా ప్లాస్టర్ ఆఫ్‌పారిస్ అనే పౌడర్‌తో తయారు చేస్తుండడం వల్ల అవి భూమిలో, నీటిలో కరిగిపోకుండా అలాగే ఉండడంతో నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటోంది. అదే మట్టి విగ్రహాల వల్ల నీటిలో తొందరగా కరిగిపోవడమేకాకుండా పర్యావరణానికి ఎలాంటి ముప్పువాటిల్లదు.
ప్లాస్టర్‌ఆఫ్‌పారిస్ దాదాపు వందసంత్సరాలుపాటు నీటిలో కరిగిపోదు. నీరుకూడా కలుషితం అవుతుం ది. ఇలాంటి ప్రమాదకరంగా ఉంటుందని మేధావులు ప్లాస్టర్‌పారిస్‌పౌడర్‌తో వినాయ కుడి బొమ్మలను ప్రజలు వినాయకచవితికి తీసుకోకుండా ఉండాలని దీనిపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కలిగించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ప్లాస్టర్‌పారిస్‌తో ఎన్నోఅనర్థాలు ఉన్నాయని అధికారులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్లాస్టర్‌పారిస్‌పౌడర్‌తో తయారు చేసిన విగ్రహాలను చెరువుల్లో, నదుల్లో వేయరాదన్నారు. మట్టివిగ్రహాలు తయారు చేసే కార్మికులు రైల్వేకోడూరులో ఉన్నారు. ప్రతి వినాయకచవతికి మట్టివి గ్రహాలు తయారుచేస్తారు. వినాయకచవితి పండుగ ఈనెల 25వతేదిన జరుగుతుండడంతో మూడునుంచి ఐదు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహి స్తారు. అత్తిమానుమగుడు వద్ద కొద్దిగా నీరు ఉంది. అక్కడే విగ్రహాలు నిమజ్జనం చేస్తారు.


కోడూరులో తయారుచేస్తున్న మట్టివిగ్రహాలు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

ఎంఈఓ పోతురాజురామయ్య,
సెల్‌నెం.9963968755



రైల్వేకోడూరు: ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పించిందని మండల విద్యాశాఖాధికారి పోతురాజురామయ్య తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జపాన్ దేశంలో ఉండే మరుగుదొడ్లను ప్రభుత్వపాఠశాల్లో ఏర్పాటుచేస్తున్నామన్నారు. మధ్యాహ్నభోజనాలు సక్రమంగా సాగుతుయన్నారు.



ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ఎలా ఉంది?
జవాబు: పిల్లలకు ఇబ్బందులు జరుగకుండా నాణ్యమైన విద్యనందిస్తున్నాం.
ప్రశ్న: ఉత్తీర్ణశాతం పెంచడానికి ఎలాంటి చర్యలుతీసుకున్నారు?
జవాబు: ప్రభుత్వస్కూళ్లలో ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ఉత్తీర్ణత పెంచడానికి స్టడీఅవర్స్, నైట్‌విజన్ తదితర ఏర్పాట్లు చేశాం. సీగ్రేడు విద్యార్థులకు రోజువారి పరీక్షలు నిర్వహించడంతోపాటు ఇద్దరు పిల్లలను ఉపాధ్యాయుడు దత్తతతీసుకుని చదువులు చెప్పిస్తున్నారు.
ప్రశ్న: మధ్యాహ్నభోజనం సక్రమంగా మెనూ ప్రకారం అందిస్తున్నారా?
జవాబు: మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించేలా ఆదేశాలు ఇవ్వడంతోపాటు అప్పుడప్పుడు తనిఖీ చేస్తున్నాం.
ప్రశ్న: మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?ఎన్ని మూతపడ్డాయి?
జవాబు:- 91పాఠశాలలు ఉన్నాయి. 6పాఠశాలలు మూడపడ్డాయి
ప్రశ్న: ఎన్నింటికి ప్రహారీ లేదు?
జవాబు: 56పాఠశాలకు లేవు, ప్రతిపాదనలు పంపివున్నాం
ప్రశ్న: ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఏమిచేస్తున్నారు?
జవాబు: నూటికినూరుశాతం ఉత్తీర్ణత పెంచడానికి ప్రణాళికలు చేస్తున్నాం.
ప్రశ్న: పాఠ్యపుస్తకాలు అన్నీవచ్చాయా?
జవాబు: అన్నీ పుస్తకాలు వస్తాయి
ప్రశ్న: స్వచ్ఛభారత్ కింద ఏమైనా మంజూరు అయ్యాయా?
జవాబు: రామయ్యపాళెం దిగువదళితవాడ, చియ్యవరం, వెంకటరెడ్డిపల్లె, పిట్టావాండ్లపల్లె, తిమ్మిశెట్టిపల్లె తదితర పాఠశ్చాల్లో జపాన్‌తరహాలో మరుగుదొడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. కొన్నిపూర్తిచేశారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు


కోడూరు వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి పూజలుచేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు: పట్టణంలోని గుంజననది ఒడ్డున వెలసిఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో ఆరా ధనోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయకమిటీ అధ్యక్షుడు కారు మంచిచంద్రయ్య, కోశాధికారి గౌనూతలప్రభాకర్‌ల ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచామృతాభిషేకం, షొడోపచారపూజలు, గోపూజ, అన్నపూర్ణాదేవిపూజ, పల్లకీసేవ తదితర కార్యక్రమాలున్నాయన్నారు. భక్తులు భజన పాటలు ఆలపించారు. స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఐదు ఎర్రదుంగలు, ఇద్దరు దొంగలు అరెస్టు

రైల్వేకోడూరు: వై.కోటఅడవిలో మంగళవారం రైల్వేకోడూరురేంజి అటవీశాఖాధికారులు ఎర్రచందనం అక్రమంగా తరళిపోతుందని సమాచారంతో దాడులు నిర్వహించి ఐదు దుంగలు సహా ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. రైల్వేకోడూరు రేంజర్ నయిమ్‌ఆలీ కథనం మేరకు...వై.కోటఅడవిలో రైల్వేకోడూరు మండలంలోని కన్నెగుంట్ ఎస్టీకాలనీకిచెందిన మల్లేశ్వరీ, రమేష్‌లు 5ఎర్రదుంగలు తీసుకుని తరళిస్తుండగా పట్టుకుని దుంగలు స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లును అరెస్టుచేసి రైల్వేకో డూరు న్యాయస్థానంలో హాజరుపెట్టామని రేంజర్ నయిమ్‌ఆలీ తెలిపారు. ఈకేసులో మరో ఐదుగురు పరారీలో ఉన్నారని ఆయన వివరించారు.


దుంగలుస్వాధీనంచేసుకుని స్మగ్లర్లును అరెస్టుచేసిన అధికారులు

మట్టివిగ్రహాలనే ఏర్పాటు చేయాలి

చిట్వేలి : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ డాక్టర్ నాయక్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టర్‌ఆఫ్ ప్లారిస్‌తో తయారు చేసే విగ్రహాలు నీటిలో కరగవని, అలాగే వాటికి వేసే పలు రకాల రంగులు రసాయనాలతో కూడిన విషపదార్థాలని, పర్యావరణానికి ముప్పువాటిల్లి మానవ మనుగడను ప్రశ్నార్ధకం చేస్తున్నాయని వివరించారు. ఈపండుగ నుంచి అయినా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించే విధంగా ప్రజలు అందరూ ముందుకు రావాలని కోరారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా విగ్రహాలను ఏర్పాటు చేయాలని కరెంటు , మైక్‌కు అనుమతి తీసుకోవాలని, నిమజ్జనానికి వాడే వాహనాలకు సంబందించి అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. పూజలు నిర్వహించే సందర్భంలో ఇతరులకు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎస్ఐ డాక్టర్ నాయక్

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిట్వేలి : హిందూ ముస్లిం సోదరులు ప్రశాంతంగా పండుగలను జరుపుకోవాలని చిట్వేలి ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు. వినాయక చవితి, బక్రీదు పండుగల సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం స్థానిక ముస్లిం సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు ఖదీర్‌బాషా మాట్లాడుతూ ఈ నెల 25న వినాయక చవితి, సెప్టెంబర్ 2న బక్రీదు పండుగలు జరుగునున్న నేపథ్యంలో ఇరుమతాల వారు ఒకరినొకరు గౌరవించుకుంటూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లాబక్స్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మేకల దొంగలపై కేసు నమోదు

చిట్వేలి : మండలంలోని చెర్లోపల్లె తిమ్మాయపాలెం గ్రామాల్లో మేకల పోయినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. చెర్లోపల్లెకు చెందిన చిన్నరంగయ్య సంబందించి ఆరు మేకలు, 2మేకపోతులు తిమ్మాయపాలెం ఎస్టీ కాలనీలో యేదోటి శంకరయ్యకు చెందిననాలుగు గొర్రెలును గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాయక్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

రైల్వేరోడూరురూరల్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని రైల్వే స్టేషన్ మేనేజర్ ఆర్ .నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక కోడూరు రైల్వే స్టేషన్ లో స్వచ్ఛ భారత్- స్వచ్ఛరైలు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్లాట్ ఫాం, రైల్వేట్రాక్, రైల్వే స్టేషన్ ముందు బాగంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రపరిచారు. స్టేషన్ చీఫ్ బుకింగ్ సూపర్ వైజర్ పరమేశ్వరరావు, రేణిగుంటట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జయంత్ కుమార్, టెలికాం ఇంజనీరు నాగిరెడ్డి, సిగ్నల్ ఇన్స్‌పెక్టర్ కామాలెస్, ఎలిక్ట్రికల్ ఇంజినీరు కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతో జత కట్టేందుకు జగన్ తహతహ

● కోడూరు అభివృద్ధి నిజంగా కోరుకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలి ● మాజీ ఎమ్మెల్సీ బత్యాల సవాల్

రైల్వేకోడూరు రూరల్ : బీజేపీతో జత కట్టేందుకు ప్రతిపక్షనేత వైఎస్ జగన్ తహతహ లాడు తున్నారని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయులు అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయులు తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుంటే తన ఎంపీలలో నాజీనామా చేస్తామని ప్రకటన చేసి ఇప్పుడు ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ఎప్పుడు తన ఎంపీలతో రాజీనామా చేయిస్తాడో ప్రకటించాలని తెలిపారు. మాట తప్పము, మడిమ తిప్పమని కల్లిబొల్లి మాటలు చేప్పే జగన్ తన ఎంపీలతో ఎందుకు రాజీనామా చేయించలేదని విమర్శించారు. పొత్తుతో ఉన్న మేము బయటకు వస్తే అందులో చొరబడాలని జగన్ కుయుక్తులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.



సమావేశం లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయులు

ఎమ్మెల్యే ఆరోపణలు అర్థరహితం

స్థానిక వైసీపీ ఎమ్మెలే నియోజక వర్గ అభివృద్ధి జరగలేదని, అధికార పార్టీ నాయకులు సహకరించలేదని ఆరోపించడం తగదన్నారు. రేల్వేకోడూరులో ఇప్పటికి అనేక అభివృద్ధి పనులను చేశామని గుర్తు చేశారు. నియోజక వర్గంలో రూ.55 కోట్లతో 10 బ్రిడ్జిలను నిర్మించామన్నారు. 500 కిలో మీటర్ల మేరకు బీటీ రోడ్లను వేయించామన్నారు. కోడూలులో రెండుకోట్లతో తహసీల్దారు కార్యాలయం, రూ.7.7 కోట్లతో కోర్టు భవనం, సబ్ ట్రెజరీ కార్యాలయం పనసులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు కనీస ప్రయత్నం చేయని ఎమ్మెల్యే కోడూరు అభివృద్ధిపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అంతేకాకుండా నంద్యాలలో ఎన్నికలు అయినందున సుమారు వెయ్యికోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపిస్తున్న ఎమ్మెల్యేకు నిజంగా కోడూరు అభివృద్ధి కోరుకుంటే స్పీకర్ పార్మాట్‌లో రాజీనామా చేస్తే మరో ఆరునెలలకు ఇక్కడ కూడా ఎన్నికలు వస్తాయని తద్వారా వెయ్యికోట్లతో అభివృద్ధి పనులు జరిగి రైల్వేకోడూరు సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. ఎనిమిదేళ్ళు గా ఒక్క అభివృద్ధి పనికోసం తపించని ఎమ్మెల్యే నిరంతరం అభివృద్ధి కోసం తపించి కోట్లాది రూపాయల అభివృద్ధి చేస్తున్న తాము ఎక్కడైనా ఓపన్ డిబేట్‌కు సిద్ధమని సవాలు విసిరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తిప్పన క్రిష్ణయ్య, ఉప సర్పంచ్ నార్జాలహేమ రాజ్, ఎంపీటీసీ సభ్యులు శోడిశెట్టిభాస్కర్, నిమ్మకాయల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బత్యాలచే పాఠశాల తనిఖీ

రైల్వేకోడూరు పట్టణంలోని స్థానిక బాలికోన్నత పాఠశాలను మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయులు మంగళవారం తనిఖీ చేశారు. అవసాన దశలో ఉన్న పాత తరగతి గదులను పరిశీలించారు. పాడు బడిన తరగతి గదులను తొలగించి నూతన భవనాల కోసం ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాలికలకు అన్ని వసతులతో కూడిన భవనాలను సమకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

పెనగలూరు : పెనగలూరు మండలంలో వినాయక చవితి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకునేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శివప్రసాద్‌తెలిపారు. ఏ గ్రామంలో అయినా సరే వినాయక ప్రతిమను ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు తీసుకోని వారు ప్రభుత్వం తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

ధర్మపరిచయ పరీక్షలో చిట్వేలి విద్యార్థి ప్రతిభ

చిట్వేలి : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మపరిచయ పరీక్షలో చిట్వేలి హైస్కూల్‌కు చెందిన ఆవుల నాగరాజు జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినట్లు పరీక్ష నిర్వహకుడు చీకటి మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం ఎ కడపలో టీటీడీ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలో నాగరాజుకు ప్రశంసాపత్రం, వెయ్యి రూపాయల చెక్కును ప్రదానం చేశారు. ఈసందర్భంగా మంగళశారం పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, పీడీ డేవిడ్ తదితరులు నాగరాజును అభినందించారు. ప్రతి ఏటా నిర్వహించే టీటీడీ ధార్మిక పరీక్షలలో చిట్వేలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరుగుతోందని మల్లికార్జున తెలిపారు.

మిద్దెపై నుంచి పడి వివాహిత మృతి



మృతి చెందిన వివాహిత విమల

రాజంపేట టౌన్ : రాజంపేట సమద్ థియేటర్‌కు సమీపంలో, ఫ్లైవోవర్ బ్రిడ్జి పక్కన ఉన్న ఓ మిద్దెపై నుంచి మంగళవారం రాత్రి పడి విమల(28) అనే వివాహిత మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ రాజగోపాల్, పోలీసులు పరిశీలించారు. కొల్లం విమల రాజంపేట ఆర్.ఎస్.రోడ్డు బ్రిడ్జికి సమీపంలో ఉన్న రెండవ అంతస్తులో నివాసముంటోంది. 3వ అంతస్తులో విజయలక్ష్మీ తన భర్త పిల్లలతో నివాసముం టుంది. అయితే విజయలక్ష్మీ ఉన్న మూడవ అంతస్తులో విమలకు చెందిన ఓ ఐరన్ మంచం ఉందని, దాన్ని రెండవ అంతస్తులోకి దించాలని విమలకు తెలిసిన వ్యక్తి అయిన వంశీ సాయం తీసుకొని కిందకు దించాలని ప్రయత్నించగా బిల్డింగ్ పక్కనే వెలుతున్న కరెంటు వైర్లకు ఈ ఐరన్ మంచం తగిలిందని దీంతో విద్యుత్ షాక్ తగిలి విమల మూడవ అంతస్తు నుంచి కింద పడి తలకు బలమైన గాయం తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందిందన్నారు. మూడవ అంతస్తులో ఉన్న విజయలక్ష్మీకి చేతికి, కాళ్ళపైభాగంలో గాయాలు అయ్యాయని, విజయలక్ష్మీని రాజంపేట ఏరియా ఆసుపత్రికి తన భర్త తీసుకువచ్చాడని, రాజంపేట ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి కడపకు రెఫర్ చేశారు. అలాగే వంశీకి చేతికి దెబ్బతగిలింది. సంఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ, పోలీసులు పరిశీలించారు.

ప్రాణం తీసిన మంచం : మంచాన్ని కిందికి దించాలన్న ప్రయత్నంలో విమల తన ప్రాణాలను కోల్పోయింది. విమల భర్త ఏపీఎండీసీలో పనిచేస్తున్నారు. విమల టైలరింగ్ పనిచేసు కుంటూ జీవనం సాగిస్తూ ఉండేది. వారికి నాలుగు సంవత్సరాల కుమార్తె, మరో రెండు సంవత్సరాల కుమార్తె ఉన్నారు. తన కూతురైన విమల కింద పడి మృతి చెందడంతో బోరున విలపించింది. స్థానికులు, బంధువులు ఈ సంఘటనను చూసి కన్నీరుమున్నీరైయ్యారు.

బిల్డింగ్‌కు ఆనుకొని ఉన్న కరెంటు వైర్లు : రాజంపేట ఆర్ఎస్ రోడ్డు ఫ్లైఓవర్‌బ్రిడ్జి దగ్గర ఉన్న ఇళ్ళ మధ్యల్లో, బిల్డింగ్‌లను ఆనుకొని కరెంటు వైర్లు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. కరెంటు అధికారులకు పలు మార్లు విన్నవించినా సమస్యను పట్టీనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విమల కరెంటు వైర్ల వల్లే కింద పడి మృతి చెందిందని, అయితే కరెంటు అధికారుల ఇప్పటికైనా పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎంఆర్ టీకాతో తట్టు రూబెల్లా దూరం

పుల్లంపేట : 9నెలల నుంచి 15సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఎంఆర్ టీకాను వేయిస్తే తట్టు, రూబెల్లా వ్యాధులను దూరంచేయవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని బావికాడపల్లె గ్రామంలో మంగళవారం ఆయన ఎంఆర్ టీకా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన జడ్పీ ఉన్నత పాటశాలలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలను స్వయంగా వేశారు. పాఠశాలలోని 84మంది విద్యార్థులకు ఈ టీకాలను వేయించారు. ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవడం వల్ల తట్టు రూబెల్లా వ్యాధులు రాకుండా నివారించడమే కాక మహిళల్లో గర్భస్త సమయంలో వచ్చే లోపాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు ఎంఆర్ టీకాను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాదికారి దేవేందర్‌రెడ్డి, ఎంఈవో రంగనాధయ్య, హెల్త్ సూపర్‌వైజర్ నాగవల్లీ, ఏఎన్ఎం లక్ష్మీనారాయణమ్మలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన



మెమెంటో అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట : బ్యాంకు సేవలపై పుల్లంపేటలోని ఆదర్శపాఠశాలలోని విద్యార్థులకు పుల్లంపేట సిండికేట్ బ్యాంకు మేనేజర్ సామారెడ్డి షామ్యూల్ అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సులో భాగంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసుపై విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామని ప్రిన్సిపాల్ షిజోమైఖెల్‌తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ షామ్యూల్‌కు ప్రిన్సిపాల్ షిజోమైఖెల్, విద్యార్థులు మెమొంటోలు అందజేసి సత్కరించారు.

పిడుగు పాటుకు రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసం

పెనగలూరు : పెనగలూరు మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన ఉరుములు, మెరుపుల వర్షం దాడికి మండల కేంద్రంలోని సిద్దవినాయక దేవాలయ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మరో ట్రాన్స్‌ఫార్మర్ పిడుగు పాటుకు దెబ్బతింది. దీంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు మండల కేంద్రంలో చీకటి ఏర్పడింది. స్పందించిన విద్యుత్ ఏఈ అబ్దుల్ జబ్బార్ సిబ్బంది సహకారంతో వెంటనే తాత్కాలిక చర్యలు చేపట్టి ఉదయం 7గంటలకే మండల కేంద్రంలోని ప్రజలకు కరెంటు సరఫరా చేశారు. దెబ్బతిన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి సాయంత్రానికి వేరొక ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించి సాయంత్రానికి కల్లా యదావిధిగా కరెంటు పునర్దురింపచేశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా సుబ్రమణ్యం



రైల్వేకోడూరు: బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్రకార్యవర్గసభ్యుడిగా బత్తలసుబ్రమణ్యం నియమించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రస్థా యి ఎగ్జిక్యూటీవ్ సమావేశం విజయవాడలో నిర్వహించారని, ఈ సమావేశంలో ఆయన రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు జల్లిమధుసూధన్ నియమి స్తూ పత్రాన్ని అందచేశారని తెలిపారు. రాష్ట్ర బీజేపీ జనరల్‌సెక్రెటరీ రవీంద్రరాజు, మాజీకేంద్రమంత్రి దగ్గుబాటిపురంధేశ్వరికి అభినందనలు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆదర్శపాఠశాల విద్యార్థిని

పుల్లంపేట : ఆదర్శపాఠశాల విద్యార్థిని ఎస్.అజీజా రాష్ట్రస్థాయి సాఫ్టబాల్‌పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షిజోహైకెల్ తెలిపారు. ఈ నెల 21న జమ్మలమడుగులో జరిగిన జిల్లా స్థాయి సాఫ్టబాల్ పోటీల్లో అజీజా ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారి అజీజాను ప్రిన్సిపల్ షిజోమైఖెల్, వైస్ ప్రిన్సిపాల్ దినేష్‌బాబు, పీడీ నీలకంఠయ్య, పీఈటీ పద్మావతిలు అభినందించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విందు వినోదాలు, వేడుకలకు ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆరోగ్యం, ఆహార విషయాలపై శ్రద్ధ చూపించాలి. రిటైల్, హోటల్, వైద్య రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతములతో ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొంటారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. పెట్టుబడుల్లో నిదానం అవసరం. లాభిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రియల్ ఎస్టేట్, రిటైల్, గృహనిర్మాణ రంగాలు పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరులు, బంధుమిత్రులను కలుసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాల్లో కొంత అసౌకర్యానికి గురవుతారు. ఒక సమాచారం కలవరపెడుతుంది. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పెట్టుబడుకు సంబంధించిన నిర్ణయాలు వాయిదా వేయండి. షాపింగ్‌లో వస్తువుల నాణ్యత గమనించండి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. వ్యక్తిగత అవసరాల కోసం ఖర్చు చేస్తారు. కీలక నిర్ణయాలు వాయిదా వేయండి. మీ నిర్ణయాలను సమీక్షించుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రయాణాల్లో చికాకులు తప్పకపోవచ్చు. సినీ రాజకీయ రంగాలవారికి ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. బృంద కార్యక్రమాల్లో అసౌకర్యానికి గురవుతారు. స్నేహితులు, ప్రియతముల కోసం ఖర్చులు అధికం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ మర్యాదలకు భంగం కలిగే అవకాశంఉంది. కుటుంబ పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సమావేశాలు, బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. ప్రయాణాలు,చర్చలు సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఒక సమాచారం ఆందోళన కలిగిస్తుంది. న్యాయ,బోధన, కన్సల్టెన్సీ రంగాల వారికి శుభప్రదం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మనసును ఏదో వెలితి వెంటాడుతుంది. పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. క్రయవిక్రయాలలో నాణ్యత గమనించండి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో వేడుకలు, విందుల్లో పాల్గొంటారు. కొత్త పరిచయాలు లాభిస్తాయి. సాహస ప్రయత్నాలకు, పందాలకు అనుకూల సమయం కాదు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మూతపడ్డ బ్యాంకులు

స్తంభించిన రూ.180కోట్ల లావాదేవీలు ● పనిచేయని సగం ఏటీఎంలు

కడప, సెవెన్‌రోడ్స్ : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు సమ్మెతో జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన 275 శాఖలు మూతపడ్డాయి. దీంతో దాదాపు రూ.180కోట్ల మేర లావాదేవీలు స్తంభించాయి. జిల్లాలో బ్యాంకు సిబ్బంది ద్వారా నిర్వహించే 50శాతం ఏటీఎంలు పని చేయలేదు. ఏఐబీఈఏ, ఏఐబీవోసీ, ఎన్‌సీబీఈ, ఏఐబీవోఏ, బీఈఎఫ్ఐ, ఐఎన్‌బీఈఎఫ్, ఐఎన్‌బీవోసీ, ఎన్‌వోబీడబ్ల్యు, ఎన్‌వోబీవో 9 యూనియన్ల ఐక్యవేదిక అయిన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ సమ్మె చేయడంతో ఏ ఒక్క బ్యాంకు శాఖ కూడా తెరుచుకోలేదు. ప్రైవేటీకరణ, ఎగవేతదారులపై కఠిన చర్యల బాధ్యత బ్యాంకులకు, బ్యాంకులను విలీనం చేసే ప్రక్రియకు వ్యతిరేకం, ఖాళీల భర్తీ వెంటనే చేపట్టాలన్న డిమాండ్లతో బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది ఒక్కరోజు సమ్మె చేశారు. బ్యాంకర్ల సమ్మెతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందస్తు సమాచారం వుండడంతో కొందరు బ్యాంకులలో సోమవారమే జమ తదితర కార్యక్రమాలను పూర్తిచేసుకున్నా అధికశాతం ఇబ్బందులకు లోనయ్యారు.

ప్రజల కోసమే ఈ సమ్మె

దేశంలో రూ.13లక్షల కోట్లను కొందరు బడా కార్పొరేటర్లు బ్యాంకులకు ఎగవేత చేశారని అటువంటి వారిని పట్టుకొని వారి నుంచి సొమ్ము రాబట్టేందుకు బ్యాంకులకు అనుమతివ్వాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రస్తుతం వున్న విధానం వల్ల వారు తప్పించుకు తిరుగుతున్నారు. బ్యాంకులను విలీనం చేసి సంఖ్యను కుదించి తద్వారా ప్రైవేటీకరణ చేసేందుకు యత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరమే 50 నుంచి 60 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది రిటైర్డ్ కానున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో ఖాళీలు వున్నాయి. ఈ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. తదితర డిమాండ్లపై తాము ఒక్కరోజు సమ్మె నిర్వహిస్తున్నామని ప్రజల కోసమే తాము ఈ ఆందోళన చేపట్టామని బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.



ఏడురోడ్ల కూడలిలో ఆందోళన చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

వినాయక మండపాల విద్యుత్‌కు అనుమతి తప్పనిసరి

వినియోగ వాట్స్‌ను బట్టి కరెంట్ ఛార్జీలు ● ఎస్‌పీడీసీఎల్ ఎస్-ఈ శివప్రసాద్‌రెడ్డి

కడప, సెవెన్‌రోడ్స్ : వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్ వినియోగం కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకొని విద్యుత్ వినియోగానికి సంబంధించి వాట్స్‌ను బట్టి ముందస్తు కరెంటు ఛార్జీలు చెల్లించాలని ఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం తన ఛాంబరులో విలేఖరులతో మాట్లాడారు. వినాయక ఉత్సవం పరిమితకాలం కాబట్టి ఆ మేర విద్యుత్ ఛార్జీలు చెల్లించి వినియోగించుకోవాల్సిన అవసరం వుందన్నారు. నమోదు ఛార్జీ రూ.100లుగా నిర్ణయించామన్నారు. కాగా 250 వాట్స్‌కు రూ.500లు, 500 వాట్స్‌కు రూ.వెయ్యి, 1000 వాట్స్‌కు రూ.2250, 1500వాట్స్‌కు రూ.3వేలు, 2వేల వాట్స్‌కు రూ.3750, 2500 వాట్స్‌కు రూ.4500, 3వేల వాట్స్‌కు రూ.5250, 3500 వాట్స్‌కు రూ.6వేలు, 4వేల వాట్స్‌కు రూ.6750, 5వేల వాట్స్‌కు రూ.8250, 5500 వాట్స్‌కు రూ.9వేలు, 6వేలవాట్స్‌కు రూ.9750, 6750 వాట్స్‌కు రూ.10500, 7వేల వాట్స్‌కు రూ.11250లు చెల్లించాల్సి వుంటుందన్నారు. నిర్వాహకులు ఈ వివరాలను గుర్తుంచుకొని కడప నగర నిర్వాహకులు మున్సిపల్ గ్రౌండ్ ఎదురుగా వున్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రంలోను, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయాల్లో వున్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రాలలో నమోదుచేసి ఛార్జీలు చెల్లించి రశీదు తీసుకోవాల్సి వుంటుందన్నారు. విద్యుత్ అక్రమ వినియోగం ఏ పరిస్థితుల్లోనూ అనుమతించబోమని చెప్పారు. వినియోగదారులు కూడా సహకరించి సంస్థ బలోపేతంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



12గంటల్లోగా ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే 18004251553 33, 1800425151912 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేస్తే ఫిర్యాదుకు సంబంధించి ఒక సంఖ్యను ఇస్తామని, ఫిర్యాదు సంఖ్య ఇచ్చినప్పటి నుంచి ఎస్‌వోపీ ప్రకారం 12గంటల్లోగా పట్టణాల్లో, 24 గంటల్లోగా గ్రామాలలో మారుస్తామని చెప్పారు. అదేవిధంగా ఇతరత్రా విద్యుత్ సమస్యలను కూడా టోల్‌ఫ్రీ ద్వారా పరిష్కరించుకోవచ్చున్నారు.

అనుమతి లేని నాలుగు థియేటర్లకు నోటీసులు

ఒకేఒక్క థియేటర్‌కే వున్న అనుమతి

కడప,సెవెన్‌రోడ్స్ : అపార్టుమెంట్లు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, పరిశ్రమలకు అగ్నిమాపకశాఖ అనుమతి తప్పనిసరి. అగ్నిమాపకశాఖ నిబంధనలు తప్పకుండా పాటించాల్సి వుంటుంది. అగ్ని ప్రమాదం జరిగితే ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం వుంటుంది. అయితే కడప నగరంలో థియేటర్ల యజమానులు మాత్రం ఈ నిబంధనలను తూచ్ అంటున్నారు. కేవలం ఒకే ఒక థియేటర్‌కు అగ్నిమాపకశాఖ అనుమతితో నడుస్తుందంటే ఆశ్చర్యం వేసినా పచ్చి నిజం.

సాధారణంగా సినిమా థియేటర్లు విశాలంగా వుండి పెద్ద స్థాయిలో కాంపౌండ్‌తో వుండాలి. ప్రేక్షకులు విశ్రాంతి సమయంలో నిలుచునేందుకు అటు ఇటు తిరిగేందుకు కూడా స్థలం వుండాలి. వీటన్నింటి కంటే ముఖ్యంగా అగ్నిప్రమాదం సంభవిస్తే బయటపడే ద్వారాలు, దీంతో పాటు అగ్నిని అదుపుచేసే పరికరాలు అందుబాటులో వుంచుకోవాలి. కడపలోని కొన్ని థియేటర్లను పరిశీలిస్తే ఇటువంటి నిబంధనలు గాలికి వదిలేసినట్లుగా వుంటుంది. ఇరుకురోడ్ల మధ్య..ఇరుకైన నిర్మాణాలతో ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఆదాయమే ధ్యేయంగా నడుపుకుంటున్నారు. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే బయటపడే అవకాశమే లేని విధంగా పరిస్థితులు నెలకొన్నాయి.

అనుమతులపై అగ్నిమాపకశాఖ ఆరా..

నోటీసులతో చర్యలు

పరిశ్రమలు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు,వాణిజ్య సముదాయాలు తదితర నిర్మాణాలపై అగ్నిమాపకశాఖ దృష్టి సారించింది. తొలిదశగా సినిమా థియేటర్లపై ఆరా తీసింది. అగ్నిమాపకశాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నోటీసులు ఇచ్చేందుకు నిర్ణయించారు. కడప నగరంలోని 10 సినిమా థియేటర్లకు గాను కేవలం ఒకే ఒక థియేటర్‌కు అగ్నిమాపక శాఖ అనుమతి వుంది. దీంతో తొలిదశ కింద 4 థియేటర్లకు నోటీసులు జారీ చేశారు. నెలలోపు అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోకపోతే కఠిన చర్యలు తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. నోటీసులు జారీ చేస్తున్నారని తెలుసుకున్న పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థల యాజమాన్యాలు అనుమతి కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

సూక్తి

మనకోసం చేసే పని
మనతోనే
అంతరించిపోతుంది.
పరుల కోసం చేసేది
శాశ్వతంగా నిలుస్తుంది.

జంబ్లింగ్ వర్డ్స్

1. LMIK ▸ ....
2. DYUT ▸ ....
3. ALTS ▸ ....
4 RCKO ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

ఔనా!

2007లో ఓ గూఢచర్యం కేసులో 14 ఉడతలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు.




పదాలు కనుక్కోండి



దారి కనుక్కోండి



మీకు తెలుసా?



మీరు చంద్రుడి పైకి వెళితే.. మీరు మీ బరువులో 16.5 శాతమే ఉంటారు.

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

చెప్పగలరా?

మందులో ఉన్నా
కానీ ముందులో లేను
దాతలో ఉన్నా
కానీ పీతలో లేను
రంగులో ఉన్నా
కానీ చెంగులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

పాండాలకు ఓ ఆసుపత్రి



నలుపు, తెలుపు రంగుల్లో ముద్దుగా కనిపించే పాండాలంటే.. చాలామందికి ఇష్టం. పాండాలను అంతరించిపోతున్న జాతులలో ఒకటిగా గుర్తించారు. వీటిని పరిరక్షించడానికి పర్యావరణవేత్తలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే 'చైనా కన్జర్వేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ది గెయింట్ పాండా (సీసీఆర్‌సీజీపీ) పనిచేస్తుంది. రోజు రోజుకీ తగ్గిపోతున్న పాండాల సంఖ్యను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైనా ప్రభుత్వం 'డుజియాంగ్యాన్' నగరంలో పాండాల కోసమే ప్రత్యేకంగా ఓ ఆసుపత్రిని 2012లో ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే తొలి పాండా ఆసుపత్రి.

జలుబు చేసినా.. జ్వరం వచ్చినా.. డాక్టరు దగ్గరకు వెళుతుంటాం. మరి పాండాలకు జబ్బు చేస్తే? అనారోగ్యంతో అవి బాధపడుతుంటే? అందుకే వాటికోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి ఉంది. అందులో పాండాలను ఎంతో బాధ్యతగా చూసుకుంటారు. ప్రతి రోజూ హెల్త్ చెకప్‌లు చేస్తారు.. మంచి భోజనాన్ని అందిస్తారు. ఇది పాండాల పునరావాస కేంద్రం కూడా. అంతేకాదు ఇక్కడ పాండాలపై పరిశోధనలు చేస్తారు.

పాండాలపై పరిశోధన చేసిన తొమ్మిదిమంది వైద్యులు ఈ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఈ వైద్య బృందం పాండాలకి ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. పాండాలు వ్యాధుల భారినా పడితే తక్షణమే వాటికి వైద్యం చేస్తారు. పాండాల సంతతిని అభివృద్ధి చెందేలా ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తారు. అత్యున్నత సాంకేతిక వ్యవస్థ ఈ ఆసుపత్రిలో ఉంది. ఇది కేవలం పాండాల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఆసుపత్రి మాత్రమే కాదు ఇది పాండాల ఉనికిని కాపాడే సంస్థగా కూడా పనిచేస్తుంది. ఈ ఆసుపత్రిలో మొత్తం 33 పాండాలు ఉన్నాయి. 'పాన్ పాన్' అనే పాండా అన్నిటికన్నా వయసులో పెద్దది. దాని వయసు 33 సంవత్సరాలు. పాండాల కోసం ఈ ఆసుపత్రి చేసిన కృషి వల్లే పాండాల సంఖ్య 17 శాతానికి పెరిగింది.

- పాండాల కోసం క్యారెట్లు, పాలు, కార్న్ బ్రెడ్ వంటి ఆహారపదార్థాల్ని అందిస్తారు.
- మనుషులతో ఎలా ప్రవర్తించాలో పాండాలకు చక్కగా నేర్పుతారు.
- అడవుల్లో ఒంటరిగా సంచరించే పాండాలను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కష్టాల్లో పడిన పాండాలను ఆసుపత్రికి తీసుకు వచ్చి వాటిని సంరక్షిస్తారు.
- పాండాలకి ఇష్టమైన ఆహారం వెదురు చెట్లని తెలుసు కదా. పాండాల ఆహారం కోసమే ఆసుపత్రి యజమాన్యం వేల వెదురు చెట్లను పెంచుతుంది. పాండాలు హాయిగా అందులో విహరిస్తాయి. చక్కగా ఆడుకుంటాయి.



మీకు తెలుసా

- పాండా బరువు 100 నుంచి 120 కేజీల మధ్యలో ఉంటుంది.
- వీటి సగటు వయస్సు 20 సంవత్సరాలు.
- ఇప్పటి వరకూ 'బసి' అనే పాండా గరిష్ఠంగా 37 సంవత్సరాలు జీవించింది.
- పాండాలు తమ పిల్లలకి పాలిచ్చి పెంచుతాయి.
- ప్రపంచ వ్యాప్తంగా 1,864 పాండాలు మాత్రమే ఉన్నాయి.

జంతర్‌మంతర్

1. స్వభవిత్తు ▸ ....
2. మాణంరాయ ▸ ....
3. వృఅభిద్ధి ▸ ....
4. సంవరంత్స ▸ ....


నవ్వుల్ నవ్వుల్

టీచర్ : కోడి మాంసాహారా? శాకాహారా?
బిట్టు : మాంసాహారికి ఆహారం టీచర్!
టీచర్ : !!!!!!!!

జవాబులు

చెప్పగలరా? :
దారం
జంతర్‌మంతర్ :
1. [illegible]
2. రామాయణం
3. అభివృద్ధి
4. సంవత్సరం
జంబ్లింగ్ వర్డ్స్ :
1. MILK
2. DUTY
3. SALT
4 ROCK

బొమ్మ గీయండి



రంగులు వేయండి



వేదోక్తంగా కోదండ రామస్వామి పవిత్రాల ప్రతిష్ఠ




పవిత్రోత్సవాల సందర్భంగా హోమం చేస్తున్న వీణా రాఘవాచార్యులు, పవిత్ర ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఏకశిలా నగిరి ఒంటిమిట్టలోని కోదండరామాలయంలో మంగళవారం కోదండపాణి పవిత్రాల ప్రతిష్ఠ బాజాభజంత్రీల మధ్య వేదోక్తంగా జరిగింది. కోవెలలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో రెండవరోజు సీతా రామ లక్ష్మణ సమేత ఉత్సవవరుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యుల అధ్వర్యంలో శ్రావణ్‌కుమార్, పవన్, మనోజ్‌ల అర్చక బృందం ద్వారా పూర్ణపూజ, కుంభ ఆరాధన, అనంతరం పవిత్ర దేవతలను ఆవాహనం చేశారు. తరువాత పవిత్ర మూలాలకు దేవతాప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే యాగశాలలో బాలభోగం, కలశారాధన, కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్రప్రతిష్ఠ, పవిత్ర దేవతా హోమం, వేదపారాయణం, పరివార ప్రాయచిత్త హోమం, లఘుపూర్ణాహుతి, బలిహరణం, నివేదన, చతుర్వ స్వస్తి, సేవా శాలం వంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు నాగరాజు, ఇన్‌స్పెక్టర్ కృష్ణప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి తాళ్ళపాకలో పవిత్రోత్సవాలు

రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు జన్మించిన తాళ్ళపాకలోని చెన్నకేశవస్వామి వారి పవిత్రోత్సవాలు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి అధ్వర్యంలో జరగనున్నాయి. ఈనెల 25వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, మృతసంగ్రహం, రక్షాబంధనం, అంకురార్పణలు, 26న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చతుస్థాన అర్చన, బింభ, మండల, కుంభ, కుండల ఆరాధనలు, పవిత్ర ప్రతిష్ఠ, అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పవిత్ర హోమం, సాత్తుమొరలు, 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిత్య హవనాదులు, పవిత్ర సమర్పణ, సాయంత్రం 6 గంటలకు నిత్యహోమం, సాత్తుమొరలు, 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పవిత్ర విసర్జన, విధ్వత్‌సంభావన, పవిత్రజలప్రోక్షణ, పవిత్రోత్సవ ఫల వివరణ, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు గ్రామోత్సవాలు ఉంటాయి. కావున భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ దేవస్థానం వారు కోరుతున్నారు.



తాళ్లపాక అన్నమాచార్యులు

పునరావాస కేంద్రాల్లో వసతులు పరిశీలించాలి

కడప, కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని పది పునరావాస కేంద్రాల్లో ఇంకా ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులను పరిశీలించి జాబితా తయారు చేశామని, జాబితాలోని అంశాలను సంబంధిత జిల్లా అధికారులకు పంపి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ బాబూరావునాయుడు తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం సాయంత్రం భూసేకరణ, ఆర్‌ఆర్ సెంటర్లలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పది పునరావాస కేంద్రాలైన సుగమంచిపల్లి, శెట్టివారిపల్లె, గండ్లూరు, ఓబన్నపేట, పొన్నతోట, కలమల్ల, హనుమాన్‌గుత్తి, నేదరపేట, ముచ్చుమర్రి, కొర్రపాడులలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించేందుకు అధికారుల బృందాన్ని పంపి వివరాలు సేకరించామన్నారు. జాబితాలోని అంశాలపై శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధిత అధికారులకు పంపి వాటిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి ఆర్‌ఆర్ సెంటర్లలో చేపట్టాల్సిన పనులపై అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించిన విషయాన్ని అధికారులకు గుర్తు చేశారు. ఈ అంశాలపై ప్రతి వారం సీఎం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారన్నారు. కావున పునరావాస కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా, ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ, స్కూళ్లలో అదనపు గదుల ఏర్పా టు, స్కూలు భవనాలు, మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్రైనేజీ ఏర్పాటు, రోడ్లు ఉపాధి పనుల కల్పన వంటి వాటిపై అధికారులు మొదటి ప్రాధాన్యతగా పనులు చేపట్టాలన్నారు. ఈ అంశంపై పురోగతిని శాఖల వారీగా శనివారం రోజు సమీక్షిస్తానన్నారు. రాయచోటి-కడప రోడ్డు విస్తరణకు భూసేకరణ పనులు, ఊటుకూరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు, కడప-పులివెందుల రోడ్డు పనులు, ఖాజీపేట-కమలాపురం రోడ్డు పనులకు సంబంధించి భూసేకరణ అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్వేత తెవతీయ, ప్రత్యేక కలెక్టర్ నాగేశ్వరరావు, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ వరదరాజులు, డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి, నేషనల్ హైవే ఈఈ ఓబుల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీవో సుబ్రమణ్యం, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శివప్రసాద్‌రెడ్డి, కడప, రాజంపేట, జమ్మలమడుగు ఆర్డీవోలు చినరాముడు, వీరబ్రహ్మం, దేవేంద్రగౌడ్, డీఈవో శైలజ, బీసీ కార్పొరేషన్ ఈడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు, చిత్రంలో జేసీ శ్వేత, తదితరులు

నేడు ట్రిపుల్‌ఐటీలో సూపర్ న్యూమరీ సీట్లకు కౌన్సెలింగ్

వేంపల్లె: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సూపర్ న్యూమరీ కింద మంజూరైన 338 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 23న ఒంగోలు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు లభించిన ఈ విద్యార్థులందరికీ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని డైరెక్టర్లు భగవన్నారాయణ, బసవరావు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులకు ఎవరికైనా సీట్లు దక్కకపోతే అలాంటి మండలాల్లో ఆయా కేటగిరీల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి సూపర్‌న్యూమరీ కింద సీట్లను కేటాయించారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీకి 164 సీట్లను ఇవ్వగా వారందరికీ సమాచారం పంపారు. ఆయా విద్యార్థులందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని డైరెక్టర్లు తెలిపారు.



ప్రత్యేక కోటా సీట్లు కూడా : ట్రిపుల్‌ఐటీల్లో ప్రత్యేక కోటా కింద క్రీడలు, మాజీ సైనికోద్యోగుల పిల్లలు, వైకల్య కోటాకు సంబంధించిన సీట్లకు 23వ తేదీ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. జూలైలోనే నోటిఫికేషన్ జారీ చేసి ప్రత్యేక కోటా సీట్లను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినా ఆచరణలో జాప్యం చేసుకుంటూ వచ్చారు. దీంతో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురై త్వరితగతిన కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలని ట్రిపుల్‌ఐటీ అధికారులకు విన్నవించడంతో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ నుంచి అవసరమైన సమాచారాన్ని తెప్పించుకుని కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో ప్రత్యేక కోటా కింద 10 సీట్లను భర్తీ చేస్తామన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

దువ్వూరు : వినాయక చవితి సందర్భంగా వాడవాడలా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని రూరల్ అవెర్‌నెస్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం దువ్వూరులో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజల్లో మట్టి వినాయక విగ్రహాలను పూజించేందుకు అవగాహన కలుగజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు రసాయనిక పదార్థంతో తయారు చేసిన విగ్రహాన్ని వినియోగించరాదని, నీటి కాలుష్యం, భూ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా చింతకుంట, గుడిపాడు, దువ్వూరులో కళాజాత నిర్వహించారు. కళాకారులు ఉదయ్‌కుమార్, ఉపేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేపంపల్లె స్కూల్‌కాంప్లెక్స్ సెక్రటరీగా ఎన్‌వీ రమణయ్య


ఎన్‌వీ రమణయ్య

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కందిమల్లాయపల్లె స్కూలు కాంప్లెక్స్ సెక్రటరీగా కె. బసవాపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వి రమణయ్యను సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లాపరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులందరూ కలసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో సెక్రటరీగా ఉన్న ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో ఎన్‌వి రమణయ్యను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్‌వి రమణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పై అధికారులకు తెలిపి ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పుల్లయ్య, కాంప్లెక్స్ చైర్మన్ రుక్మణమ్మ, చంద్రహాస్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికలకు వెళ్లిన సీబీఐటీ, వీబీఐటీ విద్యార్థులు

చాపాడు : ఈనెల 23న బుధవారం కర్నూలుజిల్లా నంద్యాల అసెంబ్లీ ఎన్నికలకు సీబీఐటీ, వీబీఐటీ కాలేజీలకు చెందిన 50 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం వెళ్లినట్లు కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి బన్వర్‌లాల్, కర్నూలు ఆర్డీఓ ఆదేశాల మేరకు వారిని పంపినట్లు తెలిపారు. విద్యార్థులు ఉప ఎన్నిక సరళిని వెబ్ స్క్రీనింగ్ ద్వారా ఆన్‌లైన్ లైవ్ స్టేటస్‌ను ఎన్నికల అధికారికి తెలియజేస్తారన్నారు. విద్యార్థులకు శిక్షణ కూడా ఇచ్చామన్నారు. మా కాలేజీ విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం లభించినట్లు ప్రిన్సిపాళ్లు పాండురంగన్‌రవి, శ్రీనివాసులరెడ్డిలు చెప్పారు.

ప్రైవేటీకరణను ఆపాలి

దువ్వూరు: ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయంపై నిరశిస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా బ్యాంకు సిబ్బంది సమ్మె పాటించారు. దువ్వూరులోని ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది సమ్మె పాటించి సేవలు నిలిపివేశారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, ప్రైవేటీకరణ చేయడం సరైంది కాదన్నారు.

బ్రహ్మంగారిమఠంలో..: మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంకు, స్టేట్‌బ్యాంకు సమ్మెతో లావాదేవీలు స్తంబించడంతో ఖాతాదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఇటీవల వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడం, మంగళవారం బ్యాంకులు సమ్మె చేయడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

వార్డు స్థాయి నుంచి వైసీపీని బలోపేతం చేస్తాం..

ఇంటి తలుపులపై వైయస్ ఫొటో అతికిస్తాం.. ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : వైయస్ హయాంలో సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన కుటుంబాల సమ్మతితో వారి ఇంటి తలుపునకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోను అతికిస్తామని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో వార్డు స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో వంద ఓట్లకు ఒక ఇన్‌చార్జ్‌ని ఏర్పాటు చేసి, ఆయా వార్డులో పార్టీని బలోపేతం చేసే బాధ్యత అప్పగించనున్నట్లు తెలిపారు. బూత్ కమిటీ సభ్యులు వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, రుణమాఫీ పొందని రైతులకు 5వేల నగదు, ఉచిత విద్యుత్, పింఛన్ల వంటి వాటిలో ఏమేమి లబ్ధిపొందారో తెలుసుకుంటారని, వాటిలో లబ్ధి పొంది ఉంటే ఇష్టపూర్వకంగా వైయస్ ఫొటోను ఇంటి తలుపునకు అంటించాల్సిందిగా ఆ కుటుంబసభ్యులను కోరతామని రఘురామిరెడ్డి వివరించారు. ఆవిధంగా 50శాతం మంది వైయస్‌ను స్మరించుకున్నా తాము విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 24న మైదుకూరులో పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ధనపాల జగన్, మండల కోఆప్షన్ సభ్యులు బండి నాగేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనపాల రవి, నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, గోశెట్టి లక్షుమయ్య, లెక్కలవారిపల్లె సర్పంచ్ శివప్రసాదరెడ్డి, మైనార్టీ నాయకులు నజీర్,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ఉపాధ్యాయులకు గుర్తింపు


బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం : కష్టపడే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు తప్పక లభిస్తుందని ఎంఈఓ పుల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లె పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సురేష్‌లను సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, ఎంఈఓ పుల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.
అలాగే పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈఓను సర్పంచ్, ఎంపీటీసీలను సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఈ వృత్తికి న్యాయంచేస్తూ కష్టపడినప్పుడు తప్పక సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురవయ్య, శ్రీనివాసులు, యామినీదేవి, హేమలత, శ్రీదేవి, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా లక్ష్యాలను అధిగమించాలి


టీకా కేంద్రాన్ని పరిశీలిస్తున్న యూనిసెఫ్ ప్రతినిధి సురేష్‌రెడ్డి

ఖాజీపేట : ఎంఆర్ టీకా లక్ష్యాలను అధికమించి.... పిల్లలకు వచ్చే వ్యాధులను దూరం చేయాలని యునిసెఫ్ ప్రతినిధి డాక్టర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సర్వర్‌ఖాన్‌పేట, పత్తూరు, కొత్తనెల్లూరు, మిడుతూరు, ముత్తులూరుపాడు, గ్రామాలలోని టీకా కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరికీ తప్పకుండా ఎంఆర్ టీకా వేయాలన్నారు. ఈటీకా వేయడం వల్ల రెండు వ్యాధులను దూరం చేస్తుందన్నారు. మండలంలో 97 శాతం పిల్లలకు టీకా వేశామని వైద్య సిబ్బంది తెలిపారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కొండయ్య, తిమ్మారెడ్డి, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ సెల్వియా సాల్మోన్, ఆరోగ్య విస్తరణాధికారులు రాఘవయ్య, శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో మౌలిక వసతులపై సీపీఐ ఆందోళన

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మున్సిపల్ సమావేశం జరుగుతున్న సమయంలోనే సమావేశ హాల్ బయట సీపీఐ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి పాలక వర్గానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో సమావేశహాలు తలుపు వద్దకు వచ్చి కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సూచన మేరకు కమిషనరు కృష్ణారెడ్డి సీపీఐ నాయకులను పోడియం వద్దకు ఆహ్వానించారు. దాంతో మున్సిపాలిటీ పరిధిలోని వీణా విజయరామరాజు కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, జోసప్‌పేట తదితర కాలనీల్లో రోడ్లు సక్రమంగా లేవని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, కనీసం వీధి లైట్లు కూడా లేవని రఘురామిరెడ్డికి సీపీఐ నాయకులు ఏవి రమణ, పి.శ్రీరాములు, నరసింహులు, బీవీ శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే కమిషనరు, చైర్మన్‌లను వివరణ అడిగారు. సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారా అని సీపీఐ నాయకులను ప్రశ్నించారు. అందుకు తాము ఇప్పటికే ఎన్నో సార్లు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామనడంతో రఘురామిరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీల్లో వెంటనే మౌలిక వసతులను కల్పించాలని అధికారులకు సూచించడంతో సీపీఐ నాయకులు ఆందోళన విరమించారు.


సమస్యలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న సీపీఐ నాయకులు

సమయం పాటించకపోతే చర్యలు


హాజరు పట్టికను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

ఖాజీపేట: రోగులకు అందుబాటులో వుండి వైద్యం అందించాలని, సమయం పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరు పట్టికను పరిశీలించారు. వైద్యులు లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడే పని నిమిత్తం వెళ్ళామని వైద్యులు జిల్లా వైద్యాధికారికి ఫోన్ ద్వారా వివరించారు. వారికి మెమోలు జారీచేశారు. ఇక మీదట ఇటువంటివి జరిగితే జీతాల్లో కోత విధిస్తామన్నారు. 24 గంటలు ఆసుపత్రిలో సిబ్బంది వుండాలన్నారు. రోగులకు వైద్యం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటరెడ్డి, ఎమ్.రాఘవయ్య, ఫార్మాసిస్ట్ సుభాషిణి, స్టాఫ్ నర్సు లక్ష్మికాంతమ్మ, ఎల్‌డిసి రాజేష్ తదితరులు వున్నారు.

విద్యుత్ చౌర్యం నేరం... ఎస్‌ఈ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ

ఖాజీపేట : విద్యుత్ సరఫరా మీటరు ద్వారా జరగాలని..విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుంపలగట్టు, ఖాజీపేట బస్టాండు ప్రాంతంలో మంగళవారం విద్యుత్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనుప తీగలపై బట్టలు ఆరవేయడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యుత్ సరఫరా జరుగుతుందా లేదా అనే విషయం గ్రహిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. విద్యుత్‌పై సమస్య వచ్చినప్పుడు వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యుత్ చౌర్యం చట్టపరమైన నేరమన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటసుబ్బయ్య, ఏడీ శివప్రసాద్, ఏఈ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'విభజన చట్టం అమలులో రాయలసీమకు తీరని అన్యాయం'

ప్రొద్దుటూరు టౌన్: రాష్ట్ర విభజన చట్టం అమలులో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాజధానిని అమరావతికి తరలించడం, తిరుపతిలో ఏర్పాటు చేయాల్సిన క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లను రాజధానికి తరలించడం అనంతపురంలో ఏర్పాటు చేస్తామన్న సెంట్రల్ యూనివర్శిటీని, కర్నూలులో ఏర్పాటు చేస్తామన్న ఎయిమ్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం దారుణమన్నారు. ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పాములేటి, శశికుమార్, పార్థు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

మెప్మాలో దివ్యాంగులకు ఉద్యోగాలివ్వాలి

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: దివ్యాంగులకు మెప్మా సంస్థలో కో ఆర్డినేటర్ ఉద్యోగాలివ్వాలని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహకార సంస్థ చైర్మన్ కోటేశ్వరరావును కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిబావంతుల హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చలపతిరావు, కన్వీనర్ అఫ్జల్, ఇన్‌ఛార్జి ఖాజామొహిద్దీన్‌లు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులైన మహిళా సంఘాలపై మెప్మా అధికారులు, సీఆర్పీలు, చిన్నచూపు చూపుతున్నారన్నారు. దీంతో ఆ సంఘం అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందించాలన్నారు. ఇందుకు కోటేశ్వరరావు స్పందించారన్నారు. ముఖ్యమంత్రి, సంబందిత మంత్రులు, ఉన్నతాధికారులతో న్యాయం చేస్తామని తెలిపారన్నారు.

విపత్తులపై విద్యార్థులకు శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్: ప్రకృతి విపత్తులు, ఫస్ట్‌ఎయిడ్, అగ్నిప్రమాదాలపై ఎస్‌సీఎన్‌ఆర్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మూడు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. కడప స్టెప్ ఆఫీసు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. మంగళవారం విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం ఫస్ట్‌ఎయిడ్ ఉపయోగించడంపై డాక్టర్ల ద్వారా అవగాహన కల్పించనున్నారు. బుధవారం అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక శాఖ అధికారులు తమ పరికరాలతో అగ్నిప్రమాదాలను నివారించడంపై ప్రదర్శనపూర్వకంగా వివరించనున్నారు. కార్యక్రమంలో 80 మంది విద్యార్థులు పాల్గొనగా 40 మంది విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు స్టెప్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పిచ్చయ్యచౌదరి, రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్ విజయభాస్కర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ బాలయ్య, అధ్యాపకుడు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రొద్దుటూరు టౌన్: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో, సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ఎస్‌వీవీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్ తెలిపారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి శివకుమార్ ఈనెల 14, 15 తేదీల్లో జమ్మలమడుగు పీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరచి ద్వితీయస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడన్నారు.
అలాగే 9వ తరగతి విద్యార్థి దీపక్‌తేజ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాజట్టుకు ఎంపికయ్యారని, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ ప్రసాద్ టీచర్లు అభినందించారు.

అంగన్వాడీ సెంటర్లలో మిజిల్స్ రూబెల్లా టీకాలు

ప్రొద్దుటూరు టౌన్: అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మీజిల్స్ రూబెల్లా టీకాల కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. 32వ వార్డు ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని ఉర్దూ మున్సిపల్ పాఠశాలలో చిన్నారులకు టీకాలు వేశారు. వార్డు కౌన్సిలర్ కోనేటి సునంద, వార్డులోని చిన్నారులను పాఠశాలకు పిలిపించి టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తట్టు, రూబెల్లా వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తోందని, 9 నెలల నుండి 15 సంవత్సరాలలోపు పిల్లలకు టీకాలు వేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఆస్పత్రి నర్సులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల విలీనాన్ని నిలిపివేయాలి



స్టేట్‌బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్నఉద్యోగులు

ప్రొద్దుటూరు టౌన్: ఉద్యోగుల కడుపుకొట్టే విదంగా ఉన్న బ్యాంకుల విళీనంను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఏఐబీఈఏ నాయకుడు రామచంద్రారెడ్డి, ఎన్‌సీబీఈ నాయకుడు ప్రసాద్‌లు పేర్కొన్నారు. వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు జాతీయ బ్యాంకులు సహకరిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణ చేపట్టడంతో బకాయిదారులు ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేస్తున్నారని అన్నారు. 1762 మంది ఎస్‌బీఐలో 25104 కోట్లను 1120 మంది పంజాబ్ నేషనల్ బ్యాంకులో 12,278 కోట్లను తమ గుప్పిట్లో పెట్టుకున్నారని, ప్రభుత్వ రంగ బ్యాంకులలో మొండి బకాయిల విలువ రూ.92,376 కోట్లు ఉందన్నారు. కొందరికే పరిమితమైన బ్యాంకులను ప్రజలకు చేరువ చేయానికి 1969లో 14 బ్యాంకులను, 1981లో అయిదు బ్యాంకులను జాతీయం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్యాంకుల విళానంను నిలిపివేసి మొండి బకాయిలను వసూలు చేయాలని కోరారు. కార్మికుల అణచివేత చట్టాలను ఉపయోగించుకుని బైపార్టైల్ సెటిల్‌మెంట్ అమలు చేయాలని కోరారు. సి.వి.రమణ, భాస్కర్, సుధాకర్‌రెడ్డి, వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మెతో బోసిపోయిన బ్యాంకులు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో మంగళవారం సిరినగరి ప్రొద్దుటూరులోని ప్రభుత్వ రంగ బ్యాంకులు బోసిపోయాయి. బ్యాంకింగ్ లావాదేవీలు స్తంభించాయి. బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక సంస్కరణలకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన సమ్మె ప్రొద్దుటూరులో విజయవంతమైంది. కొన్ని ఏటీఎంలు సైతం మూతపడ్డాయి.

రౌడీమూకల బెదిరింపులతో నష్టపోతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు



ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్: రౌడీలు, గుండాల బెదిరింపులతో ప్రొద్దుటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని టీడీపీ అధికార ప్రతినిధి కర్నాటి వీరశేఖర్‌రెడ్డి విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రౌడీలు, గుండాలు ఒకరు కొన్న స్థలాన్ని మరొకరికి అమ్మిస్తూ లక్షల రూపాయలు వెనుకేసుకుంటున్నారన్నారు. హత్య కేసులో ముద్దాయిలుగా ఉంటూ న్యాయవాదులుగా ఉంటూ ఒక పాతకాలపు నాయకుడి మద్ధతుతో 1980 నాటి భయానక వాతావరణంను సృష్టిస్తూ కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తున్నారన్నారు.
వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరదరాజులరెడ్డిలు దృష్టిసారించి రౌడీలు, గూండాలపై ఉక్కుపాదం మోపాలని ఈ సందర్భంగా విన్నవించారు. స్థానిక పోలీసులు, డీఎస్పీలు, ఎస్పీలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆ రౌడీ మూకలు ఇతరుల స్థలాలను తాము కొన్నట్లు చెప్పి ఇతరులను ఇబ్బందిపాలు చే యడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజలు వారి మాయమాటలలు నమ్మి మోసపోరాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సూర్యనారాయణరెడ్డి, టీడీపీ నాయకులు చౌరెడ్డి బాలుడు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



వాసుదేవరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు టౌన్: జంగంపేట మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వాసుదేవరెడ్డి (48) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చి బడికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా వెన్నునొప్పి రావడంతో హోమస్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా డాక్టర్ లేకపోవడంతో సమీపంలో ఉన్న మరో ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. వాసుదేవరెడ్డి బీఏ, బీఈడీ చేసి వసంతపేట మున్సిపల్ హైస్కూలులో క్లర్క్‌గా విధుల్లో చేరారు. తర్వాత కూలూరు మండల ప్రాథమిక పాఠశాలలో మొదటిసారిగా ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. పెన్నానగర్‌లో పనిచేస్తూ ఇటవల జంగంపేట పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆయనకు భార్య లక్ష్మిప్రసన్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం రామేశ్వరం హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

కాలిబాటలతో అధిక దిగుబడి

రాజుపాళెం: వరిలో అధిక దిగుబడులు సాధించేందుకు విత్తనశుద్ధితోపాటు కాలిబాటలు ఏర్పాటు చేయాలని ఏవో అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దద్దనాల, టంగుటూరు గ్రామాల్లో చంద్రన్న రైతు క్షేత్రం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరిలో విత్తనాలకు విత్తనశుద్ధి చేసుకోవడం, వరి నాటే సమయంలో వ్యవసాయ అధికారుల సూచలను పాటించి జింక్ సల్ఫేట్ వేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. పది మంది రైతులకు ఉచితంగా జింక్‌సల్ఫేట్‌ను అందించారు. మరో వారం రోజుల్లో వేపనూనె తదితర మందులను కూడా అందిస్తారని రైతులకు తెలిపారు. ఏఈవో రాధా, మహేశ్వరి, రెండు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి

ప్రొద్దుటూరు క్రైం : తల్లిదండ్రులు తమ పిల్లలకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక శ్రీరాములపేట శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ రామిరెడ్డి పరిశీలించారు. వ్యాక్సిన్ వేస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ తట్టు, రూబెల్లా లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకే ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్నారన్నారు. ఈ వ్యాక్సిన్ 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరికి వేయించాల్సి ఉందన్నారు. ఈ వ్యాక్సిన్ గురించి అపోహ పడాల్సిన పని లేదని, అపోహలు వీడి పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయించడం ఎంతో ఉత్తమమన్నారు. ప్రపంచవ్యాప్తంగా మీజిల్స్ రూబెల్లా వ్యాధిని పారద్రోలడానికి అందరూ సహకరించి, ఎంఆర్ వ్యాక్సిన్‌ను పిల్లలందరికీ వేయించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రామిరెడ్డి

వంద శాతం లక్ష్యం సాధిస్తాం : కడప జిల్లాలో 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలు 7లక్షల 63వేల మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలనే లక్ష్యం తమ ముందు ఉందని, ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 5లక్షల 52వేల మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయడం జరిగిందని డీఎంహెచ్‌వో డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. మిగిలిన వారికి కూడా సెప్టెంబర్ 8లోపు వ్యాక్సిన్ వేయించి వంద శాతం లక్ష్యంను పూర్తి చేస్తామని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యరంగయ్య, వైద్యాధికారి హనీఫ్‌బాబా, ఆరోగ్య పర్యవేక్షణాధికారి వెంకటరెడ్డి, ఆరోగ్యవిద్యాధికారి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి
మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి

కడప సిటీ	: 9985411176	వినాయకనగర్	: 9849744014	మారుతీనగర్	: 9849117632
సెవెన్‌రోడ్స్	: 9985921355	కడప అర్బన్	: 9052239140	స్పోర్ట్స్	: 9059064398
కోటిరెడ్డిసర్కిల్	: 9347422385	ఐటిఐసర్కిల్	: 8886959903	వైవీయూ	: 9492563188
కడప క్రైం	: 9885477301	రూరల్	: 8520888323	ప్రకాష్‌నగర్	: 9866445574
రిమ్స్	: 9160619141	ఎర్రముక్కపల్లె	: 7702707108	రవీంద్రనగర్	: 9949232217

అధ్వానంగా మేరీనగర్

● విషజ్వరాలతో తల్లడిల్లుతున్న ప్రజలు ● కనుమరుగు అయిన ఫాగింగ్ ● కనిపించని పారిశుధ్య పనులు



కడప, ప్రకాష్‌నగర్ : సీజన్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పారిశుధ్యం చేపట్టక , ఫాగింగ్ చేయక, డ్రైనేజీలు నెలలు గడుస్తున్నా శుభ్రం చేయకపోవడంతో దోమల వృద్ధికి నిలయంగా డ్రైనేజీలు , చెత్తకుప్పలు మారాయి. పారిశుధ్యం అధికారులు కాని, మలేరియా నియంత్రణ అధికారులు కానీ పట్టించుకోపోవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దీంతో విషజ్వరాలతో ప్రజలు సతమతమౌతున్నారు. మామిళ్ళపల్లె పరిధిలోని 16వ వార్డులోని మేరీనగర్‌లో విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. విషజ్వరాల కారణంగా ప్రజలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్ళి వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. జ్వరం వస్తే కనీసం వారం, పది రోజులు రోగి ఇబ్బంది పడాల్సి వస్తోంది. గ్రామంలో ఫాగింగ్ డ్రైనేజీలు నెలకోసారి కూడా శుభ్రపరచడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా నగరపాలక అధికారులు ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో నిద్ర కరువు ...



దోమలతో రాత్రి వేళల్లో దోమల అధికంగా ఉన్నాయి. దోమలను లేకుండా చేయలేరా . మా వీధిలో జ్వరాలతో అల్లాడుతున్నారు. ఇంతకు మునుపు ఆటోలో పొగ వదులుతూ ఉండేవారు.

వెంకటమ్మ, మేరీనగర్

సంపాదనతో ఆసుపత్రులకే...



నెలలో కష్టపడి సంపాదించిన డబ్బులు ఆసుపత్రికే ఖర్చు చేస్తున్నాం. నెల క్రితం మా కుమారుడికి డెంగ్యూ వచ్చింది. మా వీధిలో ఇంకా ఇద్దరికి డెంగ్యూ జ్వరం వచ్చింది.

అమ్ములు, మేరీనగర్

ఉక్కు పరిశ్రమ నిరుద్యోగ యువతకు వరం



దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు తెలుపుతున్న చైతన్య విద్యాసంస్థల అధినేత

కడప, రవీంద్రనగర్ : ఉక్కు పరిశ్రమ స్థాపన నిరుద్యోగ యువతీ యువకులకు ఒక వరంలాంటిదని అందుకు ఉక్కు ఉద్యమంలోకి యువకులు పాల్గొనాలని చైతన్య విద్యాసంస్థల అధినేత మల్లికార్జున పేర్కొన్నారు. ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 47వరోజు మంగళవారం ఉక్కు దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి మాట్లాడారు. ఈ దీక్షలో పాల్గొన్న వారు మురళి, అయ్యవారయ్య, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగం కాలనీలో కాలువలు నిర్మించండి సారూ !

కడప, అర్బన్ : స్థానిక 48వ డివిజన్ పరిధిలోని బుడగ జంగం కాలనీలో మురుగు కాలువలు లేని కారణంగా నీరు రోడ్డుపై పారుతోందని స్థానికులు పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కలిసి మంగళవారం వినతి పత్రం అందించారు.

ఈ కార్యక్రమంలో స్థానికులు సాయన్న, వెంకటయ్య, లక్షుమయ్య, శ్రీరాములు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ఆటోకార్మికులపై స్పెషల్ డ్రైవ్ దాడులు ఆపాలి

కడప, అర్బన్ : ఆటోకార్మికులపై స్పెషల్ డ్రైవ్ దాడులు ఆపాలని సీఐటీయూ నగర అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టీవో కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులపై విపరీతమైన దాడులు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మాబుతార, సుబ్బరాయుడు, అల్తాఫ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

నంద్యాల ఎన్నికలలో టీడీపీ, జగన్ పార్టీలకు డిపాజిట్లు దక్కవు



మాట్లాడుతున్న నజీర్ అహ్మద్ తదితరులు

కడప, అర్బన్ : నంద్యాల ఉప ఎన్నికలలో టీడీపీ, జగన్ పార్టీలకు డిపాజిట్లు దక్కవని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడుంది. అడ్రసు లేని పార్టీ అని చెప్పినా జగన్‌పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి భయపడి లేనిపోని నిందలు వేయడం జరుగుతోందన్నారు. నంద్యాల ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పోటీని తక్కువ అంచనా వేసిన జగన్ కాంగ్రెస్ పార్టీకి దళిత, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు దగ్గరవుతున్నారని తమ ఓటమి ఖాయమని తెలుసుకున్నారన్నారు. అందుకే తెలుగుదేశంవారు రూ.10 కోట్లు కాంగ్రెస్‌కు ఇచ్చి పోటీ పెట్టారని అంటున్నారన్నారు. అదే 10 కోట్లు రూపాయలు కాంగ్రెస్ పార్టీ దగ్గర ఉంటే, తెలుగుదేశం పార్టీకి, జగన్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని చెప్పారు. నంద్యాల ప్రజలు ఈ రెండు పార్టీలను ఏవగించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి పీసీసీ అధికార ప్రతినిధి నీలిశ్రీనివాసరావు, జిల్లా సేవాదళ్ చైర్మన్ చీకటి చార్లెస్ ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ చాన్‌ఆలీ, సీనియర్ జిల్లా ఉపాధ్యక్షుడు దౌలా, బాబాసాహెబ్ పాల్గొన్నారు.

పే కమీషన్ అమలు చేయాలి



ర్యాలీగా వస్తున్న తపాలా సేవకులు

కడప, అర్బన్ : గ్రామీణ తపాలా ఉద్యోగులకు వెంటనే పే కమీషన్ అమలు చేసి 8 గంటలు పని కల్పించాలని ఏఐజీడీఎస్‌యు నాయకులు వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెలో భాగంగా మంగళవారం పెద్ద సంఖ్యలో తపాలా సేవకులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి రాము, కోశాధికారి రాంబాబు, జనార్ధన్, రఘురామయ్య, సంజీవరాయుడు,జగన్, పద్మావతి, రెడ్డమ్మ, మంగళగౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల టీచర్లకు కనీస వేతనం చెల్లించాలి

కడప, ఎర్రముక్కపల్లె : ప్రైవేటువిద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, వి.శివకుమార్ డిమాండ్ చేశారు. కడప డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలతో ఉపాధ్యాయ జీవితాలు దుర్భరంగా ఉన్నాయని తెలిపారు. విద్యా సంస్థలలో ఫీజులు వేలకు వేలు వసూలు చేస్తూ లాభాలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

తిథి భోజనం మంచి కార్యక్రమం

కడప, ఎర్రముక్కపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజన పథకం అమలు చేయడం చాలా మంచి కార్యక్రమమని ఆర్ఎంఎస్ఏ ఉపవిద్యాధికారి నాగమునిరెడ్డి తెలిపారు. కడప కాగితాల పెంట జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పార్ట్‌టైమ్ పీఈటీ రమేష్ తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు

కాలుష్యం నుంచి బయటపడాలంటే మొక్క నాటాలి

కడప, రవీంద్రనగర్ : కాలుష్యం నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని మారుతీ నగర్‌లో మైనార్టీ నాయకుడు అబ్దుల్ వాజీద్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ముఖ్య అతిథిగా జనవికాస్ సేవా సమితి అధ్యక్షుడు ఎస్ఎండీ తాహీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, హరిష్, శివ, సంజీవ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ సరఫరాపై సీఐటీయూ హర్షం

కడప, అర్బన్ : పోరాటాల ఫలితంగా మధ్యాహ్న భోజన నిర్వహణకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేస్తామని చెప్పడం పట్ల సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఐఎన్ సుబ్బమ్మ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

సినిమాగ్రాఫ్

కడప సినిమాలు

మురళి	: జయజానకి నాయక
రవి	: నేనే రాజు నేనే మంత్రి
సుధ	: ఫిదా
ప్రతాప్	: ఆనందో బ్రహ్మ
అమీర్	: టాయిలెట్ ఏక్ ప్రేమ్‌కథ
రమేష్	: గౌతమ్‌నంద
తాహీర్	: జనతాగ్యారేజ్
అప్సర	: లై
రాజా	: నక్షత్రం
ఎస్ఆర్	: లై

ఒక్క టీకాతో రెండు వ్యాధులు దూరం

రామాపురం : ఒక్క ఎంఆర్ టీకాతో రెండు వ్యాధులను దూరం చేసుకోవచ్చునని సీహెచ్‌వో రామాంజులు అన్నారు. మండలంలోని గువ్వలచెరువు, కొత్తపల్లె గ్రామాల్లో మంగళవారం ఎంఆర్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల బిడ్డ నుంచి 15 సంవత్సరాల పిల్లల వరకు ఎంఆర్ టీకా వేయించుకోవచ్చునన్నారు. ఈ ఒక్క టీకాతో ప్రాణాంతకమైన తట్టు, రుబెల్లా రెండు వ్యాధులు దూరం అవుతాయన్నారు. కొత్తపల్లె ప్రాథమిక పాఠశాల, గువ్వలచెరువు ప్రాథమికోన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు టీకాలు వేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు రాఘవ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సేవలందించే

ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

● అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటిటౌన్ : పేదలకు సేవలందించే ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తామని ఏపీ అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజకుళాయమ్మ, శంకరమ్మలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ 1975కు ముందు వేల సంఖ్యలో మాతాశిశు మరణాలు జరిగేవని, తరువాత జరగలేదని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయన్నారు. కారణం 1975లో ఐసీడీఎస్ ఏర్పడిందని, తద్వారా గ్రామీణ, పట్టణ పేద ప్రజలకు, గర్భిణులకు, బాలింత మహిళలకు ఈ పథకం, పౌష్టికాహారంతో పాటు రోగ నివారణ మందులు పంపిణీ చేయడమేనన్నారు. కానీ 2014 టీడీపీ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే ఈ పథకాన్ని ప్రైవేటీకరించి క్రమేపీ ఎత్తి వేయాలని పన్నాగం పన్నుతోందన్నారు. తెలంగాణా, ఇతర రాష్ట్రాల్లో వేతనాలు పది వేలకుపైగా ఉంటే ఏపీలో రూ.7 వేలు అది కూడా నాలుగు నెలల నుంచి ఇవ్వడం లేదని, పెరిగిన ధరలకనుగుణంగా రూ.18 వేలు వేతనం కోసం ఇసీడీ యస్ హక్కుల రక్షణ కొరకు సీఐటీయూ సహకారంతో దీర్ఘకాలిక పోరాటాలను చేపడుతున్నామన్నారు. వంట వండకంపై బయటివారా లేద అంగన్వాడీలా అనేదానిపై ప్రభుత్వ ఆధారాలతో సీడీపీవోలు ప్రకటన చేయాలన్నారు. ఐసీడీఎస్ నిబంధనలకు విరుద్ధం గా ప్రవర్తించిన వారు కాలగర్భంలో కలిసిపోయారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ప్రధాన కార్యదర్శి బంగారుపాప, డివిజన్ ఉపాధ్యక్షుడు పద్మావతి, నాగమణి, విజయ, సిద్దమ్మ, ఉమారాణి, సావిత్రి, షబానాలు పాల్గొన్నారు.

ఘనంగా మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం



పక్షవాత రోగికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న మానవత సభ్యులు

రాయచోటిటౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో దూసుకుపోతున్న మానవత సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి ఏరియా ఆసుపత్రిలో వేడుకలను నిర్వహించి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో వృక్షరక్షణ సమితి సహకారంతో మొక్కలు నాటి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సహదేవయ్య, డాక్టర్లు మహేశ్వర్‌రాజు, భాస్కర్‌రెడ్డి, రెడ్డెన్న, మానవత సంస్థ సభ్యులు శివగంగిరెడ్డి, మహబూబ్‌బాషా, షకీల్, వీరయ్య, నారాయణరెడ్డి, వృక్షరక్షణ సమితి అధ్యక్షుడు తులసీశ్వర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో....

మానవత సంస్థ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా పక్షవాతంతో బాధపడుతున్న పక్కీరారెడ్డిపల్లెకు చెందిన చిన్నప్పకు సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మానవత గాలివీడు మండల చైర్మన్ మలసాని సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ 2004వ సంవత్సరం ఆగస్టు 22వ తేదీన ఏర్పడిందన్నారు.

ప్రస్తుతం ఆరు జిల్లాలో ఈ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మిగిలిన జిల్లాలకు కూడా విస్తరించడం జరుతుందన్నా రు. అనంతరం వివిధ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత కన్వీనర్ శివారెడ్డి, అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు రెడ్డెన్న, కార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి దామోదర్, మాజీ అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, సిద్దారెడ్డి, అడ్వైజర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 6న కడపలో జాబ్‌మేళా

గాలివీడు : సెప్టెంబర్ 6న కడపలోని జిల్లా కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాకు మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలు పొందాల్సిందిగా ఎంపీడీవో సూచించారు. 10వ తరగతి పాసైన వారి నుంచి బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులు సైతం జాబ్‌మేళాలో పాల్గొనాల్సిందిగా ఆయన సూచించారు. నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పనిచేయని బ్యాంకులు

రామాపురం : ప్రభుత్వ రంగ బ్యాకులు ప్రకటించిన బంద్ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులు మూసివేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ కారణంగా బ్యాంకు ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు బ్యాంకుల బంద్ ప్రకటించారు. బ్యాంకులను ప్రైవేటీకరణం చేయడం ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బ్యాంకు ఉద్యోగులు డిమాండ్ చేశారు.

చెత్తవల్ల గ్రామాలకు లాభం

లక్కిరెడ్డిపల్లె : వృథా చెత్త వల్ల గ్రామ పంచాయతీకి ఎంతో ఆదాయమని డీఆర్‌పీ భానుప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని చెత్తను ఎలా సేకరించడం, వాటిని ఎలా డంపింగ్‌యార్డు చేర్చే విధానంపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోజు వచ్చే చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డుకు చేర్చి అందులో తయారు చేసిన ఎరువులను కిలో రూపాయిలతో రైతులకు విక్రయించవచ్చునన్నారు. వానపాముల ఎరువుల తయారీ వల్ల పొలాలకు మంచి దిగుబడిని ఇస్తుందన్నారు. పారిశుధ్య కార్మికులు పారిశుధ్యాన్ని కాపాడడమేగాక దీనివల్ల గ్రామ పంచాయతీకి లాభాలు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పులిరాంసింగ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బీసీ నేత నారసుబ్బన్న మృతికి సంతాపం తెలిపిన జగన్

రాయచోటిటౌన్ : రాయచోటి మండలం అబ్బవరంకు చెందిన బీసీ నేత నారసుబ్బన్న (90) మృతి పట్ల వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. ఆయన మృతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారసుబ్బన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉండేవారని, జగన్ పెట్టిన వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించారని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

సంబేపల్లె : పోస్టల్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు సంబేపల్లె సబ్‌పోస్టు మాస్టర్ జేసుదాసు తెలిపారు. మంగళవారం సంబేపల్లె వారాంతపు సంతలో పోస్టల్ సిబ్బందితో కలిసి ప్రజలు పోస్టల్ పథకాలపై తెలియజేశారు. పోస్టాఫీసుల్లో పొదుపు చేపట్టాలని తెలియజేశారు. ఎస్‌బీ ఆర్డీ, ఎస్ఎస్ఏవై, ఆర్‌పీఎల్‌వై వంటి పోస్టల్ పథకాలతో పాటు వివిధ సేవలను డోర్‌టు డోర్ కార్యక్రమంలో వివరించారు. నూతనంగా పోస్టాఫీసులో పొదుపు ఖాతాలను తెరిచారు. ప్రతి బీవో పరిధిలో ఈ కార్యక్రమం ద్వారా పొదుపు ఖాతాలను తెరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మప్రచారాన్ని పాటిద్దాం

లక్కిరెడ్డిపల్లె : హిందూ ధర్మప్రచారాన్ని పాటిస్తే మనిషికి ఎంతో ఉపయోగకరమని హిందూ ధర్మప్రచార సమరసతసేవా కన్వీనర్ క్రిష్ణయ్య పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ వారి ఆధ్వర్యంలో పేద హిందువులకు మంగళవారం దివ్యదర్శనం బస్సుయాత్ర గంగమ్మ ఆలయ చైర్మన్ క్రిష్ణారెడ్డి, ఈవో సురేష్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. లక్కిరెడ్డిపల్లె మండలం నుంచి నాలుగు రోజుల యాత్రలో నాలుగు బస్సులు, 200 మంది హిందూ పేదలు నాలుగు రోజుల పాటు సుందరకొండ, మహానంది, శ్రీశైలం, విజయవాడ, త్రిపురాచ్, తిరుమల, తిరుచానూర్, పెద్దకావలి దేవస్థానాలు ఉచితంగా భక్తులకు చూపిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా హిందూ ప్రచార పరిషత్ నాయకులు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకుంటే అది మనల్ని రక్షిస్తుందని, గంగమ్మ పేరు మీద ఈ నాలుగు రోజులు యాత్ర హిందూ భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా నాయకులు హరినాధ, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, హిందూ ధర్మప్రచార పరిషత్ కన్వీనర్ చెన్నక్రిష్ణయ్య, నూకల రవీంద్ర, నాగబసన్న, మాజీ ఉపమండలాధ్యక్షులు వెంకట్రమణ, సర్పంచ్ రామక్రిష్ణ, మానవత సేవా సంస్థ అధినేత రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న చైర్మన్ క్రిష్ణారెడ్డి, ఈవో సురేష్‌కుమార్

ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుంది

రాయచోటిటౌన్ : ఉపాధ్యాయులు తాము చేసిన ఉత్తమ సేవలతోనే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం మాసాపేటలోని సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బదిలీ ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఈ పాఠశాలలో పనిచేస్తు బదిలీపై వెళ్లిన తెలుగు ఉపాధ్యాయులు ఆర్‌వీ రమణ, సంగీత, హిందీ ఉపాధ్యాయులు రామచంద్రయ్య, ఆంగ్ల ఉపాధ్యాయులు బయారెడ్డి, ముబారక్, బాష, జీవశాస్త్ర ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సరళ, వ్యాయమ ఉపాధ్యాయుడు వేణుమాధవరాజులను పూలమాలతోను, దుశ్శాలువాలతోను, జ్ఞాపికలతోను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్ సుబ్రమణ్యం, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మెన్ సుగవాసి సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, నల్లబోతుల మురళీకృష్ణ, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వనిత క్యాట్‌కార్డు ప్రయాణికులకు ఎంతో శ్రేయస్కరం

లక్కిరెడ్డిపల్లె : తెల్లరేషన్‌కార్డు కల్గిన ప్రయాణికులకు వనిత క్యాట్‌కార్డు ఎంతో ఉపయోగకరమని రాయచోటి ఆర్టీసీ డీయం ముత్యాలనాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు కల్గిన ప్రతి ఒక్కరూ వనిత క్యాట్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయా చౌకదుకాణాల డీలర్ల చేత దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. డీలర్లు కూడా కమీషన్ ఇస్తామని, వచ్చే తెల్లరేషన్‌కార్డు లబ్దిదారులు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే ఆటోల్లో వెళ్లకుండా ఆర్టీసీ ప్రయాణం ఎంతో శ్రేయస్కరమని ఆయన సూచించారు. చాలా మంది ఇష్టమొచ్చినట్లు జీపులు, ఆటోల్లో ప్రయాణం చేయడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవలానాయక్, ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి, డీటీ శ్రీరాములునాయక్, డీలర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

శ్రావణమాసం హిందువులకు శ్రేష్టకరం

గాలివీడు : తెలుగు మాసాలలో శ్రావణమాసం హిందువులకు ఎంతో శ్రేష్టమైందని మండల సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ బెల్లాల రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారంతో శ్రావణమాసం ముగియడంతో ఆఖరురోజు శ్రావణ అమావాస్య రోజును ఇలవేల్పులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురష్కరించుకుని సమరసత కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలియుగ వైకుంఠుడైన శ్రీమన్నారాయణుని జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రమైనందున శ్రావణ మాసానికి ఎంతో విశిష్టత ఏర్పడిందన్నారు. ఈ మాసంలో శ్రీవెంకటేశ్వరుడిని సేవించిన వారికి జన్మధన్యమవుతుందన్నారు. అంతేగాకుండా శ్రీరాముని ప్రియ భక్తుడైన శ్రీవీరాంజనేయున్ని పూజిస్తే అష్టఐశ్వర్యాలు సిద్దిస్తాయన్నారు. శ్రావణ మాసం శ్రావణ నందకరమైందని ఈ మాసంలో భగవంతుని సంకీర్తనలు విన్నా, కన్నా శుభ ప్రదమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శేఖర్‌నాయుడు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

భూదందాపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

పోరుమామిళ్ల : నియోజకవర్గంలోని 7మండలాల్లో ప్రభుత్వ భూముల భూదందాపై రిటైర్డ్ న్యాయమూర్తిచేత విచారణ జరపాలని సీపీఐ సీనియర్ నాయకుడు అబ్దుల్‌ఖాదర్ డిమాండ్ చేశారు. కాశినాయన మండలంలోని సావిశెట్టిపల్లె, అక్కెంగుండ్ల ప్రాంతాల్లో వేలాది ఎకరాలు స్థానికేతరులు ఆక్రమించుకున్నారన్నారు. అలాగే పోరుమామిళ్ల, అట్లూరు, బద్వేలు, గోపవరం, మండలాల్లో ప్రభుత్వభూములతోపాటు దేవాదాయ భూములను కాజేసి క్రయ విక్రయాలు జరిపారన్నారు. కుంటలు, చెరువులు సహా ఆక్రమించి బోర్లువేసి పైర్లు పండించుకొని సొంతం చేసుకుంటున్నారని ఆరోపించారు. వీటిన్నంటిపైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

పల్లెల్లో 'బెల్టు'కు అడ్డుకట్ట పడేదెప్పుడో...

● పట్టణ, మండల కేంద్రాల్లోనే నియంత్రణ ● గ్రామాలపై దృష్టి సారించని అధికారులు



బెల్టు షాపుల వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

బద్వేలు : గ్రామీణ ప్రాంతాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. దీంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బెల్టుషాపులను పూర్తిస్థాయిలో నియంత్రించాలని స్వయాన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అధికారులు ముమ్మరంగా బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. కేవలం పట్టణ, మండల కేంద్రాల్లో బెల్టుషాపులను నియంత్రించడంలో అధికారులు కొద్దిమేర సఫలీకృతులయ్యారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఆక్రమంగా బెల్టుషాపులను ఏర్పాటుచేసి, మద్యం విక్రయిస్తున్నారు. అధికారులు కొన్ని రోజులు హడావిడి చేసి బెల్టుషాపులపై దాడులు చేపట్టారు. క్రమ క్రమంగా దాడులు తగ్గడంతో గత కొన్ని రోజుల నుంచి మళ్లీ గ్రామాల్లో బెల్టు షాపులు ఊపందుకున్నాయి. బద్వేలు నియోజకవర్గంలోని గ్రామాలు బెల్టుషాపులకు అడ్డాగా మారాయి. కొన్ని గ్రామాల్లో మంచి నీరు దొరకడం లేదుకానీ, బెల్టుషాపుల ద్వారా కావాల్సినంత మద్యం దొరుకుతోంది. పగలంతా కష్టంచేసి వచ్చిన డబ్బుతో సగానికిపైగా మద్యం కోసం దారపోస్తున్నారు. బద్వేలు పట్టణంలో 10, గోపవరం మండలం పీపీకుంటలో ఒకటి, బి.కోడూరులో ఒక్కటి, బ్రహ్మంగారిమఠం మం డలం మల్లేపల్లెలో ఒక్కటి, కలసపాడులోఒక్కటి, పోరుమామిళ్లలో 7, కాశినాయనలో 1 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు గుట్టుచప్పుడు కాకుండా నియోజకవర్గ పరిధిలో చాపకింద నీరులా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో 8మంది బెల్టుషాపు నిర్వాహకులను అరెస్ట్‌చేసి 146 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గతంలో బహిరంగ బెల్టుషాపులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఎక్సైజ్, సివిల్ పోలీసులు దాడులు నిర్వహించడంతో పట్టణ, మండల కేంద్రాల్లో కొత్తవారికి మద్యం విక్రయించకుండా పాత వారికే రహస్య ప్రదేశంలో మద్యం విక్రయిస్తున్నారు. కొంత మంది బెల్టుషాపుల నిర్వాహకులు జేబుల్లో మద్యం పెట్టుకొని మద్యం విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిసారించి బెల్టుషాపుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మట్కా మహమ్మారిని తరిమికొడదాం



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ మహమ్మద్ రఫి



పోరుమామిళ్లలో పరివర్తన ర్యాలీలో పాల్గొన్న మైదుకూరు డీఎస్పీ

పోరుమామిళ్ల : మట్కా మహమ్మారిని తరిమికొడదామని మైదుకూరు డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరివర్తన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మహాత్మగాంధీ విగ్రహం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మట్కా బారినపడి పేద, మధ్యతరగతి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయన్నారు. అలాంటి వారి జీవితాల్లో పరివర్తన రావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్దినీ విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని మట్కాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ పద్మనాభన్, పోరుమామిళ్ల ఎస్ఐ పెద్దఓబన్న, కలసపాడు ఎస్ఐ వెంటరమణ, బి.కోడూరు ఏఎస్ఐ రామయ్య, ఏఎస్ఐ పుల్లన్న, జాడ్జి పాల్గొన్నారు.

మట్కా నిర్మూలనకు సహకరించాలి

బద్వేలు టౌన్ : మట్కాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అట్లూరు ఎస్ఐ మహమ్మద్ రఫి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పరివర్తన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మట్కా ఆడటం వలన కుటుంబాల ఆర్థిక వ్యవస్థ ఛిన్నాబిన్నం అవుతుందన్నారు. మట్కాజోలికి వెళ్లి కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇప్పటికైనా పరవిర్తన చెంది సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నారు. పోలీసులు నరసింహ, ప్రసన్న, నాగేంద్ర, శ్రీనివాసులు, రంగనాయకులు, గుండన్న పాల్గొన్నారు.

పరివర్తనపై ర్యాలీ

కలసపాడు : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కలసపాడులో పోలీసుల ఆధ్వర్యంలో మట్కాపై పరివర్తన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ మట్కా మహమ్మారి వలన కుటుంబాలు నాశనమవుతున్నాయన్నారు. మట్కాతో కొందరు దొంగతనాలకు కూడా వెనుకాడటం లేదన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

బద్వేలు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని యజ్ఞం చేస్తున్నారని, పదవి కోసం ఎంతకైనా దిగజారి ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు. నంద్యాల ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆయన అన్నారు. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ అధికారం చేపడుతుందని, జగన్‌మోహన్‌రెడ్డి జైలు గోడల మధ్య ఊసలు లెక్కపెట్టాల్సిందే అని ఆయన ఎద్దేవా చేశారు. నంద్యాల ఎన్నికల్లో ఓటమిపాలు అవుతామని జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలలోనే మకాం వేశాడని, వైసీపీ నేతలు ఎంతమంది మకాం వేసినా ఆనియోజకవర్గ ప్రజలు టీడీపీకే పట్టం కడుతారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కాల్చండి, చంపండి, ఉరేయండి, కాలర్‌పట్టుకోవాలని అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజకీయానికి ఇటువంటి మాటలు తగవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బైసాని ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బయన్న, జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యుడు అశోక్‌కుమార్‌రాజు, జమాల్, నరసింహారెడ్డి, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

285 ఎన్టీఆర్ గృహాలు మంజూరు

కాశినాయన : మండలానికి 3విడతల్లో 285 ఎన్టీఆర్ గృహాలు మంజూరైనట్లు హౌసింగ్ ఏఈ మారుతీప్రసాద్ తెలిపారు. ఇందులో 2016-17కు సంబంధించి 30, 2017-18కి సంబంధించి 115, 2018-19కి సంబంధించి 140 ఉన్నాయన్నారు. ఇప్పటికే 17గృహాలకు సంబంధించిన అధికారులు నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభించారని, వారికి బిల్లులు కూడా చేశామన్నారు. మిగిలిన వారు కూడా త్వరగా నిర్మాణాలు మొదలుపెటాలని ఆయన కోరారు.

అదనంగా ఉపాధ్యాయుల కోసం డీఈవోకు ప్రతిపాదనలు

కాశినాయన : మండాలనికి డీఈవో పూల్ నుంచి 15మంది ఉపాధ్యాయులను పంపాలని జిల్లా విద్యాధికారికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ కె.బాలఓబయ్య తెలిపారు. ఇందులో 5మంది స్కూలు అసిస్టెంట్లు, 10మంది సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు కావాలని కోరామన్నారు. మండలానికి వీరిని కేటాయించినట్లు అయితే ఉపాధ్యాయుల కొరత తీరుతుందని ఆయన తెలిపారు.

వృద్ధులకు చేతికర్రలు, వాకింగ్ స్టాండ్లు పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న మానవత అధ్యక్షుడు శంకర్‌రెడ్డి

బద్వేలు టౌన్ : మానవతా స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని మైదుకూరురోడ్డులో దివ్యజ్యోతి వృద్ధాశ్రమం వద్ద వృద్ధులకు చేతికర్రలు, వాకింగ్‌స్టాండ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా అధ్యక్షుడు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థను స్థాపించి, ఎంతో మంది పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. వీలుచైర్లు, బాడీఫ్రీజర్లు, సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో దివ్యజ్యోతి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు ప్రసాద్, మానవతా సభ్యులు నాగేశ్వరరావు, సంజీవ్‌కుమార్, రంగనాయకులు, అంజి, మస్తాన్, మల్లేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, హుస్సేన్‌రెడ్డి, విశ్వనాథనాయుడు, నారాయణస్వామి, చిన్నయ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

బద్వేలు	
శేఖర్	నేనే రాజు, నేనేమంత్రి
నౌషాద్	జయ జానకి నాయక
లక్ష్మీనరసింహ	లై
పోరుమామిళ్ళ	
వెంకటేశ్వర	జయ జానకి నాయక
దేశాయి	నేనే రాజు, నేనేమంత్రి

గ్రామీణ రోడ్లకు పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టాలి



ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రోడ్లను పరిశీలిస్తున్న అధికారులు

గోపవరం : గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు పంచాయతీ నిధులను ఉపయోగించి మరమ్మతులు చేయాల్సి ఉందని ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టి.సండ్రపల్లెలో ప్రధాన రహదారి ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని సర్పంచ్ ద్వారా తెలుసుకున్న ఎంపీడీఓ, పీఆర్ ఏఈ చిట్టిబాబులు గ్రామాన్ని సందర్శించి ఇబ్బందికరంగా ఉన్న రహదారిని పరిశీలించారు. నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనుల వేగం కొంత తగ్గినమాట వాస్తవమేనని, ఇలాంటి చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే పంచాయితీ నిధులను ఉపయోగించి మరమ్మత్తులు చేసుకునేలా ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తెచ్చుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడం, సిమెంట్‌రోడ్డు కుంగిపోవడంతో కొద్దిపాటి వర్షానికే నీరంతా చేరి వీధిరోడ్లు బురదమయంగా మారుతున్నాయని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరామిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి వెంకటలక్షుమ్మ, టీడీపీనేత ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

బద్వేలు	9885304960
బద్వేలుటౌన్	9640614371
పోరుమామిళ్ల	9441284007
కలసపాడు	9491946171
కాశినాయన	9985408967
గోపవరం	8374482744
బి.కోడూరు	9441815476
అట్లూరు	8142454286

పట్టణ స్థిరీకరణకు ఏర్పాట్లు

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు పట్టణ సుందరీకరణకు రోడ్ల డివైడర్లు నిర్మాణం చేపట్టి పచ్చదనం పెంచడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం కమిషనర్ శేషన్న, చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, అర్బన్ గ్రీనరీ జోనల్ మేనేజర్ రవికుమార్, ఎన్విరాన్మెంట్ డిఇ రాజేష్, హార్టికల్చరల్ ఆఫీసర్ సురేంద్రలు పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. టీబీ రోడ్డులో కోర్టు వద్ద నిర్మిస్తున్న డివైడర్లను పరిశీలించారు. జిన్నారోడ్డులో రోడ్డుపై వాహనాలు పెట్టి పార్కింగ్ ప్రదేశంగా వినియోగించడాన్ని పరిశీలించారు. పుట్టపర్తి సర్కిల్, రాజీవ్ సర్కిల్, విజయకుమార్ సర్కిళ్లలో పచ్చదనం పెంచేందుకు ఏ విధమైన ఆకృతులు ఏర్పరచాలని చర్చించారు. మొక్కలు కొత్తవి నాటడం, పెరిగిన మొక్కలకు ట్రిమ్మింగ్ చేయడం చేపట్టాలని చైర్మన్ రఘు సూచించారు.

నీళ్ల కోసం మహిళల ఆందోళన



ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు ప్రజలకు శాశ్వతంగా నీళ్లు అందించే చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత కొవ్వూరు బాలచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సంజీవనగర్ మహిళలు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు. చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కమిషనర్ శేషన్నలు బాలచంద్రారెడ్డితో చర్చించారు. అధికారులతో సంప్రదించి వివరాలు తెలియజేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించి దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నేత పగిడాల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి కృషి



ఉచిత మెగా వైద్యశిబిరంలో మాట్లాడుతున్న చైర్మన్ రఘు

ప్రొద్దుటూరు అర్బన్: మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తామని చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీరాములపేటలోని మున్సిపల్ మెటర్నిటీ ఆస్పత్రిలో మున్సిపాలిటీ మిడ్ టౌన్ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ నిత్యం పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు అనేక రకాల వ్యాధుల బారిన పడతారన్నారు. పారిశుధ్య సేవలు నిర్వహించే కార్మికులకు వైద్యసేవలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి స్పెషలిస్టు వైద్యులతో చికిత్సలు అందించనున్నామన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ కార్మికులు గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఐఎంఏ తరుపున వైద్యులు ఉచితంగా సేవలు అందించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ గంటశాల సావిత్రమ్మ, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ స్వరూప్‌కుమార్, కౌన్సిలర్లు పిట్టా శ్రీనివాసులు, జయశంకర్, సూర్యనారాయణరెడ్డి, సునంద, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫరీద్, వైద్యులు వరుణ్, హేమలత, రామసుబ్బారెడ్డి, నాగార్జున, నజీర్‌బాష, బ్రహ్మకుమార్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిడ్‌టౌన్ రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతయ్య, శ్రీనివాసులు, మాకం సురేష్, ముడియం జగదీష్, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ఇన్‌స్పెక్టర్ నూర్‌బాష, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు డివిజన్‌లో 18.6 శాతం విస్తీర్ణానికే పరిమితమైన సాగు

● 10,488 హెక్టార్లలో బీడు భూములు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: వర్షాభావ పరిస్థితులతో ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్‌లో గతంలో ఎప్పుడు లేనంతగా ఖరీఫ్‌లో పంటల సాగు తగ్గింది. కేవలం 18.6 శాతం విస్తీర్ణానికే పంటల సాగు పరిమితమైంది. ప్రొద్దుటూరు డివిజన్‌లో ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 12,886 హెక్టార్లుగా ఉంది. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో మాత్రం ఇప్పటి వరకు కేవలం 2,397.60 హెక్టార్లలో మాత్రమే పంటల సాగు జరిగింది. ఈ పంటలు కూడా సరైన వర్షాలు లేక దెబ్బతిన్నాయి. 10,488.40 హెక్టార్లలో పంటల సాగు జరుగలేదు. దీంతో ఈ భూములన్నీ బీళ్లుగా ఉన్నాయి. కేసీ కెనాల్‌కు నీరు రాక వరి సాగు కేవలం 10 శాతానికి పడిపోయింది. వరి సాధారణ విస్తీర్ణం 2784 హెక్టార్లు కాగా 302 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగింది. కంది సాధారణ విస్తీర్ణం 870 హెక్టార్లుకాగా 148 హెక్టార్లలో మాత్రమే సాగైంది. పెసర సాగు సాధారణ విస్తీర్ణం 430 హెక్టార్లు కాగా 109.75 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగింది. మిరప పంట సాధారణ విస్తీర్ణం 693 హెక్టార్లు కాగా 4.69 హెక్టార్లలోనే సాగైంది. 4390 హెక్టార్లలో పత్తిపంట సాగవ్వాల్సి ఉండగా వర్షాలు రాక 1320 హెక్టార్లకే పరిమితమైంది. జొన్న, జొజ్జ, కొర్ర, రాగి, కుసుమ, పసుపు, చెరకు, మినుము, నూగు తదితర పంటల సాగు జరగనేలేదు. దీంతో ఖరీఫ్‌లో ఆలస్యంగా సాగు చేసుకునే పంటలకు విత్తనాలకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. కంది, జొన్న పంటల సాగుకు వర్షాలు పడితే విత్తనాలు కావాలని నివేదించారు.

అవీ.. ఇవీ..

రుణాల మంజూరులో నిర్లక్ష్యం చేస్తే ఆందోళన

ప్రొద్దుటూరు కల్చరల్: సబ్సిడీ రుణాల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనకు సిద్ధమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు వెంకటరెడ్డికి ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. 1474 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిని ప్రతి రోజు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. యూనిట్‌కాస్ట్ రూ.లక్ష ఉంటే రూ.50 వేలను మంజూరు చేస్తున్నారన్నారు.

ఎస్‌సీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విచారణ

ప్రొద్దుటూరు టౌన్: ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డివోవో విచారణ కమిటీ సభ్యులు విచారణ నిర్వహించారు.చార్జ్ అప్పగించకపోవడం, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ జరిపారు. విచారణ అధికారిగా ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.సుబ్రమణ్యంకుమార్, అదే కళాశాల సీనియర్ అసిస్టెంట్ కె.మద్దిలేటి, ప్రజంటింగ్ ఆఫీసర్‌గా విచారణ జరిపారు. ఆరోపణలపై అప్పటి క్లర్కికల్ సిబ్బంది డీఈ విజయకుమారి, సంజీవరాయుడులను విచారించారు. అనంతరం పంచనామా కమిటీకి చెందిన ఐదుగురు సభ్యులను విచారించారు. వారం రోజుల్లో ఆర్‌జేడీకి నివేదిక సమర్పించనున్నట్లు వారు తెలిపారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ



మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న లింగారెడ్డి

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 57 మందికి మంజూరైన రూ.87,61,310 ఆర్థికసాయం పత్రాలను మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మల్లెల లింగారెడ్డి తన కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్తియార్, సుధాకర్ రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

ప్రొద్దుటూరు అర్బన్: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న విద్యార్థి అనాథ శరణాలయంలో అభ్యుదయ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజీముఫ్తి ఇక్బాల్ సాహెబ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుభకార్యాల సందర్భంగా అనాథ విద్యార్థులకు అన్నదానం, వస్త్రదానం చేయడం మేలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అమానుల్లా, అల్లాబకాష్, సుబ్రమణ్యం, రాజేష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పథకానికి 26న శంకుస్థాపన



రామేశ్వరం హౌసింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం


ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు పట్టణంలోని పేదలకు సొంత గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 26న గృహ నిర్మాణ పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి, కమిషనర్ శేషన్న, ఇఇ సురేంద్రబాబు, టీపీవో శివగురుమూర్తి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, రామేశ్వరం హౌసింగ్ కాలనీ స్థలాన్ని పరిశీలించారు. దాదాపు 35.70 ఎకరాల్లో జి+3 పద్ధతిలో నిర్మించే హౌసింగ్ పథకాన్ని అపార్టుమెంట్ పద్ధతిలో నిర్మించనున్నారు.

గణనాథా.. కొలువుకు వేళాయె...

ప్రొద్దుటూరు టౌన్: అన్ని వయస్కుల వారిని ఆకట్టుకునే పండుగ వినాయక చవితి. కుమ్మరికొట్టాల, హోమస్‌పేట, సినీహబ్, ప్రతాప్ రెసిడెన్సీ, మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్డులలో వినాయక ప్రతిమలను విక్రయిస్తున్నారు. హైదరాబాదు, గుంతకల్లు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుండి తయారీదారులను రప్పించి ప్రతిమలను తయారు చేయించి విక్రయిస్తుండగా కొందరు తయారైన విగ్రహాలను తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. విగ్రహాలను తయారు చేయడానికి దాదాపు ఆరు నెలల సమయం పడుతుందని తయారీదారులు అన్నారు. పట్టణంలో అడుగు నుంచి 12 అడుగుల సైజులో విగ్రహాలను విక్రయిస్తున్నారు. రూ.1000 నుంచి రూ.22 వేల వరకు ధరల్లో విగ్రహాలు లభిస్తున్నాయి. మొదటిసారిగా కుందన్ ఆర్ట్‌వర్క్ విగ్రహాలను ఇక్కడ విక్రయిస్తున్నారు. కాగా జీఎస్టీ ప్రభావంతో రంగులు, పీవోపీ ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. పీవోపీ గత సంవత్సరం 6,500 ఉండగా నేడు రూ.8 వేలు పెరిగిందని పేర్కొంటున్నారు. ధరల పెరుగుదలతో వ్యాపారం మందకొడిగా సాగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 25న చవితిని పురస్కరించుకుని యువకులు విగ్రహాల ఏర్పాటుకు పందిళ్లు వేస్తున్నారు.



పార్వతీ పరమేశ్వరులతో ఉన్న గణనాథుడు









వృద్ధులకు బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ

కడప, ప్రకాష్‌నగర్: రెండేళ్ళుగా నిరంతర సేవలందిస్తున్న మహాసభ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ కార్యదర్శి ఆర్.గోపి తెలిపారు. ఈ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం సైనిక్‌నగర్‌లో చౌడమ్మ వృద్ధాశ్రమంలో 30 మంది వృద్ధులకు బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. మానవతా కడప మండలం అధ్యక్షుడు కె.ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మునిస్వామి, క్రిష్ణారెడ్డి, రవికుమార్, శివారెడ్డి, పి.సుబ్బారెడ్డి, జిల్లా కమిటీ టపాల్గొన్నారు.

అధ్యాపకుల వేతనాలను వందశాతం కేంద్రమే చెల్లించాలి

భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

కడప, ఎర్రముక్కపల్లె : అధ్యాపకుల వేతనాలకు వందశాతం కేంద్రమే చెల్లించేలా కేంద్ర మానవ వనరులశాఖామంత్రి చర్యలు తీసుకోవాలని జీసీజీటీఏ, జీసీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో మంగళవారం భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఎఫయుసీటీవో పిలుపు మేరకు నిరసన చేపట్టాలని తెలిపారు. యూజీసీ వేతన సవరణ కమిటీ సమర్పించిన నివేదికను కేంద్ర మానవ వనరులు శాఖ వెంటనే బహిర్గతం చేయాలన్నారు. జీసీజీటీఏ ప్రధాన కార్యదర్శి బి.విజయ్‌కుమార్, జీసీటీఏ జోనల్ కార్యదర్శి ఆర్.నీలమన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఏసీటీఏ చలమారెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, గుర్రప్ప, జయరామిరెడ్డి, ఉదయశ్రీ, రమ్యజ్యోతి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఎక్స్‌గ్రేషియా, వయస్సు పెంపు



కలెక్టర్‌కు వివరిస్తున్న ఒంటేరు

కడప, ఎర్రముక్కపల్లె : కారుణ్య నియామకాలకు సంబంధించి ఎక్స్‌గ్రేషియా వయోపరిమితి పెంచుతూ ప్రభుత్వం జీవోఎంఎస్ నెం 114ను విడుదల చేసిందని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.చెంచిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో ఉంటూ అకాలమరణం పొందిఉంటే ఆ కుటుంబ సభ్యులతో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాల్సి ఉందని తెలిపారు. అయితే ఆ కుటుంబ సభ్యులతో వయస్సు, అర్హత లేకపోయినానియామకం పొందుటకు వీలులేని పరిస్థితిలో ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. 4వ తరగతి ఉద్యోగులైతే రూ. 40 వేల నుండి రూ. 5 లక్షలు నాన్‌గెజిటెడ్‌కు రూ. 60 వేల నుండి రూ. 8 లక్షల గజిటెడ్‌కు రూ. 80 వేలు నుండి రూ. 10 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. కారుణ్య నియామకానికి తగిన విద్యార్హతలు ఇంటర్ ఉండాలి. అయితే విద్యార్హత లేకున్న వారికి ఆఫీస్ సబార్డినేట్, టైపిస్టు పోస్టులు కూడా ఇస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీవో నెం 112ను విడుదల చేసినట్లు తెలిపారు.

హిందూ ధర్మ పరిరక్షణ కోసం తపించిన

మహనీయుడు పీవీఆర్‌కే ప్రసాద్

కడప, మారుతీనగర్ : హిందూధర్మ పరిరక్షణ కోసం తపించిన మహనీయుడు పత్తి వెంకటరామక్రిష్ణ ప్రసాద్ అని పలువురు గ్రూఫ్ టెంపుల్స్ ఈవోలు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు ముఖ్యులు కొనియాడారు. టీటీడీ ఈవోగా బాధ్యతలు నిర్వహించి పలు సంస్కరణలు ప్రవేశపెట్టి భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటుగా దళితవాడల్లో తిరుమలేశుని పట్ల భక్తిభావం పెంపొందించేందుకు అపార కృషి చేశారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన మృతికి సంతాపంగా గ్రూప్ టెంపుల్స్ ఈవో ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం కోఆపరేటివ్‌కాలనీలోని దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో పీవీఆర్‌కే ప్రసాద్ సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ వెంకటసుబ్బయ్య, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ తంబిసుబ్బరామయ్య, ప్రధాన కార్యదర్శి బి.రామ్‌మహేష్, ఎస్ఎస్ఎఫ్ రాయలసీమ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ, పలువురు దేవాలయ ఈవోలు పాల్గొన్నారు.



సంతాప కార్యక్రమంలో పలువురు ఈవోలు, హెచ్‌డీపీటీ సభ్యులు

‘మట్కా, జూదంతో కుటుంబాలు నాశనం’





ఆటోడ్రైవర్లకు మట్కాపై అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కర్‌రెడ్డి , ఆటోలకు పరివర్తన స్టిక్కర్లు అంటిస్తున్న సీఐ, ఎస్ఐ

కడప, క్రైం : మట్కాతో వారి జీవితం నాశనం కావడంతో పాటు వారి కుటుంబాలు కూడా రోడ్డుపాలవుతాయని కడప అర్బన్ సీఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. కడప నగరం ఐటీఐసర్కిల్ వద్ద ఆటోడ్రైవర్లకు పరివర్తన కార్యక్రమంపై మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కాను వదిలేస్తే వారి జీవితం సంతోషంగా వుంటుందని, అలాగే వారికి సమాజంలో గౌరవం కూడా వుంటుందన్నారు. మట్కా మహమ్మారి బారిన పడి ఎన్నోకుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయన్నారు. పరివర్తన కార్యక్రమం ద్వారా ప్రజలు అవగాహన పెంచుకొని జిల్లాను మట్కారహిత జిల్లాగా తయారుచేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. ఎక్కడైనా మట్కా జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే 9440796967కు సమాచారం ఇవ్వాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. అనంతరం మ ట్కాపై ఏర్పాటు చేసిన ‘పరివర్తన’ కార్యక్రమ పోస్టర్లను సీఐ విడుదల చేసి ఆటోలకు అంటించారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తి వేయండి

కడప, మారుతీనగర్ : చేయని తప్పునకు రాయచోటి డిపో కంట్రోలర్‌ను అన్యాయంగా సస్పెన్షన్ చేయడం సరైంది కాదని వెంటనే కంట్రోలర్‌ను విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు నాగముని కడప డిపోకోశాధికారి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా కడప రీజనల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఎన్ఎంయూ కడప రీజియన్ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. డ్రైవర్ చేసిన తప్పిదానికి ఆ డిపో కంట్రోలర్‌ను సస్పెండ్ చేయడం పద్దతిగా లేదన్నారు. ఈ విషయంగా సంబంధిత డిపో మేనేజర్ మానవత్వంతో స్పందించారని కోరారు. దీక్షలో రాయచోటి డిపో కండక్టర్ సుమిత్రయ్య, జమ్మలమడుగు డిపో డ్రైవర్ ఎంజీయూ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల కార్యదర్శులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో ఆర్టీసీ నాయకులు

279 జీవోను రద్దు చేయాలి



ఛలో విజయవాడలో మున్సిపల్ కార్మికుల మహా ప్రదర్శన

కడప, రవీంద్రనగర్ : రాయలసీమ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాయలసీమ ట్రేడ్ అనుబంధం 279 జీవోను రద్దు చేయాలని కోరుతూ ఛలో విజయవాడ చేరుకొని మున్సిపల్ కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుంకర రవి, నగర కార్యదర్శి కంచుపాటి శ్రీరామ్ మాట్లాడుతూ తక్షణం 279జీవోను రద్దు చేయాలి. అలాగే కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి. లేనిపక్షంలో 151 జీవోను సమగ్రంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, లక్షుమయ్య, సుబ్బయ్య, రమేష్, దాసు, కిరణ్, ప్రేమ్, సాగర్, పీవీరమణ, విచిత్ర వేషధారణలో మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

నేడు ఆంధ్రకేసరి జయంతి సభ

కడప, కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతిని పురస్కరించుకొని బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో సభ జరుగుతుందని డీఆర్‌వో తెలిపారు.

ప్రభుత్వ పథకాల ప్రయోజనాలలో అసమానత్వం తగదు

కడప, మారుతీనగర్ : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలలో అసమానత్వం తగదని, ముఖ్యంగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ క్రైస్తవులకు సంక్షేమ పథకాలు పొందేందుకుగాను సంవత్సరానికి 1 లక్ష రూపాయలు లోపు ఆదాయం ఉన్న వారికే పరిమితం చేయడం సరైందికాదని ఏపీ క్రిస్టియన్ లీడర్స్ ఫోరమ్ కన్వీనర్ అలవర్‌రాయ్‌అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో క్రైస్తవ నాయకులు బిషప్స్, వివిధ తెగల బిషప్స్ రాష్ట్ర క్రిస్టియన్ లీడర్స్, వివిధ సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్‌లకు సంవత్సరానికి ఆరు లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్నవారికి కూడా అర్హతనిచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు కిరణ్, సీనియర్ నాయకుడు బిషప్స్ దేవన్న, మనోహర్, జాన్‌మోజెస్, ఫిలిప్స్, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి పనుల్లో ప్రతిపైసా కూలీలకే చెందాలి



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న అడిషినల్ పీడీ సురేష్

రామాపురం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ప్రతి పైసా కూలీలకే చెందాలని డ్వామా అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్‌బాబు అన్నారు. మండలంలో 11వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మంళవారం ఉపాధి హామీ కార్యాలయ ప్రాంగణంలో ఓపెన్‌ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 గ్రామ పంచాయతీల్లో 1-7-2016 నుండి 31-5-2017 వరకు రూ.6.5 కోట్లతో జరిగిన పనులకు సంబంధించి సామాజిక బృందం సభ్యులు గ్రామాల వారిగా నివేధికలు చదివి వినిపించారు. మొదటిగా గువ్వలచెరువులో 24 పనులకు సంబంధించి రూ.7 లక్షల 45 వేలు, పింఛన్లు 165, బండపల్లె 34 పనులకు సంబంధించి రూ.39 ల క్షల 91 వేలు, పింఛన్లు 316, నీల కంట్రావుపేట 90 పనులకు గానూ రూ.21 లక్ష 96 వేలు, పింఛన్లు 182, కల్పనాయునిచెరువు 152 పనులకు గానూ రూ.42 లోల 59 వేలు, పింఛన్లు 135, కుమ్మరపల్లె 76 పనులకు సంబంధించి రూ.22 ల క్షల 27 వేలు, పింఛన్లు 264, సరస్వతిపల్లె 163 పనులకు గానూ రూ.37 లక్షల 2 వేలు, పింఛన్లు 158, కసిరెడ్డిగారిపల్లె 128 పనులకు సంబంధించి రూ.26 లక్షల 73 వేలు, పింఛన్లు 281, సుద్దమళ్ల 225 పనులకు గానూ సంబంధించి రూ.51 లక్షల 13 వేలు, పింఛన్లు 388, చిట్లూరు 193 పనులకు సంబంధించి రూ.64 లక్షల 74 వేలు, పింఛన్లు 536, హసనాపురం 215 పనులకు గానూ రూ.64 లక్షల 22 వేలు, పింఛన్లు 417, రాచపల్లె 385 పనులకు గానూ రూ.కోటి 25 లక్షలు, పింఛన్లు 572, నల్లగుట్టపల్లె 303 పనులకు గానూ రూ.57 లక్షల 12 వేలు, పింఛన్లు 464, గోపగుడిపల్లె 185 పనులకు గానూ రూ.44 లక్షల 53 వేలు, పింఛన్లు 149 పనులకు సంబంధించి రూ.6 కోట్ల 81 వెయ్యి ఖర్చు చేసినట్లు నివేధికలో వివరించారు.

గ్రామాల్లో కూలీలకు పనుల్లో కొలతల్లో తక్కువ ఉన్నచోట ఉపాధి సిబ్బందికి రెండు వారాలలోపు కొలతలు తక్కువ ఉన్న పనులను పూర్తి చేసి తనకు నివేధికలు పంపాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే ఆ మొత్తం రికవరీ కింద చెలల్లించాల్సి వస్తుందన్నారు. ఉద్యానవనశాఖ కింద ఎండిపోయిన మామిడి చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ప్రసాద్, క్లస్టర్ ఏపీడీ శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రమేష్‌రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ఎస్‌ఆర్‌పీ భాస్కర్, లక్ష్మిదేవి, ఏపీవో పెంచలయ్య, ఏపీయం ధర్మరాజు, డీఆర్‌పీలు, ప్రజలు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే మంచి దిగుబడులు


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీడీ

లక్కిరెడ్డిపల్లె: వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చునని డీడీఏ లక్ష్మణ్‌రావ్ పేర్కొన్నారు. మంగళవారం కుర్నూతల, కస్తూరాజుగారిపల్లె పంచాయతీలోని గుర్రయ్యగారిపల్లెలో చంద్రన్న రైతు క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైకోడెర్మా జిప్సంలను వందశాతం రాయితీతో ప్రభుత్వం ఉచితతో ఇస్తోందని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పూత, పిందె సమయంలో కలుపులు తీసి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులతో పాటు నూనెశాతం పెరుగుతుందన్నారు. రైతులు వేరుశనగపై శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఏడీఏ దివాకర్, వ్యవసాయాధికారులు వెంకట్రమణారెడ్డి, గోవర్ధన్, ఏఈవో కెరోలిన్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

వీరభద్రుడికి మయూర వాహనం బహూకరణ


దాతలు అందజేసిన మయూర వాహనం

రాయచోటిటౌన్ : పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రుడికి మంగళవారం రూ. లక్షా 30 వేలు విలువ గల మయూర వాహనాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గన్నామంతి రాధాక్రిష్ణ, అమరావతమ్మ దంపతులు ఈ మయూర వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఆధ్వర్యంలో దాతలు రాధాక్రిష్ణ, అమరావతమ్మ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వామి చిత్రపటాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ మయూర వాహనాన్ని స్వామి వారి ఉత్సవాలు, పండుగలు, బ్రహ్మోత్సవాల సమయాల్లో వినియోగిస్తామని ఆలయ ఈవో మంజుల తెలియజేశారు.

మండల కేంద్రానికి చేరిన గణనాధులు

గాలివీడు : ఈ నెల 25న వినాయక చవితి పర్వదినం నాడు కొలువు తీరడానికి గణనాధులు మంగళవారం నాటికే మండల కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పక్కన, మీసేవ కార్యాలయానికి ఎదురుగా గణనాధులను ఉంచారు. మండలంలో ప్రతియేటా వినాయక చవితిని ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ముందస్తుగా వినాయక విగ్రహాలను మండల కేంద్రానికి చేర్చడంతో ఈ ప్రాంతానికి వినాయక చవితి శోభను సంతరించుకొంది. మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితికి గణనాధులకొలువుకు గణేష్ మండపాలను సిద్ధం చేస్తున్నారు.

చంద్రన్న బీమా ప్రొసీడింగ్స్ పంపిణీ

చిన్నమండెం : మండలంలోని చిన్నమండెం బలిజపల్లెకు చెందిన ఉమకు మంగళవారం చంద్రన్న బీమా ప్రొసీడింగ్ పత్రాలను వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వేణుమాధవ్ అందజేశారు. బలిజపల్లెకు చెందిన తంగాల ఉత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె చంద్రన్న బీమా లబ్ధిదారురాలు. ఆమె సాధరణ మృతి చెందంతో మరణ సమయంలో రూ.5 నగదును అందజేశారు. అనంతరం రూ.25,000 రూపాయలను నామినీ అయిన పూనేటి ఉమ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. బీమా మంజూరు పత్రాలు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రమోహన్, మండల సమాక్య సబ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపైనే ప్రత్యేక శ్రద్ధ

సంబేపల్లె : ప్రభుత్వం చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు రాయచోటికి చెందిన సీనియర్ చిన్నపిల్లల వైద్యనిపుణులు బయారెడ్డి తెలిపారు. మంగళవారం రౌతుకుంట గ్రామం దిన్నెమీదపల్లెలో జవహర్‌బాల ఆరోగ్యరక్ష పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో చిన్నపిల్లలకు ఉచితంగా వైద్యసేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక చికిత్సలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సునిత జ్వరాల భారిన పడకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సదాశివారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఏఎన్‌యంలు తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

రాయచోటి	9985411187
రాయచోటి టౌన్	9441794427
రాయచోటిరూరల్	9676860131
సంబేపల్లె	9703163108
గాలివీడు	9441049010
చిన్నమండెం	8886297090
లక్కిరెడ్డిపల్లె	8897095884
రామాపురం	9441079032

సినిమా గైడ్

రాయచోటి	
ప్రసాద్	: జయజానకినాయక
గౌతమ్	: నేనేరాజు నేనేమంత్రి
సాయి	: లై
సోనీరాజ్	: జయజానకినాయక
గాలివీడు	
పావని	: బాహుబలి-2

పర్యావరణ పరిరక్షణ మానవత ధ్యేయం

లక్కిరెడ్డిపల్లె : పర్యావరణ కాలుష్య కూటమి నుంచి కాపాడేది పరిరక్షణకు మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ధ్యేయంగా పెట్టుకుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గంగమ్మజాతరలో 1000 మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ 2004లో పశ్చిమగోదావరిలో మొదలు పెట్టి 8 జిల్లాల్లో 30 వేల మందికిపైగా దీంట్లో మెంబర్లుగా చేరి పేద విద్యార్థులను, పేదలకు తోడ్పడుతున్నారన్నారు.

ఇప్పటికే దాదాపు కోట్ల రూపాయలు వసూలు చేసి పేద వారి మనుగడకు మానవత సేవా సంస్థ ఆదుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి, తిరుపతి రవీంద్ర, శివశంకర్‌రెడ్డి, చైర్మన్ బాలసుబ్రమణ్యం, చైతన్యరెడ్డి, నాగబసన్న, వెంకటక్రిష్ణయ్య, పురుషోత్తంరెడ్డి, ప్రసాద్‌యాదవ్, వీఆర్‌లో నరేంద్రరెడ్డి, గంగమ్మ దేవస్థానం చైర్మన్ క్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, ఈవో సురేష్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చంద్రన్నరైతు క్షేత్రంపై రైతులకు అవగాహన



వరిపొలంలో కాలిబాటల గురించి రైతులకు వివరిస్తున్న ఏవో సురేష్‌రెడ్డి

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లెలో మంగళవారం చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి రైతన్నకు వరిపంటలో కాలిబాటలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని సంటెయ్య, వెంకటసుబ్బారెడ్డి, అంకయ్య వరిపొలాల్లో కాలిబాటలు ఏర్పాటుచేసే విధానాన్ని గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలిబాటల వలన ముఖ్యంగా దోమపోటు రాకుండా నివారించవచ్చుని, అలాగే రైతులు ఎరువులు, పురుగుమందులు చల్లుకోవడానికి వీలుగా ఉంటుందని, గాలి, వెలుతురు బాగాసోకి పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు. ఈ కాలిబాటలను ప్రతి రెండుమీటర్లకు ఒక్కటి చొప్పున 20 సెంటీమీటర్ల వెడల్పుతో తూర్పు, పడమరలుగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రైతులు సాగుచేసిన సజ్జపంటను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సుబ్రమణ్యం, ఎంపీఈఓ సిద్దారెడ్డి, గ్రామీణ వికాసకేంద్రం కడప అధికారి విజయ్, సర్పంచ్ లక్ష్మీదేవి, ఆత్మ అధికారి పవన్, తదితరులు పాల్గొన్నారు.

నేలరాలిన రైతన్నల ఆశలు

వర్షానికి వాలిపోయిన సజ్జపంట

గోపవరం : ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట చేతికి అందే సమయంలో వర్షంధాటికి వాలిపోయింది. అసలే వరుస కరువులతో అల్లాడుతున్న రైతాంగం అప్పో, సప్పోచేసి సజ్జపంట సాగుచేశారు. శని, ఆదివారాల్లో కురిసిన కొద్దిపాటి వర్షానికి ఏపుగా పెరిగిన సజ్జపంట పూర్తిగా చేలో వాలిపోయింది. మరో 10 రోజుల్లో పంటకోసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పంట దెబ్బ తినడంతో రైతన్న లబోదిబోమంటున్నారు. మండలంలోని కాలనీ-1కు చెందిన దళితరైతు అప్పుచేసి 2 ఎకరాల్లో సజ్జపంటను సాగు చేశాడు. పంట బాగా పండింది అని సంతోషిస్తున్న సమయంలో వర్షార్పణం అయింది. వర్షం కొంత మందికి ఊరటకలిగిస్తే, మరి కొంత మందికి ఇబ్బంది కలిగించిందని చెప్పాలి. మండలంలో సుమారు 400 ఎకరాల సజ్జపంట నీటి తడులు లేక ఎండిపో యే పరిస్థితికి చేరుకోవడంతో కురిసిన కొద్ది పాటి వర్షం పంటకు జీవం పోసినట్లు అయింది.


వర్షానికి కింద పడిపోయి దెబ్బతిన్న సజ్జపంట

రూ. 30వేలు నష్టపోవాల్సి వస్తోంది



గత కొన్ని సంవత్సరాలుగా కరువుతో పంటల సాగులేక పోవడంతో అప్పులపాలు అయ్యాం. రూ. 30వేలు పెట్టుబడిపెట్టి సజ్జపంటను సాగు చేస్తే తీరా చేతికి వచ్చినపంట నేల పాలు అయింది. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

-పోలయ్య, రైతు, గోపవరం కాలనీ-1

సస్యరక్షణ చర్యలు చేపట్టండి


రామచంద్రాపురంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కాశినాయన : ప్రస్తుతం మండలంలో ఆకాశం మేఘావృతమై ఉన్నందువలన సాగుచేసిన పత్తి, కంది, వరిపంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ రవి, ఆత్మడిటిఎం శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిలో బాస్వరం, నత్రజని, పొటాష్ ఎరువులను మొక్కల మొదళ్ల వద్ద అంతకృషి ద్వారా వేయాలన్నారు. పత్తిపంట 30నుంచి 40 రోజుల వయసులో ఉంది కాబట్టి మెగ్నీషియం సల్ఫేట్ ఎకరాకు దుక్కిలో అయితే 20 కేజీలు, పిచికారి అయితే ఒక్కలీటరు నీటిలో 3కేజీల ప్రకారం పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేస్తే ఆకు ఎర్రబారకుండా ఉంటాయన్నారు. ప్రస్తుతం వరిలో ఆకుచుట్టు కన్పిస్తుందని, దీని నివారణకు కార్బన్‌హైడ్రోఫ్లోరైడ్ 250గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. కందిలో ఆకులకు అక్కడక్కడా రంధ్రాలు పడుతున్నాయని, అంతర్‌కృషి చేస్తే ఆకుతినే పురుగు పంటను ఆశించదన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి


చెన్నుపల్లె ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

కలసపాడు : మండలంలోని చెన్నుపల్లె ప్రాథమిక పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. గత 3సంవత్సరాలుగా పాఠశాలకు ఉన్న తాగునీటి బోరు చెడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం స్పందించి పాడైపోయిన చేతిపంపును పునరుద్దరించడమో, లేక డైరెక్ట్‌పంపింగ్ స్కీం ద్వారా పైపులైన్ వేయడమో చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : స్థానిక జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో 8సంవత్సరాలు విధులు నిర్వర్తించి ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరా వు అధ్యక్షతన మంగళవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా పద్మనాభరావు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన గురువులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహులు, విజయబాబు, సుగుణమ్మ, బాలఓబుళమ్మ, నాగరాజు, దశరథరామిరెడ్డిలను ఘనంగా సన్మానించారు.

వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ పద్మనాభన్

పోరుమామిళ్ల : వినాయక చవితి వేడుకలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పోరుమామిళ్ల సీఐ పద్మనాభన్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో హిందూముస్లిం పెద్దలతో శాంతిసంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహ ఏర్పాట్లకు పోలీసు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఈ వేడుకలను స్నేహపూరిత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం శాంతిసంఘం కమిటీని ఏర్పాటు చేశారు. ఎస్ఐ పెద్దఓబన్న, టీడీపీ నాయకులు ఇమామ్‌హుస్సేన్, ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, అబ్దుల్‌హక్, మాజ అంజుమన్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పనులు చేయించారు... కూలి మరిచారు

పోరుమామిళ్ల : ప్రభుత్వం వలసలను నివారించేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి కోసం మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పంట కుంటలను తవ్వించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే వారికి సకాలంలో కూలి డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోజువారి కూలి పనులకు వెళితే సాయంత్రానికి డబ్బులు అందుతాయని, ఉపాధిపనులకు వెళితే 2 నెలలుపైబడినా బిల్లులు అందకపోవడంతో కూలీలు తీవ్ర నిరాశ చెందుతు న్నారు. మండలంలో 17 పంచాయతీలకు సంబంధించి పంటసంజీవని కుంటల పనులు జరుగుతున్నాయి. ప్రతి రోజూ 1500 మంది, కొన్ని రోజులు 2వేల మందికిపైగా ఉపాధి పనులు చేస్తున్నారు. దాదాపు 4వేల మంది కూలీలకు మెటీరియల్ కాంపొండెంట్‌తో సహా కోటి రూపాయలు కట్టాల్సి ఉంది. బిల్లుల కోసం కూలీలు ఉపాధి కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఈవిషయమై ఏపీఓ శివశంకర్‌రెడ్డిని వివరణ కోరగా, దాదాపు 4వేల మంది కూలీలకు మెటీరియల్ కాంపొండెంట్‌కు సంబంధించి కోటి రూపాయలు రావాల్సి ఉంది. బడ్జెట్ లేని కారణంగా కూలీలకు చెల్లింపులు ఆలస్యమయ్యాయని, బడ్జెట్ రాగానే కూలి డబ్బులు అందేలా చూస్తామన్నారు.


ముసల్‌రెడ్డిపల్లె ప్రాంతంలో పంటసంజీవని పనుల్లో పాల్గొన్న కూలీలు

వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

కొండాపురం : వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కొండాపురం తహసీల్దార్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలో వినాయక ప్రతిమలు ఏర్పాటుచేసే మంటపాల వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహించే వారు అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అదేవిధంగా అక్కడకు వచ్చే భక్తులకు ఇబ్బంది పెట్టకూడదని, మట్టి విగ్రహాలను ఏర్పాటుచేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఐకమత్యానికి ప్రతీకలు పండుగలు-డీఎస్పీ

ఎర్రగుంట్ల: పండుగలు ఐకమత్యానికి ప్రతీకలని కడప డీఎస్పీ మాసూమ్ బాషా అన్నారు. వినాయకచవితి, బక్రీద్ పండుగల సందర్భంగా ఎర్రగుంట్ల సర్కిల్ పరిధిలోని ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లె, కమలాపురం మండలాల మత పెద్దలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఎర్రగుంట్ల సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వినాయకచవితి, బక్రీద్ పండుగలను హిందూ, ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గత సంవత్సరం తమకు ఏర్పడిన ఇబ్బందులు, ప్రస్తుతం తలెత్తే సమస్యలను కొందరు డీఎస్పీ దృష్టికి తెచ్చారు. అందుకు డీఎస్పీ స్పందిస్తూ పండుగ అంటే బంధువులంతా ఒకే చోట కలిసేదని, ఒకరి ఉద్దేశాలు ఇంకొకరు తెలుసుకుని సంతోషాన్ని పంచుకోవడమే అన్నారు. చదువుల కోసం, ఉద్యోగాల కోసం ఎక్కడెక్కడో ఉంటూ విడిపోయి వున్నారని అలాంటి నేపథ్యంలో అందరూ ఒకేచోట కలుసుకునేందుకు కలిగిన శుభసందర్భం పండుగ అన్నారు. సీఐ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఇబ్బందులు కలిగించే వారిని ఉపేక్షించమన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు చేసుకోవాలని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటనాయుడు, బాషా, రవికుమార్, ఏఎస్ఐలు వెంకటరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మాసుమ్ బాషా

గ్రామీణ తపాలా ఉద్యోగులను సివిల్ సర్వెంట్లుగా గుర్తించాలి



ధర్నా చేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు

జమ్మలమడుగు: గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వం సివిల్ సర్వెంట్లుగా గుర్తించాలని ఎఐజీడీఎస్‌యూ జమ్మలమడుగు శాఖ అసిస్టెంట్ కార్యదర్శి బాలాజీ పేర్కొన్నారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ పిలుపు మేరకు జమ్మలమడుగు డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 7వవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామీణ తపాలా ఉద్యోగుల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలన్నారు. ఆలిండియా జీడీఎస్‌యూల న్యాయమైన కోర్కెలు తీర్చాలన్నారు ధర్నా కార్యక్రమంలో నాగేశ్వరరావు, చంద్ర, పుల్లయ్య పాల్గొన్నారు.

బ్యాంకుల విలీనం వద్దు

జమ్మలమడుగు: బ్యాంకుల విలీనం చేయరాదని ఉద్దేశ్యపూర్వక బాకీ ఎగవేతదారులను శిక్షార్హులుగా ప్రకటించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ కార్యదర్శి ఓ.జె.రవీంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఎస్‌బిఐ శాఖ వద్ద వివిధ బ్యాంకులకు చెందిన బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధులు బహిష్కరించి సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకులను ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం తీసుకెళ్లడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కారుణ్య నియామకాల విషయంలో అవలంబిస్తున్న విధానాలను బ్యాంకుల్లో కూడా పాటించాలన్నారు. అనంతరం అవార్డు స్టాఫ్ సెక్రటరీ వెంకటనారాయణ, మాధవగోపాల్‌రెడ్డి, ఎస్‌బిఐ ఉద్యోగులు మాట్లాడారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్‌బ్యాంక్, ఆంధ్రాబ్యాంకు, రాయలసీమ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రేపు సీతారామ లక్ష్మణ హనుమంతు విగ్రహాల ప్రతిష్ఠ

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు శివాలయ శ్రీతల కంఠేశ్వరిదేవి ఆలయాల కుంభాభిషేకములు, శ్రీసీతారామ లక్ష్మణ హనుమంతుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 22వ తేదీ గ్రామోత్సవం, 23న ఉదయం 11 గంటలకు నాభి శిల్ప ప్రతిష్ఠ, సాయంత్రం 5 గంటలకు ధ్వజప్రతిష్ఠ, 24న ఉదయం 8 నుంచి 10 గంటలలోపు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ జరుగును. ఈ సందర్భంగా ఆయా తేదీల్లో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుంది. భక్తులు సమీప గ్రామాల నుంచి హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు.

నేటి నుంచి సామాజిక సర్వే

కొండాపురం : మండలంలోని ఎర్రగుడి గ్రామంలో బుధవారం నుంచి సామాజిక ఆర్థిక సర్వే జరుగుతుందని తహసీల్దార్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రెండో విడత ముంపు గ్రామాల్లో భాగంగా ఈ సర్వేను ఆర్డీఓ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇప్పటికే చామలూరు గ్రామంలో సర్వే ప్రారంభమైందని ఎర్రగుడిలో కూడా ప్రజలు సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

ఏటూరులో ఉచిత పశువైద్య శిబిరం



ఏటూరులో పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారులు

కొండాపురం : ఏటూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 57దూడలకు నట్టల నివారణ మందులు 71 పశువులకు గర్భకోశ చికిత్స, 92 పశువులకు సాధారణ చికిత్స అందించారు. రెండు పశువులకు కృత్రిమ గర్భధారణ నిర్వహించారు. ఈ పశువైద్యశిబిరంలో మొత్తం 56 మంది రైతులు లబ్ధిపొందారు. ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ జహూర్ అహ్మద్, తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం పశువైద్యాధికారులు మహ్మద్ గౌస్, రాజశేఖర్ రాజు, సూపర్‌వైజర్ రామ్మోహన్‌రెడ్డి, రామనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ఎర్రగుంట్ల: మానవత ఆవిర్భావదినోత్సవం సందర్భంగా ఎర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రఘురామిరెడ్డి, మేడారమేష్, మల్లికార్జునరెడ్డి ఇతర సభ్యులు మాట్లాడుతూ పేదలకు మానవత ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. విద్యార్థుల చదువులకోసం, ఆపదలో ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు.

ప్లాస్టిక్ స్థానంలో కాటన్ ఉత్పత్తులు

● మహిళలకు యూనిట్ల ఏర్పాట్లకు జువారీ ఆధ్వర్యంలో శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న జువారి లేడీస్ క్లబ్ అధికారుణులు

ఎర్రగుంట్ల: మహిళా సాధికారత సాధించినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందని జువారిలేడిస్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉమెన్ వెల్‌నెస్ అనే కార్యక్రమాన్ని వారు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా కర్మాగారంలో పనిచేసే మహిళలకు, చుట్టుపక్కల గ్రామాల్లోని మహిళలకు వారు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్లాస్టిక్ స్థానంలో కాటన్‌తో శానేటరీ నాప్‌కిన్స్ తయారీకి సంబంధించిన యూనిట్ల ఏర్పాటుకు కావాల్సిన వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమ గ్రామాల్లో తక్కువ పెట్టుబడితో తాము తయారు చేసిన ప్రాడక్ట్సును ఇక్కడే సేల్స్ చేసేవిధంగా ఆయా కంపనీల ప్రతినిధులతో మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. వీవీ సతీమణి శ్రీదేవివైయస్‌రావు, అంజుఅరోరా, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ బ్యాంకులు

ఎర్రగుంట్ల: బ్యాంకు ఉద్యోగుల సమ్మె వల్ల ఎర్రగుంట్లలోని భారతీయ స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ మూతపడింది. ఉద్యోగులు విధులకు రాకుండా మెయిన్‌గేటుకు బోర్డును తగిలించారు. అలాగే ముద్దనూరు రోడ్డులోని బ్రాంచ్, చిలంకూరులోని బ్రాంచ్ కూడా పనిచేయలేదు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.



మూతపడ్డ ఎర్రగుంట్ల మెయిన్‌బ్రాంచ్

మట్కా జోలికెళితే జీవితాలు నాశనం



వేపరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మైలవరం: మట్కా, జూదం జోలికెళితే జీవితాలే నాశనమవుతాయని మైలవరం, తలమంచిపట్నం ఎస్ఐలు సునీల్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, వేపరాల, వద్దిరాలలో మట్కా నిర్మూలనపై ప్లకార్డులతో విద్యార్థులతో పోలీసులు కలిసి పరివర్తన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మట్కా నిర్మూలించడానికి గ్రామాల్లో ర్యాలీని ర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ మట్కా వల్ల ఎన్నో జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయని, అలాంటి వ్యసనాలకు పాల్పడినవారు జీవితంలో ఎప్పటికి బాగుపడినట్లు చరిత్రలో లేదని, అలాంటి దుర్వ్యసనాలను ప్రజలు వ్యతిరేకించి వాటిని దరికి చేరనీయకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. కూలి పనులు చేసుకునేవారు మట్కా ఎక్కువగా ఆడుతున్నారని, వాటి వల్ల నష్టమే కానీ లాభం ఉండదన్నారు. మట్కాలతో కొన్ని కుటుంబాలే కోల్పోయినట్లు తెలిపారు. మట్కా వీడి ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. పోలీసులు ప్రభాకర్, రాజు, భాస్కర్‌రెడ్డి, వెంకటేషు, రవి, రమణయ్య, రాంబాబు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

తలాక్ వ్యవస్థ రద్దు శుభపరిణామం

● మహిళా సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి యు.యు. ప్రసాద్





మాట్లాడుతున్న జడ్జి యు.యు. ప్రసాద్, హాజరైన మహిళలు

కడప లీగల్ : భారత సుప్రీం కోర్టు తలాక్ వ్యవస్థను రద్దుపరచడం శుభపరిణామమని ఈ నిర్ణయం ముస్లిం మహిళలకు ఎంతో ఊరట కలిగించే అంశమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యు.యు. ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా సమాఖ్య కార్యాలయంలో రైట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మతపెద్దలు, కులపెద్దలు, మండల సమాఖ్య లీడర్లకు మహిళా చట్టాల పైన, బాల్యవివాహాలు, బాలల అక్రమరవాణా,మాధ్యమిక విద్య తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి యు.యు. ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలోని సాంఘీక దురాచాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. మహిళలు స్త్రీ సాధికారత చట్టాలపై అవగాహనను పెంపొందించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వై రామచంద్రారెడ్డి మాట్లాడుతూ డ్వాక్రాసంఘాలు అనుకుంటే ఎలాంటి కార్యక్రమాలనైనా విజయవంతం చేయవచ్చన్నారు. ప్రతి కుటుంబంలో బాలికలను, మహిళలను, గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం ఇన్‌చార్జ్ యుగవాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శివప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ నాగరాజు, జిల్లా గిరిజన శాఖ సభ్యుడు లలితాబాయి, రామకృష్ణ మఠం స్వామీజీ దివ్యానంద, సీఎస్ఐ చర్చి పాస్టర్ స్వరూప్, జిల్లాలోని అన్ని మండలాల సమాఖ్య లీడర్లు, బి. సుభాష్, ప్రోగ్రాం ఆఫీసర్ బాబా ఫక్రుద్దీన్, కోటిరెడ్డి కాలేజ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

నెలవారీ పదోన్నతులు వెంటనే చేపట్టాలి

కడప, ఎర్రముక్కపల్లె : విద్యాశాఖలో ప్రస్తుతమున్న ఖాళీలు జీవో నెం 67 ప్రకారం నెలవారీ పదోన్నతుల ద్వారా వెంటనే చేపట్టాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యా పరిషత్ రాష్ట్ర నాయకులు జి.శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్రగౌరవ అధ్యక్షులు ఒంటేరుశ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ బాబూరావునాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతమున్న ప్యానల్ జాబితా గడువు 31తో ముగియనున్నందున పదోన్నతులకై ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు నష్టం కలగకుండా న్యాయం చేయాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, విద్యాశాఖమంత్రిని కూడా కలిసి తెలియజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కేవీఎం హిందీభవన్, కెవిస్ పర్వతుల్లా, హిందీ సేవా సదన్ శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ సహదేవరెడ్డి,వీరన్న పాల్గొన్నారు.

మట్కా మహమ్మారి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

పోలీసు కళాజాగృతి బృందం ప్రదర్శన



మాట్లాడుతున్న డీఎస్పీ మాసూమ్‌బాష

కడప, క్రైం : జిల్లాలో మట్కా మహమ్మారిని పారద్రోలేందుకు జిల్లా ఎస్పీ అట్టాబాబూజీ పరివర్తన కార్యక్రమం రూపొందించారని, మట్కా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ షేక్‌మాసూమ్‌బాష పిలుపునిచ్చారు. కడప నగరం మాచుపల్లె బస్టాండులో పోలీసు కళాజాగృతి బృదం మట్కా మహమ్మారిపై నాలుక ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మట్కా బీటర్లు, మట్కా ఆడేవారు ఇంత వరకు ఎవరూ బాగుపడలేదని వారు తమ జీవితాలతో పాటు వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారన్నారు. మట్కా జోలికి వెళితే ఎంతటి వారినైనా వదలి పెట్టే పరిస్థితి లేదని హెచ్చరించారు. మట్కా మహమ్మారిని తరిమి కొట్టి జిల్లాకు మట్కా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పోలీసుజాగృతి బృందం ఎస్ఐ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో కళాకారుల బృందం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం కళా జాగృత బృందం మట్కా నిర్మూలనపై నాటక ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాస్కర్ రెడ్డి, ఎస్ఐలు రుషేంద్రబాబు, రాజారాజేశ్వర్‌రెడ్డి,ప్రజలు పాల్గొన్నారు.



పాల్గొన్న వారు

ప్రజలు, సిబ్బంది ఐకమత్యంతో మెలగాలి

లింగాల: బ్యాంకు అధికారులు, ప్రజలు కలిసికట్టుగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని కదిరి ఏపీజీబీ రీజనల్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం లింగాల బ్యాంకులో ప్రజలకు, బ్యాంకు మేనేజర్ కళ్యాణ్‌రాంకు చిన్నపాటు ఘర్షణ తలెత్తింది. దీంతో కొందరు ఈ విషయాన్ని ఆర్ఎంకు తెలియజేశారు. మంగళవారం ఆయన లింగాల ఏపీజీ బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆర్ఎంతో మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్ బ్యాంకుకు వచ్చిన వారు ఏదైనా సమాచారం అడిగితే దురుసుగా మాట్లాడుతున్నాడని, ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మేనేజర్ తీరుపై అసంతృ ప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. జిల్లాలో ఏపీజీబ్యాంకు 61శాఖలు ఉన్నాయని, ఇందులో ఈ ఏడాది రూ. 1833కోట్లు డిపాజిట్లు ఉన్నాయన్నారు. లింగాలలో రూ. 50కోట్లు అప్పులు ఇవ్వగా, వీటిలో వ్యవసాయానికి రూ. 30కోట్లు రుణాలు ఇచ్చామ న్నారు.

యువత సేవా మార్గం అలవరుచుకోవాలి





రక్తదానం చేస్తున్న యువత , యువతను సన్మానిస్తున్న దృశ్యం

కడప, స్పోర్ట్స్ : సమాజంలోని యువత చెడు మార్గాలను ఎంచుకోకుండా సమాజానికి ఉపయోగపడే సేవా మార్గాలను ఎంచుకుని జీవితం సుఖసంతోషాలతో గడపాలని 1వ పట్టణ పోలీసుస్టేషన్ సీఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం కడపలోని బృహద బ్లడ్ బ్యాంక్, బ్లడ్‌లివ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఐదో వార్షికోత్సవ సందర్భంగా వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి రక్తదానం చేసి యువతకు మార్గదర్శకంగా నిలిచారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌లివ్ యువకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైన సాధన ద్వారానే.. లక్ష్యసాధన



ప్రసంగిస్తున్న ఓ.వి.రెడ్డి

కడప, ఎర్రముక్కపల్లె : ఇష్టమైన సాధన ద్వారానే లక్ష్యసాధన సులభమవుతుందని ప్రముఖ సైకాలజిస్టు వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన కోర్సులు చదువుతున్నప్పుడు మొదటి నుంచి ప్రొఫెషనల్‌గా ఆలోచన విధానాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. అప్పుడే పాఠ్యాంశాల మీద ఆసక్తి రెట్టింపు అవుతుందన్నారు. మన ఆలోచనలే మనకున్నగొప్ప ఆస్తి కాబట్టి ఆలోచనలు తాజాగా, సానుకూలంగా ఉన్నతంగా ఉండేలా అలవరుచుకోవాలని తెలిపారు. విద్య అనేది అత్యంత ముఖ్యమైన, అవసరమైన సాధనమని గురు సమక్షంలో నిరంతరం తెలుసుకోవడం ద్వారా సులభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు రాజోలిసాయి, శరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

ఘనంగా రాహుకాలపూజలు





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, పూజ చేస్తున్న మహిళలు

కడప, మారుతీనగర్: కడప నగరం బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదుర్గాదేవి చల్లని చూపు తమ మీద ఉండాలని, ఆ తల్లికి ఇష్టమైన నిమ్మకాయ దీపాలను రాహుకాల సమయంలో వెలిగిస్తే కోరిన కోరికలు తీరి సంతోషంగా ఉండాలని భక్తులు ఆలయానికి వచ్చి ఉదయం నుంచి ఉపవాసదీక్ష చేస్తూ నిమ్మకాయలతో దీపాలను వెలిగించి పూజించారన్నారు. అమ్మవారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేశారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు ఆలయ ప్రధాన అర్చకులు పణి భూషణశర్మ, భవానిశర్మ భక్తుల చేత రాహుకాల పూజలు చేయించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం అమ్మవారికి అభిషేకాలు, సుమంగళీపూజ, రాహుకాల పూజ, ప్రతి పౌర్ణమి నవకలశస్నపనం (అభిషేకం), చండీ హోమాలు నిర్వహిస్తామని మల్లికార్జునరావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
12
పులివెందుల
కడప ॥ బుధవారం 23 ఆగస్టు 2017
పులివెందుల ॥ తొండూరు ॥ వేముల ॥ వేంపల్లె ॥ లింగాల ॥ సింహాద్రిపురం ॥ చక్రాయపేట

వేరుశనగ పంట పరిశీలన

వేముల: భూమయ్యగారిపల్లెలో సాగుచేసిన వేరుశనగ పంటను వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం జేడీ లక్ష్మణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న రైతు క్షేత్రం పథకం కింద ఈ వేరుశనగ పంటను ఎంపిక చేశారన్నారు. ఈ పంటకు వందశాతం రాయితీతో జిప్సం మంజూరు చేశామన్నారు. అనంతరం రైతులకు పంటల సాగులో మెలకువలను తెలియజేశారు. ఏడీఏ రమణారెడ్డి, కడప జేడీఏ గోవర్దన్, ఏఓ శ్రీవాణి, ఏఈఓలు రమణారెడ్డి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీ లక్ష్మణ్‌కుమార్

ర్యాగింగ్ రహిత కళాశాలగా తీర్చాలి

ఫ్రెషర్స్‌డే సమావేశంలో ప్రిన్సిపాల్ అశోక్‌బాబు సూచన


విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ అశోక్‌బాబు, విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు, హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

సింహాద్రిపురం: ర్యాగింగ్ రహిత కళాశాలగా సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాలను తీర్చిదిద్దుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఘనంగా కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులు కలిసిమెలసి ఉండాలన్నారు. విషయ పరిజ్ఞానంపై బృంద చర్చలు సత్ఫలితాలిస్తాయన్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం కోసం ప్రచారంలో భాగంగా ఇంజనీర్ల దినోత్సవం సెప్టెంబర్ 15న చుట్టుపక్కల పాఠశాలల్లోని ఎస్ఎస్‌సీ విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించి మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు, ర్యాగింగ్ నిరోధక కమిటీ సభ్యులు సురేష్‌బాబు మాట్లాడుతూ కళాశాలలో ఇంత వరకు ర్యాగింగ్ కేసులు నమోదు కాకపోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు ఎలాంటి భయాందోళన లేకుండా చక్కగా చదువులు సాగించుకోవచ్చన్నారు. ర్యాగింగ్ ఇతరులు పాల్పడినా వెంటనే బాధితులు 1800-180-5522 టోల్‌ఫ్రీ నెంబర్‌ను వాడుకోవాలని, సంఘటిత సమస్యలను ఎదుర్కోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

కళాశాల అధ్యాపకులు పివి సుబ్బారెడ్డి, ఉషారాణి, చంద్రశేఖర్, కృష్ణకిషోర్, నవీన్‌కుమార్, పవన్‌కుమార్‌నాయుడు, జిలాని విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతమైన స్థానానికి ఎదిగేలా ప్రయత్నించాలన్నారు. అనంతరం కొత్త విద్యార్థుల పరిచయ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


డీడీటీని చల్లిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య

వేంపల్లె: పరిసరాల పరిశుభ్రతతో దోమలు ఉండవని తద్వారా చాలా వరకు రోగాలు దూరమవుతాయని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. ముతుకూరులో వైద్యబృందంతో మంగళవారం పర్యటించారు. డీడీటీ స్ప్రే చేయించారు. దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తవహించాలని సలహా ఇచ్చారు. జ్వరం సోకిన వెంటనే ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో...

తొండూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దూరమవుతాయని పులివెందుల మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం సంతకొవ్వూరు పీహెచ్‌సీ పరిధి చెర్లోపల్లె, తిమ్మాపురం పేట గ్రామాలను ఆయన పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగాను, ప్రతి శనివారం పరిసరాల పరిశుభ్రత దినాలుగా ప్రజలు పాటించాలన్నారు. సంతకొవ్వూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రాంప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి


పులివెందుల తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ నేతలు

పులివెందుల టౌన్: చట్ట సభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం పలు డిమాండ్లపై తహసీల్దార్ ఎల్వీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనాభాను లెక్కించి రాజ్యాంగ పరంగా గుర్తించాలని కోరారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి, బీసీ సబ్‌ప్లాన్‌ను అమలు పరచాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్న వాదన రోజురోజుకూ బలపడుతోందన్నారు. దీనిని పార్లమెంటులో సాధించుకునేందుకు బీసీ నాయకత్వాలన్నీ ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

తొండూరులో...

తొండూరు: బీసీ సంఘాల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం డిమాండ్లపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన ఇతర కులాలను బీసీల్లో చేర్చే ప్రయత్నాన్ని వెంటనే విరమించాలని ఆయన డిమాండ్ చేశారు.

చవితి ఉత్సవాలకు తాత్కాలిక కనెక్షన్

సింహాద్రిపురం: వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ వారికి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నట్లు ఏడీఈ శ్రీకాంత్, ఏఈ రమేష్ రెడ్డి తెలిపారు. 25న వినాయకచవితి సందర్భంగా ఉత్సవ కమిటీ వారు విద్యుత్ వాడకకు తాత్కాలిక సర్వీసు తీసుకోవాలని కోరారు. సర్వీస్ కావాలనుకున్న వారు 250ఓల్ట్స్ లోపు రూ. 500 చార్జి, 500 ఓల్ట్స్‌కు రూ. 1000 చార్జి, 1000ఓల్ట్స్‌కు రూ. 2250, 1000 ఓల్ట్స్ అనంతరం అదనంగా ప్రతి 500ఓల్ట్స్‌కు రూ. 750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా రూ. 100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ కోరారు.

ప్రజలు, సిబ్బంది ఐకమత్యంతో మెలగాలి

లింగాల: బ్యాంకు అధికారులు, ప్రజలు కలిసికట్టుగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని కదిరి ఏపీజీబీ రీజనల్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం లింగాల బ్యాంకులో ప్రజలకు, బ్యాంకు మేనేజర్ కళ్యాణ్‌రాంకు చిన్నపాటు ఘర్షణ తలెత్తింది. దీంతో కొందరు ఈ విషయాన్ని ఆర్ఎంకు తెలియజేశారు. మంగళవారం ఆయన లింగాల ఏపీజీ బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆర్ఎంతో మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్ బ్యాంకుకు వచ్చిన వారు ఏదైనా సమాచారం అడిగితే దురుసుగా మాట్లాడుతున్నాడని, ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మేనేజర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. జిల్లాలో ఏపీజీబ్యాంకు 61శాఖలు ఉన్నాయని, ఇందులో ఈ ఏడాది రూ. 1833కోట్లు డిపాజిట్లు ఉన్నాయన్నారు. లింగాలలో రూ. 50కోట్లు అప్పులు ఇవ్వగా, వీటిలో వ్యవసాయానికి రూ. 30కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. లింగాల శాఖలో మొండి బకాయిలు లేవన్నారు.


బ్యాంకులో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్ఎం ప్రసాద్

రెగ్యులర్ పోస్టులను అమలు చేయాలి



బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

పులివెందుల టౌన్: బ్యాంక్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ పోస్టులను అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగులు మంగళవారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం సెక్రటరీ గిరిధర్, ఆంధ్రాబ్యాంకు అవార్డు ఎంప్లాయి యూనియన్ సుధాకర్ మాట్లాడుతూ బ్యాంకులను ప్రైవేటీకరణ విధానాన్ని రద్దుచేయాలన్నారు. బ్యాంకులను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలను విరమించుకోవాలన్నారు. ఖాతాదారులకు కస్టమర్ చార్జీలను తగ్గించాలన్నారు. వారానికి ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో...

వేంపల్లె: ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం బ్యాంకులు ఒకరోజు సమ్మె చేశాయి. దీంతో మంగళవారం వేంపల్లెలోని బ్యాంకులు మూతపడ్డాయి. స్టేట్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్ తదితర బ్యాంకులు ఈ సమ్మెలో పాల్గొన్నాయి. బ్యాంకులను ప్రైవేటీకరణ చేయవద్దని, బడా పారిశ్రామిక వేత్తలు ఎగవేసిన మొండి బకాయిలను రాబట్టి బ్యాంకుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలనే తదితర డిమాండ్లతో బ్యాంకు సిబ్బంది సమ్మె చేయడంతో బ్యాంకు లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో ఖాతాదారులు నిరాశగా వెనుదిరిగిపోయాయి. అయితే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు మాత్రం యథావిధిగా పనిచేశాయి.

సకాలంలో రుణాలు చెల్లించి తిరిగి రుణాలను పొందండి

బ్రహ్మంగారిమఠం : బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను పొందాలని ఏపీజీబీ సీనియర్ మేనేజర్ నాగమునిరెడ్డి, ఫీల్డుఆఫీసర్ సురేష్‌లు పేర్కొన్నారు. బి.మఠంలో వారు అప్పువసూళ్ల కొరకు పలు ఖాతా దారుల వద్దకు స్వయంగా వెళ్లి రుణాలను వసూలు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ నాగమునిరెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల నుంచి అప్పు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను పొందాలన్నారు. రైతులు, ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈయన వెంట ఫీల్డు ఆఫీసర్ సురేష్ ఉన్నారు.

పేరుకే మున్సిపాలిటీ ... అభివృద్ధి శూన్యం

● సమస్యలపై స్పందించాలని అధికారులకు చురక ● మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



సమావేశంలో ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు పేరుకే మున్సిపాలిటీ అని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పాలక వర్గం ఏర్పడి మూడున్నర ఏళ్లు అయినా గతంలో పంచాయతీ స్థాయిలో ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉండటం బాధాకరమన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో అక్కడక్కడ అరకొర పనులు జరిగాయేకానీ ఈ మూడున్నర ఏళ్లల్లో ఫలానా అభివృద్ధి చేశామని పాలక వర్గం చెప్పుకునేందుకు ఏమీ లేదన్నారు. ఇటీవల నియోజకవర్గంలోని ఖాజీపేటలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి 5 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారని, అయితే అందులో ఇప్పటి వరకు కోటి 10లక్షల రూపాయలు మాత్రమే నిధులు విడుదల అయినట్లు తెలుస్తోందన్నారు. మిగిలిన నిధులపై ప్రభుత్వం అశ్రద్ధ చూపడం శోచనీయమన్నారు. నంద్యాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తనకు అక్కడ ఎంతో అభివృద్ధి కనిపించిందని రఘురామిరెడ్డి పేర్కొన్నారు. అందులో 10శాతమైన మైదుకూరులో అభివృద్ధి చూపేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. రోజూ నాలుగైదు వార్డులు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఒకరిద్దరివే నిర్ణయాలా.... అధికార కౌన్సిలర్ ప్రశ్న : మున్సిపాలిటీలో ఏంజరుగుతోందో... మాకైతే అర్థం కావడం లేదు.. పనులు ఎంపికలో మార్పులు, చేర్పులు జరుగుతున్న విషయం కూడా కౌన్సిలర్లకు తెలియడం లేదంటే.. ఇక్కడ కౌన్సిలర్లకు ఏపాటి విలువ ఉందో అర్థమవుతోందని అధికార పార్టీ కౌన్సిలర్ సిద్దేశ్వరి మున్సిపల్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో ఒకరిద్దరి నిర్ణయాల మేరకే పనులు కేటాయిస్తున్నారని తీవ్ర స్వరంతో ఆరోపణలు చేశారు. అభివృద్ధి చేసే వాళ్లకు పనులు ఇవ్వడం లేదని, అభివృద్ధి చేయని వాళ్లకే పనులు కేటాయిస్తున్నారని ఇదే పద్ధతి కొనసాగితే ప్రతి పనిని అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశాలకు టీ బిస్కెట్ల కోసమే రావాలా అని ప్రశ్నించారు.

ప్రీ స్కూళ్ల ఏర్పాటుతో ఇబ్బందులు : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లీష్ మీడియాన్ని అమలు చేస్తూ ప్రీస్కూళ్లగా మార్చడం వల్ల గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సమావేశంలో పాల్గొన్న 15వ వార్డు కౌన్సిలర్ చెంచురామయ్య, 8వ వార్డు కౌన్సిలర్ సొద్దల రమాదేవిలు సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఒకే చోట చేర్చి ప్రీస్కూళ్లగా ఏర్పాటు చేశారని దీనివల్ల మిగిలిన రెండు కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లలు పౌష్టికాహారం కోసం ప్రధాన కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. గతంలో ఉన్న కేంద్రంలోనే జరపాలని వారు కోరారు. కాగా పట్టణంలో పారిశుధ్యం సరిగా లేదని, సిబ్బంది చెత్త సేకరణకు రావడం లేదని కౌన్సిలర్లు రమాదేవి, సిద్దేశ్వరిలు అధికారుల దృష్టికి తీసుకు రాగా, తమ వార్డులో రాత్రి వేళ వీధిలైట్లు వెలగడమే లేదని 12వ వార్డు కౌన్సిలర్ కవితా బచ్చన్ ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించి పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కమిషనరు కృష్ణారెడ్డికి సూచించారు.

ఎమ్మెల్యే ఆరోపణలతో మాటల్లేని పాలక వర్గం : ప్రతిపక్ష వైయస్సార్ సీపీకి చెందిన శాసనసభ్యులు రఘురామిరెడ్డి మున్సిపల్ సమావేశాని ఉద్దేశించి మాట్లాడుతూ మైదుకూరు మున్సిపాలిటీలో మూడున్నర ఏళ్లలో ఇసుమంతకూడా అభివృద్ధి లేదని ఆరోపిస్తూ వాఖ్యలు చేస్తున్నా తాము ఫలానా అభివృద్ధి చేశామని అధికార పక్షానికి చెందిన చైర్మెన్ రంగసింహ కానీ, పాలక వర్గంలోని కౌన్సిలర్లు మాటల్లేక ఊరికే చూస్తూండిపోయారు. అంతేగాని ప్రభుత్వ సహకారంతో తాము ఏమేమి అభివృద్ధి చేశామో వారు ఎమ్మెల్యే ఆరోపణలకు దీటుగా సమాధానం చెప్పలేకపోయారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ కూడా మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరేందుకు ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లాలని కౌన్సిలర్లతో పాటు తానుకూడా వస్తానని రఘురామిరెడ్డి అంటున్నా చైర్మెన్,కౌన్సిలర్లనుంచి ఎలాంటి స్పందన లేక పోవడం గమనార్హం.

చంద్రన్న బీమాతో ధీమా



బీమా పత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

దువ్వూరు: చంద్రన్న బీమా పథకం బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ధీమా లాంటిదని ఏపీఎం జయరాజ్, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్, జన్మభూమి కమిటీ సభ్యులు రమణయ్య నాయుడు పేర్కొన్నారు. స్థానిక శ్రీశక్తి భవనంలో దువ్వూరులో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు బీమా పత్రాలను పంపిణీ చేశారు. దువ్వూరు మాలవాడకు చెందిన పుల్లయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. చంద్రన్న బీమా పథకం కింద కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు మంజూరు కాగా గతంలో రూ.75 వేలు అందజేశారు. మిగిలిన రూ.4.25 లక్షల చెక్కును మృతుడి భార్య రోజమ్మకు మంగళవారం అందజేశారు. దువ్వూరు గ్రామానికి చెందిన జెర్రి నరసింహులు, మునెమ్మ సహజ మరణం పొందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.30 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యులు పంగా సుబ్బరాయుడు, బీమా మిత్ర శకుంతల, తెదేపా మైనార్టీ నాయకులు బందేఖాన్, మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

మట్కాతో జీవితాలు నాశనం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో మంగళవారం ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో మట్కాపై ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం కూడా ఏర్పాటు చేశారు. మట్కా ఆడవద్దని, అది వ్యసనమని మట్కాను మానుకోవాలని, జీవితాలు బుగ్గిపాలు అవుతాయని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ, హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి మాట్లాడుతూ మట్కాతో జీవితాలు నాశనం కాకుండా ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ర్యాలీలో చాపాడు జిల్లా జడ్పీ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పక వేయించాలి

దువ్వూరు : తట్టు, రూబెల్లా నివారణకు 9 నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్‌ను తప్పక వేయించాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నసింగనపల్లె, పెద్ద సింగనపల్లె, గొల్లపల్లె, వెల్లాలు కొట్టాలు, మదిరేపల్లె, బాలాయపల్లె, చల్లబసాయి పల్లె, మనేరాంపల్లె గ్రామాల్లో పాఠశాలలు, గ్రామాల్లో పర్యటించి 399 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శివరామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత శాస్త్రీయ భావాలను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

బ్రహ్మంగారిమఠం : సమాజంలో యువతో శాస్త్రీయ భావాలను పెంపొందించుకోవాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టూరిజం భవనంలో జిల్లాస్థాయి ఏఐవైఎఫ్ 2వ రోజు శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలకు యువత వ్యతిరేకంగా ఉద్యమించి శాస్త్రీయభావాలను పెంపొందించుకోవాలన్నారు. మూఢనమ్మకాలు, శాస్త్రీయ నాయకత్వ లక్షణాలు యువకులు ఏ విధంగా పెంపొందించుకోవాలనే అంశంపై శిక్షణా తరగతులను బోధించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ సమాజంలో యువత గొప్ప గొప్ప పనులకు తమ తెలివిని ఉపయోగించుకొని మంచి స్థానాల్లో స్థిరపడాలన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు వెంకయ్య మాట్లాడుతూ అన్యాయాన్ని ప్రశ్నించే తత్వం యువతలో కన్పించాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్, వెంకటేష్, మహేష్, నారాయణ, ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి హృదయనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీఆర్‌కే ప్రసాద్ మృతి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టుకు తీరని లోటు

మైదుకూరు : తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఈవో పీవీఆర్‌కే ప్రసాద్ మృతి హిందూ పరిరక్షణ ట్రస్టుకు తీరని లోటు అని సమరసత సేవా ఫౌండేషన్, ధర్మజాగరణ సభ్యులు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. మైదుకూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈవోగా ఉంటూ టీటీడీని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించి వారి హృదయాల్లో చిరస్థాయికి నిలిచిపోయారని, ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. దళితవాడల్లో సైతం ఆధ్యాత్మిక బోధనలు చేపట్టి కీర్తిని పొందారన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీ ఏర్పాటు

మైదుకూరు : భారత విద్యార్థి ఫెడరేషన్ మైదుకూరు మండల కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. మంగళవారం మైదుకూరులో జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు గండి సునీల్‌కుమార్, గండికోట శివకుమార్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా బి.శివనాయక్, కార్యదర్శిగా ఎం.కాశీనాయక్, సహాయ కార్యదర్శులుగా ఓబులేసు, నరసింహులు, ఉపాధ్యక్షులుగా జనార్ధన్, నరసింహ కోశాధికారిగా ప్రసాద్, కమిటీ సభ్యులుగా జగన్, భీమ్లానాయక్, ప్రశాంత్, లక్ష్మణ్‌నాయక్, జగన్, తేజ, భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వనితా కార్డు సౌకర్యాలను వినియోగించుకోండి

బ్రహ్మంగారిమఠం : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వనితాకార్డు పక్షోత్సవాల సందర్భంగా ప్రజలు వనితాకార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు డిపో మేనేజర్ ఎన్.మోసయ్య పేర్కొన్నారు. మంగళవారం బి.మఠం మండలంలో పలు గ్రామాల్లో వనితాకార్డు సౌకర్యాల గురించి ప్రచారాన్ని చేపట్టారు. బి.మఠం ఐదురోడ్ల కూడలిలో డిపో మేనేజర్ మోసయ్య మాట్లాడుతూ వనితా కార్డు రూ.100 ఖర్చు అవుతుందని, ఈ కార్డుమీద 5మంది ప్రయాణికులు కానీ, లక్షరూపాయలు ప్రమాద బీమా వస్తుందన్నారు. ప్రజలు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవిరెడ్డి, పీవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలోని చెట్లు నరికివేత

చాపాడు : చాపాడులోని దళితవాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలోని రెండు వేపచెట్లను ప్రమీల అనే మహిళ నరికించి నట్లు ఆగ్రామ సర్పంచ్ షేక్ పర్వీన్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.5వేలు ఉంటుందన్నారు. ప్రమీల జమ్మలమడుగు చెందిన వ్యాపారితో చెట్లను నరికించినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికించగా మొద్దులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

వ్యసనాల జోలికి వెళ్లవద్దు

పెద్దముడియం: వ్యసనాల జోలికి వెళితే జీవితాలు నాశనం అవుతాయని పెద్దముడియం ఏఎస్ఐ వెంకటయ్య, ఇన్‌ఛార్జి తహసీల్దారు షఫి అన్నారు. పెద్దముడియంలో పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, విద్యార్థులు, గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ, అధికారులు

సీపీడబ్ల్యూఎస్ స్కీంకు విద్యుత్ సరఫరా నిలిపివేత

40 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా ● ఇబ్బంది పడుతున్న ప్రజలు

మైలవరం: మైలవరం నుంచి సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలంలోని పలు గ్రామాలకు సరఫరా అయ్యే సీపీడబ్ల్యూఎస్ స్కీంకు గత మూడు రోజులుగా విద్యుత్తు బకాయిలు చెల్లించలేదని విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తుసరఫరా నిలిపివేశారు. మైలవరంలోని జలాశయం పంప్‌హౌస్ వద్ద (పల్లెలకు నీరు సరఫరా అయ్యే ట్యాంకు) విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో మోటార్లు ఆడక పల్లెలకు నీరు రాకపోవడంతో పల్లెల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీపీడబ్ల్యూఎస్‌కు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విద్యుత్తు బకాయిలు రూ.42,14,105 చెల్లించలేదని కరెంటు సరఫరా నిలిపివేసినట్లు విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. జమ్మలమడుగు పంచాయతీకి యూఐడీఎస్ఎస్ఎంటీ పథకం ద్వారా ఇంటెక్స్‌వెల్స్ కంప్ పంప్ హౌస్ నుంచి సరఫరా అయ్యే మోటార్లకు రూ.30,12,604 బకాయిలు ఉన్నాయన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీకి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రస్తుతానికి నీరు సరఫరా అవుతుంది. అయితే సీపీడబ్ల్యూ స్కీం ద్వారా సరఫరా అయ్యే దాదాపు 40 పల్లెలకు సరఫరా కాకుండా నిలిపివేశారు. మైలవరం మండలంలోని కమ్మవారిపల్లె, చిన్నకొమెర్ల, ఉప్పలపాడు, పెద్దముడియం మండలంలోని పెద్దపసుపులతోపాటు దాదాపు 40 గ్రామాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా వచ్చే నీటితో గ్రామాల్లో నీటి సమస్య లేకుండా ఉండేది. గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటినా గ్రామంలోని బోర్లలో కొంతమేర వచ్చే నీటితో సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా వచ్చే నీటితో గ్రామాల్లో నీటి సమస్య లేకుండా ఉండేది. అయితే ప్రస్తుతం సీపీడబ్ల్యూఎస్ స్కీం వద్ద విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో నీరు పల్లెలకు సరఫరా కాక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

● సమస్య పరిష్కరిస్తాం

సీపీడబ్ల్యూఎస్ స్కీం వద్ద విద్యుత్తు బకాయిలు చెల్లించాలని, విద్యుత్తు సరఫరా నిలిపివేసిన మా వాస్తవమే. ఈ సమస్య ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లాం. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. - ఏఈ విశ్వనాథ్

స్టీల్‌ప్లాంట్ సాధనకు రిలేదీక్షలు ప్రారంభం



దీక్షలకు మద్దతు తెలుపుతున్న స్టీల్‌ప్లాంట్ సాధన సమితి నాయకుడు ప్రవీణ్

ప్రొద్దుటూరు కల్చరల్: స్టీల్‌ప్లాంట్ సాధనకై తహసిల్దారు కార్యాలయం ఎదుట యువకులు రిలే నిరాహారదీక్షను మంగళవారం చేపట్టారు. ఈదీక్షలను సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ రిలేదీక్షను నిర్వహించారు. ఈదీక్షలో రమేష్, రమేష్, కళ్యాణ్, మౌలాలీలు కూర్చున్నారు. ఈదీక్షను స్టీల్ ప్లాంట్ సాధన సమితి నాయకుడు ప్రవీణ్, జీవనజ్యోతి విద్యా సంస్థలయజమాని అమర్‌లు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ జూదం ఆడే వారిని పోలీస్‌స్టేషన్‌ల నుండి విడిపించేందుకు రాజకీయ నాయకులు శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. ఉపాధి చూపే స్టీల్‌ప్లాంట్ లాంటి పరిశ్రమల పై దృష్టిసారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగ్ లాంటి పై యువత ఆసక్తి చూపుతున్నారని, వీరికి సరైన ఉపాధి లేకపోవడంతోనే ఈరంగాల్లో దృష్టిసారించారన్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి వారం రోజుల నుండి క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్యాటగరైషన్ చేయాలని లేబర్ కమిషనర్‌కు వినతి

ఎఱ్రగుంట్ల:ఆర్టీపీపీలో పనిచేస్తున్న 1300 మంది కాంట్రాక్టు కార్మికులకు క్యాటగరైషన్ చేయాలని 13.09.2012లో ఏపీ జన్కో యాజమాన్యం ఇచ్చిన మెమోనెంబర్ 71/2012ను అమలు చేయాలని ఏపీ జెన్‌కో,ట్రాన్స్‌కో వర్కర్స్ యూనియన్ నాయకులు సాంబశివారెడ్డి, పుల్లారెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు లేబర్ కమిషనర్‌కు విజయవాడలో వినతిపత్రం ఇచ్చారు. అన్ స్కిల్డ్-సెమిస్కిల్డ్, సెమిస్కిల్డ్-స్కిల్డ్, స్కిల్డ్-హై స్కిల్డ్‌గా ఇప్పించేందుకు మేనేజ్‌మెంట్ జాయింట్ మీటింగును ఏర్పాటు చేయాలని కోరారు.

ఆధార్‌సెంటర్ల పనితీరుపై చర్యలు తీసుకోవాలని వినతి

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆధార్ సెంటర్లు పూర్తిగా పనిచేయడంలేదని అందులో ఆరు మండలాల్లో మాత్రమే పనిచేస్తున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ దళితమోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ఆంజనేయులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆర్డీవో దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఆర్డీవో అన్ని ప్రాంతాల్లో ఆధార్ సెంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే సమస్యలు తీవ్రతరమవుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

పేదల ఇళ్లస్థలాల కోసం 28న ధర్నా

ఎఱ్రగుంట్ల: ఇళ్లు, ఇళ్లస్థలాలు లేని పేదలకు వెంటనే ఇవ్వాలని ఈనెల 28న ఎఱ్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్దఏపీజియస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఎఱ్రగుంట్ల మండలంలోని చిలమకూరులో ఎస్సీఎస్టీ కాలనీలో ఇళ్ళులేని పేదల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వానికి చిత్తవుద్ధి వుంటే ప్రభుత్వ భూమిని వెంటనే కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కార్యదర్శి, వెంకటరాముడు, సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి, భవాని, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ముమ్మరంగా లాడ్జీల తనిఖీ

జమ్మలమడుగు రూరల్:జమ్మలమడుగు పట్టణంలో అర్బన్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో లాడ్జీలు తనిఖీ చేశారు. రాత్రి 8 గంటలకు జయశ్రీ లాడ్జీ, సాగర్ తదితర లాడ్జీలన్నీ తనిఖీలు చేశారు. లాడ్జీలలో ఎవరైనా మద్యం తాగుతున్నారేమోనని, అసాంఘిక కార్యకలాపాలు తదితర వాటిపై చర్యలు తీసుకునేందుకు తనిఖీలు చేపట్టామని ఆయన తెలిపారు. అయితే కర్నూలు జిల్లా నంద్యాలలో 23వ తేదీ బుధవారం ఉప ఎన్నిక పోలింగ్ ఉన్నందున ముందస్తు చర్యలుగా జమ్మలమడుగులో పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం మెగాస్టార్ చివరంజీవి 63వ జయంతి సందర్భంగా చిరంజీవి ఫ్యాన్స్ యూత్‌వారు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మెడకల్ సూపరింటెండెంట్ రామేశ్వరుడు ప్రారంభించారు. చిరంజీవి ఫ్యాన్స్ రియాజ్, తాజ్, పెయింటర్ చలపతి, కొమెర్ల షాషావలి, శివ, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, రక్తనిల్వ కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ నెల్సన్ కుమార్, హెడ్‌నర్స్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మట్కా మహమ్మారిపై వ్యాసరచన పోటీలు

పెద్దముడియం: మండల కేంద్రం పెద్దముడియం, ఎన్.కొట్టాలపల్లె, పెద్దపసుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్కా మహమ్మారిపై అవగాహన కోసం విద్యార్థులచే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రూరల్ సీఐ ఉమామహే శ్వరరెడ్డి వ్యాసరచన పోటీలు పర్యవేక్షించారు. పోటీలు అనంతరం పెద్దపసుపుల పాఠశాలలో విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్కా మహమ్మారితో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రస్తుతం విద్యార్థి దశలో ఉన్న మీరు ఈ మట్కా మహమ్మారి గురించి తెలుసుకుని మీ కుటుంబాల్లో ఎవరు ఈ మట్కా జోలికి వెళ్లకుండా మీ వంతుగా వారికి అవాహన కల్పించాలని ఎక్కడైనా, ఎవరైనా అటువంటి కార్యకలాపాలు చేస్తుంటే విద్యార్థులు పోలీసులకు సహకరించాలని రూరల్ సీఐ కోరారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు. వ్యాసరచనపోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు రూరల్ సీఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

ఎఱ్రగుంట్ల: మాలేపాడుకు చెందిన గుర్రప్ప ఆయన తమ్ముడు శ్రీనివాసులుకు ఇటీవల భాగపరిష్కారాల్లో మనస్పర్థలు వచ్చాయి. దీంతో శ్రీనివాసులు తన అన్న గుర్రప్పను మంగళవారం చిన్నదండ్లూరుకు వెళ్లే వంకవద్ద కర్రతో కొట్టడంతో రక్తగాయాలు, వా పుడు గాయాలయ్యాయి. ఎస్ఐ రవికుమార్ స్పందించి ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి శ్రీనివాసులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరా చేయాలి

ముద్దనూరు: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పెద్దూరు కాలనీకి నీటి సరఫరా చేయాలని కాలనీవాసులు మంగళవారం అధికారులను చుట్టు ముట్టారు. ట్యాంకర్‌తో అందిస్తున్న నీటి సరఫరా నిలివేశారని సోమవారం ఉప్పలూరు గ్రామ పంచాయతీలోని పెద్దూరు కాలనీవాసులు తహసీల్దారు కార్యాలయం ఎదుట బిందెలతో నిరసన చేశారు. అందుకు స్పందించిన అధికారులు గ్రామంలోకి విచారణ నిమిత్తం మంగళవారం సాయంత్రం వెళ్లారు. ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ వెంకటరాముడు, కార్యదర్శి శ్రీనివాసులు విచారించారు. ఈ విషయం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడంతో ఎస్ఐ నరసింహారెడ్డి గ్రామానికి వెళ్లి కాలనీవాసుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. బుధవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ సమక్ష్యంలో సమస్యను పరిష్కరించి, కాలనీవాసులకు న్యాయం చేస్తామని ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్: రమణమహర్షి హైస్కూలులో పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించారు. మంగళవారం పాఠశాల ఆలమ్మి సొసైటీ ఆధ్వర్యంలో 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నగదు పురష్కారాలను అందించారు. 10వ తరగతిలో అత్యధిక జీపీఏ సాధించిన నాగలక్ష్మికి రూ.10 వేలను, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జయలక్ష్మికి రూ.10 వేలను పుల్లయ్య చేతుల మీదుగా అందించారు.

పచ్చగా పంట పొలాలు - ఆనందంలో రైతులు

జమ్మలమడుగు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు పంటలు సాగు కోసం, విత్తనాలు, ఎరువుల తెచ్చుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సాగు చేసిన పంటలు వర్షం పదును కావడంతో రైతన్నలు సంతోషంగా ఉన్నారు. అక్కడక్కడ పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి ఉంది. వర్షం లేక ఎండిపోతున్న పంటలు ఒక్కసారిగా రెండు రోజులు వర్షం కురవడంతో పంట పొలాలు పచ్చగా కళకళలాడుతున్నట్లు రైతులు తెలిపారు. అందులో భాగంగా జమ్మలమడుగు మండలంఓ పత్తి పంట 150 హెక్టార్లు, వరి 250 హెక్టార్లు, వేరుశనగ 40 హెక్టార్లు, కంది పంట 150 హెక్టార్లు, మొక్కజొన్న 145 హెక్టార్లు, పసుపు 50 హెక్టార్లు పంట పొలాలు సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు.



నగరపంచాయతీ అభివృద్ధిపై నిర్లక్ష్యం- కాంగ్రెస్

ఎఱ్రగుంట్ల: ఎఱ్రగుంట్ల నగరపంచాయతీ అభివృద్ధి విషయంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి వి.సులోచనారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు గొర్రెఓబయ్య విమర్శించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలన్నారు.

రైతులు ఉద్యమించాలి

సికెదిన్నె : రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతులు ముందుకువచ్చి ఉద్యమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాపిరెడ్డి తెలిపారు. మండలంలోని చింతకొమ్మదిన్నె, నరసన్నగారిపల్లె, అప్పరాజుపల్లె, మూలవంక తదితర గ్రామాలలో రైతులను చైతన్యపరిచారు. కడప నగరంలోని పాతబస్టాండులో గల సీపీఎం జిల్లా కార్యాలయంలో సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాయలసీమ శాశ్వత కరువు నివారణ, రైతుల సమస్యలు, ఆత్మహత్యలు నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీల అమలు కొరకు ఉద్యమించాలన్నారు. రైతులు ఉద్యమాల ద్వారానే తమ డిమాండ్లు సాధించగలరని రైతులు అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పంపుసెట్లను పరిశీలించిన పీడీ


రైతులతో మాట్లాడుతున్న పీడీ

వల్లూరు : ఎన్టీఆర్ జలసిరి కింద వేసిన బోర్ల వలన నిరుపేద రైతులకు ఎంతో ప్రయోజనాలు చేకూరాయని అలాగే సోలార్ పంపుసెట్లు ద్వారా నీరు బాగా వచ్చి పంటలు పండుతున్నాయని డ్వామా పీడీ విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోట్లూరు రెవెన్యూ గ్రామంలో ఎన్టీఆర్ జలసిరి ద్వారా వేసిన బోర్లు, సోలార్ పంపుసెట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులు గంగులయ్య, భీమయ్యలతో వీటి విషయం ఆరా తీశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చాలా మంది రైతులు సోలార్ వినియోగం పట్ల విముఖత చూపుతున్నారని అది చాలా తప్పని ఇక్కడి రైతులే ఆదర్శం అన్నారు. నీరు బాగా బోర్ల నుంచి వస్తున్నాయని విద్యుత్ మాకు బాగానే పని చేస్తున్నాయని రైతులు తెలిపారన్నారు. సోలార్ ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటిని సాగుకు ఉపయోగించుకుంటున్నారని రాత్రి సమయంలో తమ ఇంటి వద్ద వుంటున్నామని రైతులు తెలిపారని పీడీ అన్నారు. ఇక్కడ సోలార్ విజయవంతం కావడంతో ఇక్కడ దువ్వూరు, ఖాజీపేట తదితర మండలాలకు చెందిన రైతులకు పిలుచుకుని వచ్చి వారికి అర్థం అయ్యేలా వివరిస్తామన్నారు. వీరి వెంట మేనేజర్ సత్యనారాయన, స్థానిక ఏపీవో రాధిక, ఈసీ సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మృతి చెందిన వరలక్ష్మి

కమలాపురం రూరల్ : మండల పరిధిలోని అగస్తలింగాయపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి వరలక్ష్మి (37) విద్యుదాఘాతంతో మృతి చెందిందని ఎస్సై మహమ్మద్ రఫి తెలిపారు. ఎస్సై ఇచ్చిన సమాచారం మేరకు నల్లింగాయపల్లె గ్రామ సమీపంలోని భారతి సిమెంటు పరిశ్రమ వారు అగస్తలింగాయపల్లె గ్రామ సమీపంలో తాగు నీరుకు బోరు వేయించారని ఆ గ్రామంలోని వారందరూ ఈ బోరు దగ్గర నీరు తీసుకెళ్ళావారని మంగళవారం ఆగ్రామానికి చెందిన వీరంరెడ్డివరలక్ష్మి తాగునీటి కోసం వెళ్లి మోటార్ ఆన్‌చేయగా వెంటనే విద్యుత్ ప్రవహించి అక్కడిక్కడే మృతి చెందిందని ఎస్సై తెలిపారు. ఈమెకు ఇద్దరు పిల్లలు వైష్టవి తొమ్మిదవ తరగతి, తేజశ్వర్‌రెడ్డి ఐదవ తరగతి చదువుతున్నారు. ఈమె భర్త క్రిష్ణారెడ్డి గత ఐదు సంవత్సరాల క్రిందటే గుండెపోటుతో మృతి చెందాడని ఇప్పుడు తల్లికూడా మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాధలుగా మిగిలారని వీరికి దిక్కు ఎవరని బంధువులు వారిని చూచి కన్నీరుమున్నీరయ్యారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

పెండ్లిమర్రి : మొక్కల పెంపకంతోనే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించ వచ్చని జెడీఏ ఠాగూర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తిప్పరాజుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జెడీఏ హాజరై మాట్లాడుతూ వరి పంట సాగులో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల గాలి వెలుతురు బాగా ప్రసరించి తెగుళ్ళ, దోమపోటు రాకుండా నివారించవచ్చని, అలాగే ఎరువులు, మందులు పిచికారి చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఏడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులకు పెరట్లో, పొలాల్లో పెంచుకునేందుకు సతీతాఫలం, ఉసిరి, టేకు, జామ, దానిమ్మ, వెదురు మొక్కలను పెంచుకునేందుకు పంపిణీ చేస్తున్నామని ఈ మొక్కల ఆకులతో కషాయాలు కూడా తయారు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగఅర్చన, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పని సరి

పెండ్లిమర్రి : గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పని సరిగా వుండాలని ఎస్సై రోషన్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ విగ్రహాలను ఏర్పాటు చేసే ముందు వీఆర్‌వో, విద్యుత్‌శాఖ ఏఈతో అనుమతి పొంది పోలీసుస్టేషన్‌లో అనుమతి పొందాలన్నారు. విగ్రహ కమిటీల వారు ఎక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసేది, నిమజ్జనం ఎక్కడ, ఎప్పుడు చేసేది అనుమతి పత్రంలో పొందుపరచాలన్నారు. బాణాసంచా పేలుల్ల వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని తెలిపారు.

మద్యం తాగి వాహనం
నడిపితే శిక్ష తప్పదు

వల్లూరు : మద్యం తాగి, లైసెన్సు లేకపోయిన వాహనాలను నడిపితే కఠిన శిక్షలు తప్పవని జడ్జి ప్రొహిబిషన్ జి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గాంధీబొమ్మ సర్కిల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సును జడ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఎవరైనా ప్రభుత్వానికి సంబంధించిన బిల్లులో జాప్యం జరిగినా, బ్యాంకులలో సరైన నియమంలో రుణాలను చెల్లించకపోయినా, మద్యం సేవించి వాహనాలను నడిపితే శిక్షలు వుంటాయన్నారు. లైసెన్సులేనివారు తక్షణం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు ఇచ్చిన జాగ్రత్తలను పాటించాలన్నారు. అలాగే గ్రామాలలో చిన్న చిన్న తగాదాలకు దూరంగా ఉండాలని, అటువంటి ఏవైనా ఉంటే పోలీసులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో లాయర్ సుబ్రమణ్యం, పోలీసులు సునిల్, ఖాన్, బషీర్, ఆనంద్ గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే మట్కాపై పరివర్తన అనే అంశాన్ని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు పెట్టి బహుమతులను అందజేశారు.

వయ్యారిభామ
నివారణ చేపట్టండి

సికెదిన్నె : రైతులు తమ పంటలలో వచ్చే వయ్యారిభామ కలుపు మొక్కలను నివారించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. మండలంలోని గొర్లపల్లెలో మంగళవారం కేవీకే శాస్త్రవేత్తలు పంటలు పరిశీలించి ఆ పంటలలో ఉన్న వయ్యారిభామను నివారించటుకు రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెలికాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ

వల్లూరు : స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో గణితం, ఆంగ్లము, తెలుగు ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా రెండు రోజులుగా శిక్షణ అందజేస్తున్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధించే విధానాలను వివరించారు. ఈ శిక్షణను ఎంఈవో లీలెమ్మ పర్యవేక్షించారు. సర్వశిక్షా అభియాన్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారిని సుజాతారాణి పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సలహాలను సూచనలను అందజేశారు. ఈ శిక్షణ స్థానిక ప్రధానోపాధ్యాయురాలు చంద్రమ్మ, సీఆర్‌పీ విశ్వనాధ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పెండ్లిమర్రి : మట్కా మహమ్మారి వల్ల కలిగే పర్యవసనాలపై మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పెండ్లిమర్రి పోలీసులు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై విష్ణునారాయణ, కళాశాల అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియమే ఆధారం


చంద్రన్న రైతుక్షేత్రాలను పరిశీలిస్తున్న జెడీఏలు లక్ష్మణ్‌రావు, ఠాగూర్‌నాయక్ తదితరులు

సికెదిన్నె : భవిష్యత్తు తరాలకు సేంద్రీయ వ్యవసాయమే ఆధారమని, అందుకు రైతులు సిద్దంగా ఉండాలని కమిషనర్ జెడీఏ లక్ష్మణ్‌రావు తెలిపారు. మండలంలోని బిడికిలో గల చంద్రన్న రైతుక్షేత్రాలను మంగళవారం స్థానిక జెడీఏ ఠాగూర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న రైతు క్షేత్రంలో 25 ఎకరాలలో 10 మంది రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులు ఉచితంగా అందించిన ఇన్‌పుట్‌ను వరిలో సకాలంలో వేసి పంట దిగుబడులు పెంచాలన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ఉపయోగించుకుని కూలీల ఖర్చు, సమయం ఆదా చేసుకోవాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా అధిక లాభమని రైతులకు వివరించారు. జెడీఏ ఠాగూర్‌నాయక్ మాట్లాడుతూ రైతులు నాటు ఆవును పెంచుకుని దాని ద్వారా వచ్చే ఎరువుతో దాదాపు 10 ఎకరాలు సేంద్రీయ సాగు చేయవచ్చున్నారు. గత కొన్ని దశాబ్ధాలుగా రసాయన ఎరువులు విపరీతంగా వాడటం ద్వారా భూసారం పూర్తిగా పోయిందని, భూసారం తిరిగి పెంచేందుకు సేంద్రీయ పద్దతులు వాడటం ద్వారా మంచిఫలితాలు సాధించవచ్చున్నారు.

భూసార పరీక్షలు చేయించి భూమికి సరిపడ పంటను ఎంపిక చేసుకోవాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ వరిలో కాలిబాట వలన కలుగు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఈ సుమంత్‌రెడ్డి, ఏఈవో కవిత, ఎంపీఈవో శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

రైతులు పంట రుణాలను రెన్యూవల్ చేసుకోండి

పెండ్లిమర్రి : వెల్లటూరు సోసైటీలో పంట రుణాలు పొందిన రైతులు ఈనెలాఖరులోపు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీ లేని రుణానికి అర్హులవుతారని సోసైటీ అధ్యక్షుడు నాగేంద్రారరెడ్డి, సీఈవో సుబ్బారెడ్డిలు తెలిపారు. మంగళవారం సోసైటీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సోసైటీ పరిధిలోని సభ్యులందరికి రూపే కార్డులు ఇస్తున్నామని, సభ్యులు ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీ తీసుకొచ్చి మీరూపేకార్డును తీసుకెళ్ళాలన్నారు. ఈ కార్డు వున్న వారికి లక్ష రూపాయల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. కావున సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు.

పరిశుభ్రత పాటించినప్పుడే రోగాల నుంచి రక్షించవచ్చు

కమలాపురం రూరల్ : ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకున్న రోగాల నుంచి రక్షణ పొందవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి నాగలక్ష్మీరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పెద్దచెప్పలి పీహెచ్‌సీలోని సబోసెంటర్లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసన ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడు రోగాలు రావని దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ లాంటిరోగాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సినిమాగైడ్

కమలాపురం	
ప్రదీప్	: జయ జానకి నాయక
చెన్నూరు	
కృష్ణ	: ఫిదా

యూజీసీ వేతన సవరణ వెంటనే అమలు చేయాలి

పులివెందుల టౌన్: యూజీసీ 7వ వేతన సవరణ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని లయోలా డిగ్రీ కళాశాల అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మంగళవారం ఏఐఎఫ్‌యూసీటీఓ, ఏపీటీఏ పిలుపుమేరకు నిరసన వ్యక్తం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా చేసిన అధ్యాపకులకు కూడా పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. యూసీఏ వేతన సవరణ కూడా వెంటనే అమలు చేయాలన్నారు. అధ్యాపకుల సమస్యలను వెంటనే పూర్తిచేయకపోతే తీవ్రస్థాయి నిరసన వ్యక్తం చేస్తామన్నారు.

ఈజీ మనీ ఎక్కువ కాలం నిలవదు

నియోజకవర్గంలో వెల్లువలా పరివర్తన ర్యాలీ

పులివెందుల టౌన్: సులభంగా వచ్చే సొమ్ము ఎక్కువ కాలం నిలవదని ఏఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన పరివర్తన ర్యాలీ పోలీస్‌స్టేషన్ నుంచి పూలంగళ్ల సర్కిల్, బస్టాండ్ కూడలి మీదుగా ర్యాలీ సాగింది. మట్కాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పూలంగళ్ల వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మట్కా జోలికి వెళ్లకుండా వారిలో మార్పు కోసమే తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎక్కడైనా మట్కా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ఇకపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మట్కాను నమ్ముకుని ఎందరివో జీవితాలు రోడ్డునపడ్డాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్వీ ప్రసాద్, సీఐ రామకృష్ణుడు, ఎంపీడీఓ అక్రంబాషా, ఎస్‌ఐ రవి, ఎంఈఓ బండి వీరారెడ్డి, బీజేపీ నేతలు శశిభూషణ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


పరివర్తన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్పీ కృష్ణారావు, నినదిస్తున్న విద్యార్థులు

వేములలో...

వేముల: ఈజీ మనీ ఎక్కువ కాలం నిలవదని ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం వేముల జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన పరివర్తన ర్యాలీ పురవీధుల్లో సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అంతా కలిసికట్టుగా మట్కారహిత సమాజం కోసం పాటు పడదామని పిలుపునిచ్చారు. సంపాదించిన డబ్బును పొదుపుచేసుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు. జూదం వలన ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయని, మట్కా అనేది అందని ద్రాక్షపండు అని తెలియజేశారు. ఎంఈఓ రామ్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం, హెడ్ కానిస్టేబుల్ రాజారెడ్డి, కానిస్టేబుళ్లు మహేష్, మునిరెడ్డి పాల్గొన్నారు.

తొండూరులో...

తొండూరు: సమాజాన్ని పట్టిపీడిస్తున్న మట్కా మహమ్మారిని తరిమికొడదామని, మట్కా ఊబిలో చిక్కుకున్న వ్యక్తులకు దాని వలన ఎదురయ్యే అనర్థాలను అర్థమయ్యేలా వివరించి సుఖ జీవితాన్ని అలవర్చుకునేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కొండాపురం సీఐ చిన్నపెద్దయ్య, తొండూరు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మల్లేల ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పరివర్తనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషిగా జన్మించడమే గొప్ప అదృష్టమని, మట్కాతో జీవితాల్లో అదృష్టం వస్తుందనేది ఒక అపనమ్మకమన్నారు. దీంతో ఆస్తులు, భార్యాబిడ్డలను దూరం చేసుకుని రోడ్డుపాలవుతారన్నారు. తొండూరు ప్రాథమిక పాఠశాల, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పరివర్తనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో...

చక్రాయపేట: మట్కా అనేది ఒక మాయదారి రోగమని దానిని పారదోలాలని చక్రాయపేట ఎస్‌ఐ గోవిందరెడ్డి తెలిపారు. మట్కాపై పరివర్తన ర్యాలీ మంగళవారం విద్యార్థులచే నిర్వహించారు. ఈ ర్యాలీలో మట్కాను మానండి సుఖజీవనం గడపండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిలో పరివర్తన రావాలని, మట్కాను నివారించేందుకు కృషిచేయాలన్నారు. కష్టపడి పనిచేసుకుని జీవనం సాగించాలని సూచించారు. మట్కా కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

లింగాలలో...

లింగాల: మట్కా జోలికి వెళితే నష్టపోయిన వారే తప్ప బాగుపడిన వారు ఒక్కరూ లేరని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలియజేశారు. మంగళవారం పార్నపల్లెలో మట్కాపై పరివర్తన కార్యక్రమం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ మట్కా వలన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. అందుకే మట్కాజోలికి వెళ్లవద్దని ప్రజలతో ప్రమాణం చేయించారు. అంతేకాకుండా గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ చేపట్టి మానవహారం ఏర్పాటుచేసి మట్కాపై నినాదాలు చేశారు. అనంతరం లింగాల పాఠశాలల్లో మట్కాపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం

వేంపల్లె: రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ముసల్‌రెడ్డిగారిపల్లె సమీపంలో చంద్రన్న రైతు క్షేత్రాలను ఆయన పరిశీలించారు. సాగులో ఉన్న వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఉత్తమారెడ్డి తదితర రైతులు కరువు పరిస్థితులతో అల్లాడుతున్నామని, తీవ్ర వర్షాభావంతో వేసిన వేరుశనగ పంట అధ్వానంగా ఉందని వివరించారు. ఏ మేరకు దిగుబడి వస్తుందని రైతులను ప్రశ్నించగా ప్రస్తుత పరిస్థితుల్లో ఒకటి రెండు బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని వివరించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. చంద్రన్న క్షేత్రాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ గురించి ఏడీఏ వెంకటరమణారెడ్డి, ఏఓలు జ్యోత్స్న, గోవర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులకు తగ్గట్టు ఉపయోగ మనుకున్నప్పుడే సబ్సిడీ రైతులకు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనశుద్ధి, కంచె పంట, విత్తన నమోదు, సూక్ష్మ పోషకాలు, భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సురేష్, గౌతమి, ఎంపీఈఓలు పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీ లక్ష్మణరావు

నీటి సమస్య పరిష్కారం

వాల్వ్ మరమ్మతు పూర్తి

వేంపల్లె: వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌కాలనీలో దెబ్బతిన్న వాల్వ్‌లతో నీరు సక్రమంగా అందక ప్రజలు అవస్థలు పడేవారు. వాల్వ్‌ల నుంచి వచ్చే నీటితో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగాను, మురికికూపంగాను మారుతుండడంతో రాజీవ్‌కాలనీ వాసులు చర్యలు చేపట్టాలని పంచాయితీ అధికారులకు విన్నవించారు. సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి సూచన మేరకు ఉపసర్పంచు మునీర్, ఈఓ నాగభూషణంరెడ్డి యుద్ధప్రాతిపదికన వాల్వ్ మరమ్మతు పనులను ప్రారంభించారు. మంగళవారం కాలనీలో వాల్వ్‌లకు మరమ్మతు పనులుచేయించి బిందెలను ఏర్పాటు చేయించారు. త్వరితగతిన పూర్తిచేయించాలని పంచాయితీ సిబ్బందిని వారు సూచించారు. ఇక నుంచి కాలనీ వాసులకు నీరు సక్రమంగా అందుతుందని ఉపసర్పంచు, ఈఓలు పేర్కొన్నారు.


నిర్మాణ పనులు చేపడుతున్న ఉపసర్పంచు, ఈఓ

ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలి


చెక్కును పంపిణీ చేస్తున్న ఏపీఎం ఖాదర్‌వల్లి, మండల సమాఖ్య ప్రతినిధులు

వేంపల్లె: మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని వెలుగు ఏపీఎం ఖాదర్‌వల్లి సూచించారు. శ్రీరాంనగర్‌లో స్వయం సహాయక గ్రూపులకు చెందిన మేరీ, ప్రసన్నకు సబ్‌ప్లాన్ నిధుల కింద రూ. 50వేలు రుణ సదుపాయాన్ని కల్పించారు. మంగళవారం రూ. 50వేల చెక్కును పంపిణీ చేశారు. పండ్ల వ్యాపారం కోసం రుణసౌకర్యం కల్పించినట్లు ఏపీఎం తెలిపారు. సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయం పెంచుకోవాలని సూచించారు. వెలుగు సీసీలు రాజా, బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు షాహినాబీ, కార్యదర్శి రమణమ్మ, కోశాధికారి పాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమలకు అనుమతి తప్పనిసరి

తొండూరు: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే ప్రతిమలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెట్టే ప్రతిమలకు అనుమతి లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని కమిటీలకు సూచించారు.

రేపు మండల సమావేశం

లింగాల: గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి నివేదికలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

సినిమా గైడ్

పులివెందుల	
మారుతి	: ఫిదా
లక్ష్మీ	: ఆనందోబ్రహ్మ
రాఘవేంద్ర	: లై
శ్రీనివాస	: జయ జానకి నాయక
సుజాత	: నేనే రాజు నేనే మంత్రి
వేంపల్లె	
తిరుమల	: శమంతకమణి
వెంకటేశ్వర	: ఫిదా
నూర్జహాన్	: గౌతంనంద